fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 78 | విజయవాడ, బుధవారం 21 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

భారత వృద్ధికి కోతలు

2018–19లో 7.6 శాతం

గోల్డ్‌మాన్ సాచె అంచనాలు

పిఎన్‌బి స్కామ్‌తో ఒత్తిడి

రుణాలపై ప్రభావం 6



పవన్ పవన్.. జగన్ జగన్..

అసెంబ్లీలో ఇదే చర్చ

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

పవన్...జగన్ ప్రస్తుతం ఎపి అసెంబ్లీలో ఎటు చూసినా ఇదే చర్చ సాగుతోంది. అసెంబ్లీ మీడియా పాయింట్ మొదలు, శాసనసభ, శాసన మండలితో పాటు అసెంబ్లీ లాబీలోనూ ఈ చర్చ తప్ప మరో విషయాలు వినిపించడం లేదు. మంత్రులతో పాటు ముఖ్యమంత్రి ప్రసంగాల్లోనూ ప్రధానంగా వారి పేర్లే వినిపిస్తున్నాయి. పవన్, జగన్‌లను విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకున్నట్లు వారి ప్రసంగాల్లో స్పష్టం అర్థమవుతోంది. మంగళవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలందరిలో ఏ ఒక్కరూ పవన్, జగన్ ద్వయాన్ని ప్రస్తావించకుండా తమ ప్రసంగాన్ని కొనసాగించలేకపోయారు. బిజెపితో పవన్, జగన్ కుమ్మక్కయ్యారని ఆరోపించారు. వీరిరువురి వల్లే రాష్ట్రానికి హోదా రాకుండా పోతుందేమోనన్న అనుమానాలూ వ్యక్తం చేస్తున్నారు. పవన్ ప్రశ్నించాల్సింది బిజెపిని అని, చంద్రబాబును కాదని హితవు పలుకుతున్నారు. పవన్ ఇప్పటికైనా కళ్లు తెరవకపోతే జగన్‌కు పట్టినగతే పడుతుందని వ్యాఖ్యానిస్తున్నారు. బిజెపి స్క్రిప్ట్‌కు పవన్ యాక్షన్ చేస్తున్నారని, పవన్, జగన్ బిజెపి ఆడుతున్న డ్రామాలో పావులని అభివర్ణిస్తున్నారు. ప్యాకేజీని పాచిపోయిన లడ్డూలతో పోల్చిన పవన్ ఇప్పుడు దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదని మిగతా 9లో



భారతీయుల ఉద్యోగాలకు చేటు చేసే అమెరికా చట్టం

వాషింగ్టన్: అమెరికాలోని ట్రంప్ సర్కారు తాజాగా కాంగ్రెస్‌లో ప్రవేశపెట్టిన బిల్లు అక్కడి భారతీయుల కాల్ సెంటర్ ఉద్యోగాలకు చేటు చేయనున్నదని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ బిల్లు ప్రకారం విదేశాలకు చెందిన కాల్ సెంటర్ ఉద్యోగులు తమ ప్రాంతాన్ని తెలియ చేయాల్సి వుంటుంది. దీనితో పాటు తమ కాల్‌ను అమెరికాలోని ఓ సర్వీస్ ఏజెంట్‌కు బదిలీ చేయమని కోరే హక్కు వారి వినియోగదారులకు లభిస్తుంది. ఓహియోకు చెందిన సెనేటర్ షెర్రాడ బ్రౌన్ ప్రవేశపెట్టి ఈ బిల్లు కాల్ సెంటర్ ఉద్యోగాలను ఔట్‌సోర్సింగ్ ఇచ్చిన సంస్థల జాబితాను ప్రభుత్వానికి సమర్పించాలని, ఇతర దేశాలకు ఉద్యోగాలివ్వకుండా అమెరికన్‌లకు ప్రాధాన్యతనిచ్చే ఫెడరల్ కాంట్రాక్ట్‌లకు ప్రాధాన్యతనివ్వాలని ప్రతిపాదించారు. తాము చేస్తున్న కాల్‌ను తాము కోరుకున్న కస్టమర్ సర్వీస్ ఏజెంట్‌కు బదిలీ చేయాలని డిమాండ్ చేసే హక్కును ఈ చట్టం అమెరికన్ వినియోగదారులకు కల్పిస్తోంది. దీర్ఘకాలంగా అమెరికా వాణిజ్య, పన్నుల విధానం దేశీయ వ్యాపారానికి గండి కొడుతూ అమెరికన్లకు రావాల్సిన ఉద్యోగాలను పన్ను క్రెడిట్‌ల రూపంలో అమ్ముకుంటున్నారని, ఉత్పత్తులను రెనోసా, మెక్సికో, వుహాన్, చైనా మిగతా 9లో

మళ్లీ మ్యాచ్ ఫిక్సింగ్

- చర్చకు రాని అవిశ్వాసం
- బిజెపి, టిఆర్ఎస్, అన్నాడిఎంకెల హైడ్రామా
- మూడు పార్టీల తీరుపై భగ్గుమన్న ప్రతిపక్షాలు






ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన హామీల అమలులో విఫలం కావడతో కేంద్ర ప్రభుత్వంపై వైసిపి, టిడిపిలు ఇచ్చిన అవిశ్వాస తీర్మానాలు చర్చకు రాకుండా పార్లమెంట్‌లో 'హైడ్రామా' కొనసాగుతోంది. రోజుల తరబడి కొనసాగుతున్న టిఆర్ఎస్, అన్నాడిఎంకెల నిరసనలో మంగళవారం కూడా ఎటువంటి మార్పు లేకపోవడం, వీటిని సాకుగా చేసుకుని సభ వాయిదా వేస్తుండటంతో ఆ రెండు పార్టీలతో బిజెపి 'మ్యాచ్ ఫిక్సింగ్' చేసుకుందన్న విషయం స్పష్టమవుతోంది. పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లపై సభలో నినాదాలు చేయడాన్ని టిఆర్ఎస్, అన్నాడిఎంకెలు కనీసం ఐదు నిముషాలు నిలిపివేసినా, మోడీ సర్కార్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు వచ్చేది. కానీ ఆ మాత్రం అవకాశం ఇవ్వడానికి కూడా ఆ రెండు పార్టీలు అంగీకరించడం లేదు. అదే సమయంలో విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ ఇరాక్‌లో భారతీయులు చనిపోయిన అంశంపై మాట్లాడే సమయంలో ఆందోళనను రెండు పార్టీలు విరమించాయి. ఆమె ప్రకటన ముగిసిన వెంటనే టిఆర్ఎస్, అన్నాడిఎంకెలు తమ ఆందోళనను కొనసాగించడం గమనార్హం. దీంతో వరుసగా మూడో రోజు కూడా అవిశ్వాస తీర్మానం చర్చకు రాలేదు. సభ ఆర్డర్‌లో లేదని, గందరగోళం నెలకొందని సాకు చూపిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసులను స్పీకర్ మిగతా 9లో

హోదా ఎందుకివ్వరు..?




కనీసం అయిదేళ్లయినా ఇవ్వండి
పోలవరంలో చేతులు పెడితే కాలిపోతాయ్
బిజెపి, వైసిపి, జనసేనలపై చంద్రబాబు విమర్శలు

ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

విభజన సమయంలో అరుణ్‌జైట్లీ, వెంకయ్యనాయుడు పదేళ్ల హోదా ఇస్తామని చెప్పి, ఇప్పుడెందు ఇవ్వరని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రశ్నించారు. విభజనతో నష్టపోయిన ఎపిని ఇంకా కష్టాల్లోకి నెట్టొద్దని కేంద్రాన్ని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి – ఉద్యోగ కల్పన అంశంపై లఘు చర్చ సందర్భంగా మంగళవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బిజెపి నేతల తీరుపైనా పరోక్ష హెచ్చరికలు చేశారు. ఇప్పుడిప్పుడే కుదుటపడుతుంటే నిరాదరణకు గురి మిగతా 9లో

అప్పుల్ని అర్థం చేసుకోండి

మండలిలో మంత్రి యనమల
నిరుద్యోగ భృతిపై త్వరలో నిర్ణయం



ప్రజాశక్తి – అమరావతి బ్యూరో

అసలు అప్పులెందుకు చేస్తున్నామో అర్థం చేసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. కోట్ల రూపాయలు అప్పులు చేశామని విమర్శలు చేస్తున్నారని, అప్పులు చేయకుండా ఎవరూ ఉండరని, ప్రతి ప్రభుత్వం చేస్తూనే ఉంటుందని, తాము కూడా అలానే చేశామని ఆయన వివరించారు. శాసన మండలిలో మంగళవారం బడ్జెట్ తీర్మానంపై జరిగిన చర్చలో సమాధానమిస్తూ తామేమీ కొత్తగా అప్పులు చేయలేదని, ఆర్థిక లోటును దృష్టిలో ఉంచుకొనే అప్పులు చేశామన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.29,605 కోట్లు అప్పు చేసే అవకాశం ఉందన్నారు. రైతులకు రుణమాఫీ మిగతా 9లో

గోదా'వర్రీ'

- పొట్టదశలో ఉన్న రబీ వరికి నీటి ఎద్దడి
- 'పశ్చిమ'లో జనవరి నుంచే సాగునీటి వంతులవారీ విధానం
- ఇంజిన్లు, మోటర్లతో రాత్రీ పగలు అవస్థలు
- 'తూర్పు'లో పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం



ప్రజాశక్తి – ఏలూరు/రాజమహేంద్రవరం ప్రతినిధులు

గోదావరి జిల్లాల్లో రబీ వరికి సాగునీటి ఎద్దడి ఏర్పడింది. పొలాలు బీటలు వారడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వరి చివరి దశకు చేరుకున్న తరుణంలో పొలాలకు సాగు నీరందకపోవడంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఏర్పడుతోంది. చిరు పొట్టదశలో ఉన్న తూర్పుగోదావరి జిల్లాలోని రబీ వరికి ఏడు టిఎంసిల నీటి కొరత ఏర్పడింది. గోదావరిలో సహజ జలాల వృద్ధి అడుగంటడంతో బలిమెల, జోలాపుట్ నుంచి అదనంగా నీరు కావాల్సి ఉందని జల వనరులశాఖ ప్రభుత్వానికి నివేదించింది. జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలు సాగుచేశారు. రబీలో తూర్పు, పశ్చిమ, మధ్య డెల్టాలకు 85 టిఎంసిల నీరు అవసరమని జలవనరులశాఖ అంచనా వేసింది. సీలేరు నుంచి 70 టిఎంసిలు, గోదావరిలో సహజ జలవృద్ధి ద్వారా 15 టిఎంసిల నీరు వస్తుందని ఆశించింది. ఇప్పటివరకూ సీలేరు నుంచి 57 టిఎంసిల నీటిని వినియోగించారు. వరి పైరు పొట్టదశలో ఉన్న నేపథ్యంలో ఉభయగోదావరి జిల్లాల్లో రబీకి మార్చి నెలాఖరు వరకూ 25 టిఎంసిల నీరు అవసరం ఉంది. ప్రస్తుతం డొంకరాయి, సీలేరు, జోలాపుట్, బలిమెల నుంచి మన వాటాగా రావాల్సింది 13 టిఎంసిలు మాత్రమే ఉంది. గోదావరి సహజ జలాలు ఐదు టిఎంసిలు వచ్చినప్పటికీ ఇంకా ఏడు టిఎంసిల నీరు అవసరమని జలవనరులశాఖ ప్రభుత్వానికి తెలిపింది. పైరు పొట్ట దశలో ఉన్నందున చేలలో ఐదు సెంటీమీటర్ల చొప్పున నీరు పెట్టాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. ఈ నెలాఖరు వరకూ నీటిని అతి పొదుపుగా వాడాల్సి ఉన్నందున కాలువలకు సమృద్ధిగా నీటిని విడుదల చేయలేకపోతున్నామని జలవనరులశాఖ చెబుతోంది.

'పశ్చిమ'లో ఎదుగుదలలేని వరి

పశ్చిమ గోదావరి జిల్లాలో 4.60 లక్షల ఎకరాల్లో రబీ సాగు చేపట్టారు. సాగునీటికి జనవరి మొదటివారం నుంచే వంతులవారీ విధానం అమల్లోకి తెచ్చారు. నిడమర్రు, గణపవరం, ఉండి, పాలకోడేరు తదితర పది మండలాల్లో నీటిఎద్దడి సమస్య తీవ్రంగా ఉంది. వస్తున్న కొద్దిపాటి నీటినీ చేపల చెరువులకు మళ్లిస్తున్నారు. నీరు సరిగా అందక వరి ఎదుగుదల లేకుండా పోయింది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గడంతో పూర్తిగా సీలేరుపైనే ఆధారపడాల్సిన దుస్థితి ఏర్పడింది. రోజుకు దాదాపు ఆరు వేల క్యూసెక్కుల నీరు అవసరం కాగా.. నాలుగువేల క్యూసెక్కులే విడుదల చేస్తున్నారు. రైతులు రోడ్డెక్కితే మరో 200 నుంచి 300 క్యూసెక్కుల నీటిని పెంచుతున్నారు. రేయింబవళ్లు రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్నారు. ఇంజిన్లు, కారెలతో కాలువల్లో ఉన్న కొద్దిపాటి నీటిని తోడుకుంటూ పంటను రక్షించుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. పంట చివరి దశకు చేర డంతో నీటి తడుల సమస్య దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితులు నెలకొన్నాయి. ఇరగవరం, మిగతా 9లో

నటరాజన్ మృతి

శశికళకు 15 రోజుల పెరోల్ మంజూరు



బెంగళూరు : శశికళ భర్త నటరాజన్ మరుథప్ప చెన్నయిలోని ఓ ఆసుపత్రిలో మంగళవారం తెల్లవాజామున మృతి చెందారు. గుండెపోటుతో ఆదివారం ఆసుపత్రిలో చేరిన నటరాజన్ ఆరోగ్యం సోమవారం రాత్రికే పూర్తిగా క్షీణించింది. దీంతో వెంటిలేటర్‌పై ఉంచారు. వివిధ అవయవాలు పనిచేయకపోవడంతో మంగళవారం ఉదయం 1:35 గంటలకు మృతి చెందినట్లు గ్లోబుల్ హెల్త్ సిటీ హాస్పటల్ చీఫ్ అపరేటింగ్ ఆఫీసర్ షణ్ముగ ప్రియన్ తెలిపారు. భర్త అంత్య క్రియల్లో పాల్గొనడానికి ఎఐఎడిఎంకె నాయకురాలు వికె శశికళకు 15 రోజుల పెరోల్‌ను మంగళవారం మంజూరు చేశారు. దీంతో ఇక్కడి పరప్పణ అగ్రహారం సెంట్రల్ జైల్ నుంచి మంగళవారం మధ్యాహ్నం చెన్నైకు శశికళ బయలు దేరి వెళ్లారు.

నటరాజన్ మృతదేహాన్ని ప్రజల సందర్శనార్థం చెన్నైలోని బీసెంట్ నగర్‌లో స్వగృహంలో ఉంచుతారు. తరువాత అంత్యక్రియల కోసం తంజావూర్ జిల్లాలోని స్వగ్రామానికి తరలిస్తారు. నటరాజన్ 33 సంవత్సరాల పాటు ప్రజా సంబంధాల అధికారిగా పనిచేశారు. 1975లో శశికళను వివాహం చేసుకున్నారు. రూ. 66.6 కోట్ల అక్రమాస్తుల కేసులో 2017 ఫిబ్రవరిలో సుప్రీంకోర్టు శశికళకు నాలుగేళ్ల జైలు శిక్ష విధించిన సంగతి తెలిసిందే. 2017 అక్టోబర్‌లో నటరాజన్‌కు లివర్, కిడ్నీ మార్పిడి ఆపరేషన్ జరిగినప్పుడు కూడా శశికళ పెరోల్‌పై బయటకు వచ్చారు.

సభకు రెండు సవరణ బిల్లులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయ సహకార సంఘాల చట్టం- 1995 సవరణ బిల్లును మంత్రి పి ఆది నారాయణరెడ్డి మంగళవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. సభ్యులు కానివారి నుంచి సంఘాలు డిపాజిట్లు సేకరించడాన్ని తగ్గించడానికి, 1949 బ్యాంకింగ్ క్రమబద్ధీకరణ చట్టానికి అనుగుణంగా నిబంధనలు ఉండేట్లు చూడటానికి, ద్రవ్య అక్రమ చలామణిని నిరోధించడానికి, డిపాజిటర్ల ప్రయోజనానికి రక్షణ ఉండేలా చూడటానికి కొత్త సవరణ బిల్లు దోహదపడుతుంది. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయముల (స్థాపన, క్రమబద్ధీకరణ) చట్టము, 2016 సవరణ బిల్లును మంత్రి గంటా శ్రీనివాసరావు మంగళవారం శాసనసభలో ప్రవేశ పెట్టారు. ఆంధ్రప్రదేశ్‌ను విజ్ఞాన మరియు విద్యకు కేంద్ర స్థానంగా చేయడానికి ప్రైవేటు యూనివర్సిటీల సవరణ బిల్లు దోహదపడుతుంది.

నంది నాటకోత్సవం

తూర్పుగోదావరి జిల్లా రాజ మహేంద్రవరంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవాలలో భాగంగా సుప్రభాతం నాటికలోని ఒక సన్నివేశం



ఉత్సాహంగా నంది నాటకోత్సవాలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం అర్బన్

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నంది నాటకోత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో నిర్వహిస్తున్న నంది నాటకోత్సవంలో మంగళవారం పాలకొల్లు శ్రీధర రాధ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యాన 'సుప్రభాతం' సాంఘిక నాటకాన్ని ప్రదర్శించారు. ప్రస్తుత కాలంలో పత్రికలు పాలకుల చేతుల్లో కీలుబొమ్మలుగా మారిన వైనాన్ని, నైతిక విలువలను కోల్పోతున్న తీరును నాటిక ద్వారా తెలియజెప్పారు. పత్రికల పాత్ర సమాజంలో ఎలా ఉండాలో కళ్లకు కట్టినట్టు చూపారు. రెండో ప్రదర్శనగా కళావాణి ఉభయ గోదావరుల ఆధ్వర్యాన 'భూమి దుఃఖం' సాంఘిక నాటిక ప్రదర్శితమైంది. భూమితో మానవులకు గల సంబంధం విశిష్టతను, భూమిని కాపాడుకోవడం కోసం రైతులు పడిన వెతలను నాటిక ద్వారా చాటి చెప్పారు. తరువాత ప్రదర్శనగా ఏలూరు ఎజిఆర్ ఆర్ట్స్ ఆధ్వర్యాన 'నాగులు తిరిగే కోనలో' సాంఘిక నాటికను ప్రదర్శించారు. రక్షక భటులుగా ఉండాల్సిన పోలీసులు భక్షక బటులుగా మారితే జరిగే పరిణామాలు, చివరికి ప్రజలు వారికి వేసే శిక్ష ఎలా ఉంటుందో ఈ నాటిక ద్వారా తెలియజెప్పారు. మధ్యాహ్నం తిరుపతికి చెందిన శ్రీ శృంగా వల్లభ కళా ఆర్ట్స్ ఆధ్వర్యాన 'ఆఖరి మజిలీ' నాటికను ప్రదర్శించారు. ప్రతిఫలం ఆశించకుండా కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడమే అసలైన మానవత్వం అనే ఇతివృత్తంతో నాటిక సాగింది. అనంతరం విజయనగరం గురజాడ యువ కళాకేంద్రం వారి 'మేడిపండ్లు' నాటిక ప్రదర్శించారు. ఆశయాల కోసం పాటుపడకుండా అవకాశవాదంగా మారిపోతే సమాజంలో మార్పు ఎలా వస్తుందని? నాటిక ద్వారా ప్రశ్నించారు. దీనికి రచన, దర్శకత్వం పిల్లా రామ్‌ప్రసాద్ వహించారు.



రాయలసీమ @ 40

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు మండుతు న్నాయి. ముఖ్యంగా రాయలసీమలోని అనంతపురంలో 40, కర్నూలులో 39 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. విశాఖ ఎయిర్‌పోర్టు, తిరుపతి, తుని, గన్నవరం 36, కాకినాడ, మచిలీపట్నం, బాపట్ల 33 డిగ్రీల చొప్పున నమోదయ్యాయి. బుధవారం కూడా ఇదే పరిస్థితులు కొనసాగుతాయని విశాఖ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. విదర్భ పరిసరాల్లో ఉపరితల ఆవర్తనం, ఉత్తర ఒడిశా నుంచి విదర్భ పరిసరాల్లో ఏర్పడిన ఆవర్తనం మీదుగా ఉత్తర కర్నాటక వరకు అల్పపీడన ద్రోణి ఏర్పడినట్లు భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి కారణంగా రాష్ట్రంలో పెద్దగా వాతావరణంలో మార్పులు ఉండకపోవచ్చన్నారు. ఒకటి రెండు ఉష్ణోగ్రతలు పెరగడమో లేక తగ్గడమో జరుగుతుందన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.
94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగ పడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ప్రజ్ఞ

1 బెలారస్‌లో భారత రాయబారిగా ఏవరు నియమితులయ్యారు?
2. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్ మొబైల్ ప్రచారానికి వినియోగించిన 'కేంబ్రిడ్జ్ అనలిటికా' యాప్ ఏంత మంది ఫేస్‌బుక్ యూజర్ల డేటాను తస్కరించింది?
3. బాలలపై జరుగుతున్న నేరాలు 2015-16 కాలంలో ఏంత శాతానికి పైగా పెరిగినట్లు జాతీయ నేర నమోదు విభాగం గణాంకాల్లో వెల్లడయింది?
4. ఆల్ ఇంగ్లాండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ 2018 పురుషుల, మహిళల సింగిల్స్ టైటిల్స్ విజేతలు?
5. తాజాగా ఏ ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ అన్ని ఫార్మెట్ల క్రికెట్‌కు నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు?

సమాధానాలు 7లో


టిడిపిని దెబ్బతీసేలా
పవన్ వ్యాఖ్యలు అనూహ్యం

- పార్టీ సమావేశంలో చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడిపిని దెబ్బతీసే విధంగా పవన్‌కల్యాణ్ మాట్లాడతారని తాను ఊహించలేదని, కష్ట కాలంలో ఇలా మాట్లాడమేమిటంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపి తరపున వైసిపి, జనసేన పార్టీలు వకాల్తా తీసుకుని మాట్లాడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విమర్శించారు. ఉండవల్లిలోని గ్రీవెన్స్ హాల్‌లో మంగళవారం జరిగిన టిడిపి సమన్వయ కమిటీ సమావేశంలో సిఎం మాట్లాడుతూ ఆ రెండు పార్టీల దురుద్దేశం, దుర్బుద్ధి బైటపడ్డాయన్నారు.

వాటిని ప్రజలు అర్థం చేసుకున్నారన్నారు. అన్ని వేళ్లా ప్రధాని మోడీ వైపు చూపిస్తుంటే ఈ రెండు పార్టీల వేళ్లా తన వైపు చూపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. పవన్



కల్యాణ్ ఉదయం ఒకటి, మధ్యాహ్నం మరొకటి, సాయంత్రం ఇంకొకటిగా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. నంబూరు సభలో లోకేశ్‌పై పవన్ ఆరోపణలు చేసి, ఆతర్వాత అంతా అన్నారు కాబట్టే అన్నాను తప్ప ఆధారాలు లేవని, ఇపుడు మళ్లీ ఆధారాలు ఉన్నాయని అంటున్నట్లు తెలిపారు. అప్పుడేమో ప్యాకేజీ పాచిపోయిన లడ్లు అన్న పవన్ నేడు హోదా అవసరం లేదని నిధులు ముఖ్యమని అంటున్నారని సిఎం అన్నారు. బిజెపి అన్యాయం చేయడమేకాదు.. ఎదురు దాడికీ సిద్ధపడిందన్నారు. తనపై దాడి చేయడమంటే రాష్ట్రాన్ని బలహీన పరచడమేనని చంద్రబాబు పేర్కొన్నారు. అవిశ్వాసంపై నోటీసు ను అనుమతించకుండా మూడు రోజులుగా పార్లమెంట్‌ను వాయిదా వేస్తున్న విధానాన్ని ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని తెలిపారు. నాలుగేళ్ల ఓపికగా ఎదురుచూశామన్నారు. రాష్ట్రానికి న్యాయం జరుగుతుందనే బిజెపితో పొత్తు పెట్టుకున్నామన్నారు. ఎక్కడా తొందరపడలేదని చెప్పారు. పదవులు ముఖ్యం కాదు రాష్ట్ర ప్రయోజనాలే ముఖ్యమని స్పష్టం చేశారు. పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సమన్వయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల వల్లే ప్రాజెక్టులు ఆలస్యం

- ఆర్అండ్‌బి మంత్రి అయ్యన్న పాత్రుడు
- చర్యల కమిటీకి మండలి అంగీకారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రెవెన్యూ, రోడ్ల భవనాల శాఖ అధికారుల వల్లే వివిధ ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయని ఆ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. నెల్లూరు జిల్లా కావలి పట్టణంలో రైల్వే వంతెన నిర్మాణాన్ని ఎప్పటిలోగా పూర్తిచేస్తారని టిడిపి శాసనమండలి సభ్యులు బీదరవిచంద్ర శాసనమండలిలో మంగళవారం ప్రశ్నించారు. ఈ సందర్భంగా మంత్రి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వంతెనకు సంబంధించి భూసేకరణ చేయాల్సి ఉందని, అధికారులు వీటిపై దృష్టి సారించడం లేదని చెప్పారు. ఈ ఫైల్ చీఫ్ ఇంజనీర్ వద్దకు 2016లో వచ్చిందని తెలిపారు. ఇంతవరకు అది తన వద్దకు రాలేదని తెలిపారు. అధికారుల వల్ల ప్రభుత్వ ఖజానాపై భారం పడుతుందన్నారు. ఇలాంటి వారిపై చర్యలకు కమిటీ ఏర్పాటు చేయాలని శాసనమండలి చైర్మన్ ఎన్ఎండి ఫరూక్‌ను కోరాగా, అందుకు చైర్మన్ అంగీకరించారు.

దళిత బ్యాంక్ ఏర్పాటు చేయాలి: డొక్కా

దళితులకు రుణాలు ఇచ్చేందుకు ప్రత్యేకంగా దళిత బ్యాంక్ ఏర్పాటు చేయాలని టిడిపి సభ్యులు డొక్కా మాణిక్యవరప్రసాద్ కోరారు. దళితులకు రుణాలు మంజూరు చేయడంలో ఎస్సీ కార్పొరేషన్ విఫలమయిందని చెప్పారు. భూమి కొనుగోలు పథకం జిల్లాల్లో అమలు కావడం లేదని శమంతకమణి అన్నారు.

'గొట్టిపాడు' నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదు: బొడ్డు నాగేశ్వరరావు

గొట్టిపాడులో దళితులపై దాడులు చేసిన నిందితులను ఎందుకు అరెస్టు చేయలేదని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు నిలదీశారు. గుంటూరు జిల్లా గొట్టిపాడులో దళితులపై దాడులు, సాంఘిక బహిష్కరణలపై వివరాలు చెప్పాలని సాంఘిక సంక్షేమ శాఖమంత్రి నక్కా ఆనంద్ బాబును ప్రశ్నించారు. నిందితులపై కేసులు నమోదు చేశామని, గ్రామంలో 8మంది కానిస్టేబుళ్లతో పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కేసులు నమోదు చేసి ఎందుకు అరెస్టు చేయలేదని, కేసులు నమోదు చేస్తే సరిపోతుందా? అని బొడ్డు నాగేశ్వరరావు నిలదీశారు. అకారణంగా దళితులపై అగ్రకులాల వారు దాడి చేశారని అన్నారు. ఎస్సీ,ఎస్టీ జాతీయ కమిషన్ సభ్యులు సందర్శించిన తరువాతే రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు. దాడులకు కారకులైన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ 70 ఏళ్ల స్వాతంత్రం తరువాత కూడా ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. దళితులపై దాడులు, కులవివక్షతలపై ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని సభ్యులు కత్తి నరసింహారెడ్డి కోరారు.

రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం అడ్డు: మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రంలో విభజన చట్టంలో పొందుపరిచిన రైల్వే ప్రాజెక్టులు పూర్తికాకుండా కేంద్రప్రభుత్వం అడ్డుతగులుతోందని రవాణా శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు విమర్శించారు. దేశంలోని ఇతర ప్రాంతాలతో అమరావతి రాజధానిని కలిపేందుకు కొత్త మార్గాలను మంజూరుకు కేంద్రప్రభుత్వానికి నివేదిక సమర్పించారా అని బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ప్రశ్నించారు. కొత్త రైల్వే లైన్ కోసం గత బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం రూ.2,800కోట్లు కేటాయించిందని, ఈ నివేదిక రాష్ట్రప్రభుత్వం సమర్పించకపోవడంతో ఈ బడ్జెట్‌లో రూ.10కోట్లు మాత్రమే కేటాయించిందని వీర్రాజు అన్నారు. అమరావతి నుంచి తెలంగాణలోని హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు రైల్వే అనుసంధానం ఉండాలని రాష్ట్రవిభజన చట్టంలో ఉందని తెలిపారు. కొత్త రైల్వే లైన్లు ఏర్పాటుచేస్తే రైల్వేకు 10శాతం లాభాలు వస్తాయని రైల్వే అనుబంధ సంస్థను ఆర్‌విఎన్ఎల్ సంస్థ నివేదిక ఇచ్చిందన్నారు. డిపిఆర్ ఇచ్చిన తరువాత కేంద్రప్రభుత్వం మాట మార్చిందని విమర్శించారు. కొత్త రైల్వే లైన్ వల్ల రైల్వే శాఖకు 4 శాతం నష్టం వస్తుందని కేంద్రప్రభుత్వం అడ్డుతగులుతుందన్నారు. ప్రాజెక్టులో 50శాతం రాష్ట్రప్రభుత్వమే భరించాలని మరో కొరివి పెడుతోందని విమర్శించారు. బిజెపి సభ్యులు వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని వ్యాఖ్యానించారు. మైక్ ఉందని ఇష్టం వచ్చినట్లు మాట్లొద్దన్నారు. రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం అన్యాయం చేస్తోందని విమర్శించారు.

రాష్ట్రాల హక్కులను హరిస్తున్న కేంద్రం : జయప్రకాశ్

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

రాష్ట్రాల హక్కులను హరించేలా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ పేర్కొన్నారు. మంగళవారం కర్నూలుకు వచ్చిన ఆయన బళ్లారి చౌరస్తా సమీపంలోని సూరజ్ గ్రాండ్ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విభిన్న భాషలు, సంస్కృతులతో ఏర్పడిన భారతదేశంలో కేంద్ర ప్రభుత్వం వాటిపై నిరంకుశత్వ ధోరణి అవలంభిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో జ్యోతిబసు, తమిళనాడులో కరుణానిధి, ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌టి రామారావు లాంటి గొప్పనాయకులు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రాల్లో ఆర్థిక సంస్కరణలు, హక్కులను కాపాడుకున్నారని చెప్పారు. ప్రస్తుతం ఎన్‌డిఎ ప్రభుత్వం సొంత అజెండాతో ముందుకెళ్తూ సమైక్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందని అన్నారు. పార్లమెంటులో ఎపికి చేసిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టాలు, హామీలలో కేంద్రం ప్రజలకు మాట ఇచ్చి తప్పిందని, ఇది దేశ భవిష్యత్తుకు పెను ప్రమాదమని హెచ్చరించారు. అనంతరం విలేకరులు అడిగిన ఇతర పార్టీలు, జనసేనతో పొత్తుపై అడిగిన ప్రశ్నకు ఆయన వ్యవసాయం, ఆరోగ్యం, విద్య, ఉపాధి, చిన్న పరిశ్రమలు లాంటి అంశాలను ఎవరూ చేపట్టినా అలాంటి వారికి, పార్టీలకు లోక్‌సత్తా సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బాబ్జీ పాల్గొన్నారు.

తిరుమలకు చేరుకున్న సిఎం

నేడు కుటుంబ సమేతంగా శ్రీవారి దర్శనం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ ప్రతినిధి

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కుటుంబసమేతంగా తిరుమలకు మంగళవారం రాత్రి 8 గంటలకు చేరుకున్నారు. ఆయన మనుమడు నారా దేవాన్ష్ పుట్టిన రోజును పురస్కరించుకుని శ్రీవారి దర్శనార్థం కుటుంబ సభ్యులతో పాటు తిరుమలకు వచ్చారు. మంగళవారం రాత్రి 7 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు జిల్లా అధికారులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి నేరుగా రోడ్డు మార్గాన తిరుమల పద్మావతి అతిథిగృహానికి చేరుకున్నారు. ముఖ్యమంత్రి వెంట ఆయన తనయుడు, రాష్ట్ర ఐటి, పంచాయతీరాజ్‌శాఖా మంత్రి నారాలోకేష్, వియ్యంకుడు , ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, కుటుంబ సభ్యులు నారా భువనేశ్వరి, బ్రాహ్మణి, వసుంధర ఉన్నారు. తిరుమలలో ముఖ్యమంత్రికి ఈవో అనిల్‌కుమార్‌సింఘాల్ స్వాగతం పలికి బస ఏర్పాట్లు చేశారు. బుధవారం ఉదయం నైవేద్యవిరామ సమయంలో శ్రీవారిని దర్శించుకోనున్నారు.

అదుపులోకి అతిసార : మంత్రి నారాయణ

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

గుంటూరు నగరంలో అతిసార పూర్తిగా అదుపులోకి వచ్చిందని మున్సిపల్ మంత్రి పి.నారాయణ తెలిపారు. మంగళవారం అధికారులతో కలిసి మంత్రి నారాయణ ఆనందపేటలో పర్యటించి, పైప్‌లైన్ పనులను, వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలోని 5 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు కొనసాగిస్తున్నామని, అతిసార ప్రబలిన ప్రాంతాలలో 100 కిలోమీటర్ల మేర నూతన పైప్‌లైన్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. అందులో యుద్ధప్రాతిపదికన 23 కిలోమీటర్ల లైన్‌ని ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తున్నారన్నారు. తాగునీరు నిలిపిన వీధులకు వాటర్ ట్యాంకర్ల ద్వారా సరిపడా నీటిని అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీల నుండీ సిబ్బందిని పిలిపించి పారిశుధ్య, పైప్‌లైన్ల పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. గుంటూరులో పరిస్థితి సాధారణ స్థితికి వచ్చేంతవరకు ఉన్నతాధికారులు ఇక్కడే ఉండి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించినట్లు చెప్పారు.

అవినీతిపైనే బిజెపి పోరాటం : సోము వీర్రాజు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలోని అవినీతి అక్రమాలపైనే బిజెపి పోరాటం చేస్తుందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు పేర్కొన్నారు. గుంటూరులో మంగళవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో తమ పార్టీ ప్రతిపక్షంగా వ్యవహరించాలని పార్టీ అధ్యక్షులు అమిత్‌షా తమకు సూచిస్తే తాము ప్రజలకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నట్లు సిఎం చంద్రబాబు చిత్రీకరిస్తున్నారని అన్నారు. ప్రతి రాజకీయ పార్టీకీ ఒక ఏజెండా ఉంటుందని, ఇప్పటి వరకూ టిడిపికి మాత్రం తాము మిత్రపక్షంగా ఉన్నామని, ఇటీవల విడిపోయిన తరువాత ప్రతిపక్ష పాత్ర పోషిస్తుంటే సహించలేక సిఎం ఎదురుదాడి చేస్తున్నారని అన్నారు. తాను విమర్శలు చేస్తే వైసిపి స్క్రిప్టు రాసిచ్చిందని, పవన్ కల్యాణ్ మాట్లాడితే బిజెపి రాసిచ్చిందని ఇలా ప్రతి ఒక్కరికీ మరోకరికి సంబంధాలు అంటగట్టి రాజకీయ లబ్ధికోసం సిఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఉగాది పంచాగ శ్రవణంలో రాజకీయ ఉపన్యాసం చేసి ప్రజలను సెంటిమెంట్ పేరుతో చంద్రబాబు రెచ్చగొట్టారని, టిడిపిపై ఎవ్వరు విమర్శలు చేసినా ఆయనకు ఆత్మగౌరవం గుర్తుకు వస్తోందని ఎద్దేవా చేశారు.

నా వ్యాఖ్యలను వక్రీకరించారు

హోదాతో పాటు హామీలన్నీ అమలు చేయాల్సిందే

జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సోమవారం ఒక జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో హోదా పై తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ కార్యాలయం నుంచి ప్రకటనను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందే అని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర నుంచి ఆర్థిక సహాయం మాత్రమే చాలని తానెప్పుడు చెప్పలేదన్నారు. విభజన చట్టం ప్రకారం రాష్ట్రానికి ప్రత్యేక హోదాతో పాటు ఆర్థిక సహాయం కూడా అవసరమని తమ పార్టీ కూడా అదే డిమాండ్ చేస్తోందని కోరారు. ప్రజలు, జనసేన కార్యకర్తలు ఈ విషయాన్ని ఇప్పటికే అర్థం చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి సున్నితమైన సమయంలో అభిప్రాయాలను ఎవరూ వక్రీకరించొద్దని విజ్ఞప్తి చేశారు.

22న రాస్తారోకోను జయప్రదం చేయండి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేస్తూ ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన జాతీయ రహదారుల దిగ్బంధన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ పిలుపునిచ్చారు. విజయవాడ దాసరి భవన్‌లో మంగళవారం కె రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఎపికి ప్రకటించిన ప్రత్యేక హోదా, విభజన హామీల అంశాల అమలును ఎన్‌డిఎ ప్రభుత్వం అటకెక్కించిందన్నారు. ఎపికి సంబంధించిన ఈ ఉద్యమం నేడు జాతీయ సమస్యగా మారిందన్నారు. ఇప్పటికే ఈ ఉద్యమ సెగ ఢిల్లీని తాకిందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని రాజకీయ పక్షాలు ఏకతాటిపైకి వచ్చి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని సిపిఐ కోరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ ఈడ్పుగంటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిపిపి కాలుష్యంపై వివరణ ఇవ్వండి

హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్

కష్ణా జిల్లా ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు థర్మల్ విద్యుత్ కేంద్రం కారణంగా కాలుష్యం వెదజల్లుతోందనే పిటిషనర్ ఆరోపణలకు వివరణ ఇవ్వాలని ఎపి జెన్‌కోను హైకోర్టు ఆదేశించింది. గాలి,నీరు,పంట భూములు కాలుష్యానికి గురౌతున్నాయని పేర్కొంటూ ప్రజా సంక్షేమ సేవా సంఘం కార్యదర్శి పొదిలి అనిల్‌కుమార్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు మంగళవారం విచారించింది. ప్రతివాదులైన ఏపీ జెన్‌కో, థర్మల్ కేంద్రం చీఫ్ ఇంజనీర్, విద్యుత్ శాఖ ముఖ్య కార్యదర్శులు తమ వాదనలతోకౌంటర్ దాఖలు చేయాలని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఆదేశించింది.

వెటర్నరీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంత పశువైద్యశాల కేంద్రాలను(ఆర్ఎల్‌యు) పశువైద్యశాల(వీడి)లుగా అప్‌గ్రేడ్‌చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు వై రాము, కె రమేష్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రైతులకు ఉపయోగపడేవిధంగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడానికి పశువైద్య కేంద్రాలను వీడిలుగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా సాధ్యపడుతుందని సూచించారు. కొంత కాలంగా వెటర్నరీ విద్యార్థులు ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించారు. వెటర్నరీ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థులకు నష్టం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. విడీగా అప్‌గ్రేడ్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినా పట్టించుకోవడం లేదని తెలిపారు. నాణ్యమైన వెటర్నరీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

కోర్టులంటే లెక్కలేదా..?

- ఒక్క ప్రజాప్రతినిధే కోడిపందేలు ఆడారా?
- ప్రభుత్వ వివరణపై హైకోర్టు అసంతృప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్

కోడి పందేల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధుల గుర్తింపుపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్కార్ ఇచ్చిన వివరణపై హైకోర్టు అసంతప్తిని వ్యక్తం చేసింది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఒక ప్రజాప్రతినిధి మాత్రమే గుర్తించామని, ఇంకెవరెవరు కోడిపందేలు ఆడారో గుర్తించేందుకు సమయం కావాలని ఎపి సర్కార్ హైకోర్టును కోరింది. భీమవరం మండలం శ్రీరాంపురం, వెంప గ్రామాల్లో సంక్రాంతి పండుగకు కోడి పందేల పేరుతో అశ్లీల డ్యాన్స్‌లు, గుండాట, జూదం, వ్యభిచారం నిర్వహిస్తున్నారని, వీటిని అడ్డుకునేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కలిదిండి రామచంద్రరాజు దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని మంగళవారం హైకోర్టు మరోసారి విచారించింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ ఎదుట ఎపి అడ్వకేట్ జనరల్ డి.శ్రీనివాస్ వాదిస్తూ.. టీవీ9 చానల్ మాత్రమే కోడిపందేల వీడియో ఫుటేజిని అందజేసిందని, అందులో ఒకే ఒక్క ప్రజాప్రతినిధి కోడిపందేలు ఆడినట్లుగా తేలిందని చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా మొత్తానికి ఒకే ఒక్క ప్రజాప్రతినిధి కోడిపందేలు ఆడారా, ఎమ్మెల్యేలు, ఎంపిటిసి, జెడ్పీటిసి సభ్యులు ఎంతోమంది కోడిపందేలు ఆడినట్లు టీవీల్లో ప్రసారమైందని కొంతమంది పెద్దలైతే టీవీల ముందు కోళ్లు పట్టుకుని గొప్పగా ప్రసంగాలు కూడా చేశారని హైకోర్టు పేర్కొంది. ఎన్‌డిటివి వంటి జాతీయ టీవీ చానల్‌లో కూడా కోడిపందేలు ఆడుతున్నట్లుగా పెద్దలు మాట్లాడినట్లు వచ్చిందన్నారు. కోర్టులంటే లెక్కలేనట్లుగా స్పందన ఉందని, కోడిపందేలు ఆడిన ప్రజాప్రతినిధులపై చర్యలు తీసుకుంటే కచ్చితమైన సమాధానాన్ని ఇచ్చినట్లు అవుతుందని హైకోర్టు అభిప్రాయ పడింది. దీనిపై ఎజి శ్రీనివాస్ మాట్లాడుతూ తప్పించుకోవడం ప్రభుత్వ ఉద్దేశం కానేకాదని, మరో అవకాశం ఇస్తే పూర్తి వివరాలు తెలియజేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుమతించిన హైకోర్టు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

బిఇడి, డిఇడి కాలేజీల్లో తనిఖీలు ఎన్‌సిటిసిని ఆదేశించిన హైకోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉన్న బిఇడి, డిఇడి కాలేజీల్లో తనిఖీలు నిర్వహించి అవకతవకలు వాస్తవమో కాదో తెలియజేయాలని ఎన్‌సిటిసిని హైకోర్టు ఆదేశించింది. ప్రకాశం జిల్లాకు చెందిన నవలూరి మాధవరావు దాఖలు చేసిన రెండు ప్రజాహిత వ్యాజ్యాలను మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ మరోసారి విచారించింది. వివిధ జిల్లాల్లో ఆరోపణలు వచ్చిన బిఇడి, డిఇడి కాలేజీల్లో తనిఖీలు చేయాలని ఎన్‌సిటిసిని హైకోర్టు ఆదేశించింది. ఆయా కాలేజీల్లో తనిఖీలు నిర్వహించి రెండు వారాల్లో నివేదిక అందజేయాలని ఎన్‌సీటీఈని ఆదేశించింది. ప్రకాశం జిల్లా బ్రాహ్మణపల్లిలో అనుమతి పొంది వినుకొండలో కాలేజీ నడుపుతున్నారు. ఒక్క కాలేజీలోనే చేయాల్సిన అధ్యాపకులు నిబంధనలకు వ్యతిరేకంగా పలు కాలేజీల్లో పనిచేస్తున్నారని పిటిషనర్ లాయర్ వాదించారు. ఆరోపణలు వచ్చిన పది కాలేజీల్లో తనిఖీలు చేయాలని, అందుకు అయ్యే ఖర్చుల నిమిత్తం పిటిషనర్ ఒక లక్ష రూపాయల్ని ఎన్‌సిటిఇ వద్ద డిపాజిట్ చేయాలని హైకోర్టు ఆదేశించింది. విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది.

అరసవెల్లి ఆలయ భూముల్లో నిర్మాణాలపై హైకోర్టులో పిల్

ప్రజాశక్తి - హైదరాబాద్

శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి అతి సమీపంలోని అరసవెల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ భూమిలో ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేస్తున్నారనే ఆరోపణలతో దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంలో హైకోర్టు ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయ ఈవో, ఆలయ జాగాలో కన్వెన్షన్ సెంటర్ కడుతున్న పెద్దాడ నర్సింహరావులకు నోటీసులు ఇచ్చింది. ఆలయ స్థలాన్ని ఆక్రమించుకుని ప్రైవేటు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టడాన్ని తప్పుపడుతూ ఆలయ పాలక మండలి మాజీ సభ్యుడు తెలుగు అప్పల సూర్యనారాయణ, న్యాయవాది రఘుపాత్రుని చిరంజీవి దాఖలు చేసిన పిల్‌ను మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి కె.విజయలక్ష్మిలతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. ప్రతివాదులు తమ వాదనలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిన హైకోర్టు విచారణను వాయిదా వేసింది.

గిరిజనుల మధ్య గొడవలు పెట్టొద్దు

- బోయలను ఎస్టీల్లో ఎలా చేరుస్తారు?
- మండలిలో పిడిఎఫ్ నేత విఠపు బాలసుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎటువంటి పరిశోధనలూ చేయకుండా, గిరిజన జీవన స్థితిగతుల పై గతంలో చేసిన పరిశోధనలను అధ్యయనం చేయకుండా బోయలను ఎలా ఎస్టీల్లో చేరుస్తారని మండలి పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. మండలిలో సంక్షేమంపై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ గిరిజనులు ఎవరి జోలికి రారని, రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం కూడా వారి జోలికి పోవడం మంచిది కాదని అన్నారు. ప్రస్తుతానికి, గిరిజనులు, బోయలు ప్రశాంతంగానే ఉన్నారని, వారి మధ్య చిచ్చు పెట్టొద్దని సూచించారు. ఈ పరిణామాలు సమాజానికి ఎంతో నష్టాన్ని చేకూరుస్తాయన్నారు. బోయలు, మత్స్యకారుల అభివృద్ధికి ఎవరూ వ్యతిరేకం కాదని, ప్రభుత్వం వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఈ దఫా సమావేశాల్లో గిరిజన సంక్షేమంపైనే చర్చించాలని బిఎసిలో తాము కోరినట్టు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు కింద గిరిజనుల పునరావాసం పై సమావేశాల్లో చర్చించే అవకాశముందా అని ప్రశ్నించారు. సుమారు 1.5 లక్షలకు పైగా గిరిజన కుటుంబాలు తరలిపోవాల్సి ఉందని, వీరి పునరావాసానికి బడ్జెట్‌లో ఎటువంటి ప్రాధాన్యమిచ్చారని నిలదీశారు. రాష్ట్రంలో అచ్చతెలుగు మాట్లాడే ఏకైక ఆదిమ తెగ చెంచులేనని, ప్రస్తుతం వీరు దుర్భర జీవితాన్ని అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముప్పై



సంవత్సరాలకే చెంచులు పునరుత్పత్తి శక్తిని కోల్పోతున్నారని, ఇది అత్యంత బాధాకర అంశమన్నారు. వారిలో చదువుకున్న వారు సైతం ఉఢిహామీ పనులకు వెళ్లాల్సి వస్తోందన్నారు. కనీసం వీరికి శ్రీశైలం దేవస్థానంలో నాలుగో గవ తరగతి ఉద్యోగ అవకాశాలైనా కల్పించాలని కోరారు. కొండరెడ్డి, గోండు, చెంచుల వంటి ఆదిమజాతుల సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర పై ప్రముఖ అంత్రోపాలజిస్టు హైమండార్ఫ్ గ్రంథాలు రచించారని వాటిని ముద్రించి అందుబాటులోకి తీసుకొని రావాలని కోరారు. గిరిజనుల్లో అత్యల్ప అభివృద్ధి, స్వల్ప మౌలిక సదుపాయాలు, పౌష్టికాహార లోపం, తదితర అంశాలపై ఎన్నడైనా సమగ్ర సర్వే కానీ, సమీక్ష కానీ నిర్వహించారా అని ప్రశ్నించారు. నెల్లూరు జిల్లాలో అత్యంత వెనుకబడిన చల్లా యానాదులపై వెన్నల కంటె రాఘవయ్య చేసిన కృషిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజన గ్రంథాల జాబితా ఇస్తే ముద్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి యనమల తెలిపారు. అంతకుముందు ఈ అంశాలపై టిడిపి ఎమ్మెల్సీలు శమంతకమణి, కెఇ ప్రభాకర్ మాట్లాడుతూ మండలి పై మంత్రులకు, సభ్యులకు గౌరవం లేకుండా పోయిందని, చర్చ సమయంలో మంత్రులు లేకుంటే ఎలా అని ప్రశ్నించారు.

అసెంబ్లీ వద్ద గిరిజన జెఎసి

బోయలను ఎస్టీల్లో చేర్చొద్దని గిరిజన జెఎసి ఆధ్వర్యంలో వెలగపూడి తాత్కాలిక సచివాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జెఎసి నేతలను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బాలికల డ్రాపవుట్స్ ఆందోళనకరం

స్పీకర్ కోడెల శివప్రసాదరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పాఠశాలల్లో బాలికల డ్రాప్ అవుట్స్ ఆందోళన కలిగిస్తున్నాయని స్పీకర్ కోడెల శివప్రసాదరావు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో మరుగుదొడ్లు, మౌలిక వసతుల లేమి కారణంగానే బాలికల స్కూల్ డ్రాప్ అవుట్‌లు ఎక్కువగా ఉంటున్నాయని అభిప్రాయ పడ్డారు. మంగళవారం అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో బాలల ఆరోగ్యం, ఆహారం, హక్కులు అనే అంశంపై యునిసెఫ్ ప్రతినిధులతో సమావేశం అయ్యారు. బాలల విద్యలో 17 అంశాలపై ప్రధానంగా చర్చించ్చారు. జాతీయ స్థాయిలో బాలికల డ్రాప్ అవుట్స్‌పై అవగాహన కల్పించడం యునిసెఫ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 9 నుంచి 12 వరకు హర్యానా, హిమాచల్ ప్రదేశ్‌లలో పిల్లల, తల్లి ఆరోగ్యం అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు యునిసెఫ్ ప్రతినిధులు స్పీకర్‌కు వివరించారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ యునిసెఫ్, ఏపి అసెంబ్లీ అనేక అంశాల్లోని సమస్యలపై కలిసి పనిచేస్తున్నాయన్నారు. హైస్కూల్, ఇంటర్మీడియట్ లెవల్స్‌లో ఎక్కువ డ్రాప్ అవుట్‌లు ఉంటున్నాయని, ఇందులో బాలికల శాతమే అధికంగా ఉందని అభిప్రాయ పడ్డారు. ఇదే సమయంలో ప్రపంచ వ్యాప్తంగా బాల్య వివాహలు తగ్గించడానికి యునిసెఫ్ చేస్తున్న కృషిని ఈ సందర్భంగా స్పీకర్ అభినందించారు. రాష్ట్రంలోనూ కర్నూలు, ప్రకాశం, నెల్లూరు గుంటూరు జిల్లాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని స్పీకర్ తెలిపారు. మండలి వైస్ ఛైర్మన్ రెడ్డి సుబ్రమణ్యం, మంత్రి పరిటాల సునీత, ఛీప్ విప్ పల్లె రఘునాధరెడ్డి, విప్ రవికుమార్, అసెంబ్లీ సెక్రటరీ విజయరాజు, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నాతాధికారులు పాల్గొన్నారు.

క్వశ్చేన్ అవర్

న్యాటీఏ పోరాటం చేస్తాం..

- వెనుకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులపై ఆర్థిక మంత్రి యనమల
- శాసనసభలో ప్రశ్నోత్తరాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన జిల్లాలకు రావాల్సిన నిధులపై అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. శాసనసభ ప్రశ్నోత్తరాల్లో భాగంగా మంగళవారం సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ వెనుకబడిన జిల్లాలకు రూ.24,354 కోట్లతో ప్రతిపాదనలు పంపగా, ఇంతవరకు రూ.1,050 కోట్లు మాత్రమే కేంద్రం విడుదల చేసిందన్నారు. ఈ ఏడాది రూ.350 కోట్లు విడుదల చేసి, ప్రధాని కార్యాలయం (పిఎంఒ) అనుమతి లేదంటూ వెనక్కి తీసుకోవడాన్ని తప్పుబట్టారు. పిఎంఒ రాజకీయాలకు కేంద్రంగా మారిందని విమర్శించారు. అధికారమంతా అక్కడే కేంద్రీకృతమైందని ధ్వజమెత్తారు. చట్ట ప్రకారం రాష్ట్రాలకు నిధులు విడుదల చేసే అవకాశాన్ని పిఎంఒ ఇతరులకు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాల జాబితాలో చేర్చేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ముందు విప్ కూన రవికుమార్, మృణాళిని, ఎస్వి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రం తీరును తప్పుపడుతూ, దీనిపై రాష్ట్రం తీసుకుంటున్న చర్యలను ప్రశ్నించారు. బిజెపి శాసనసభా పక్ష నాయకుడు విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఈ అంశాన్ని కేంద్రం దృష్టికి తీసుకువెళ్లామని, నిధుల విడుదలకు చర్యలు తీసుకుంటామని చెప్పగా అధికార పక్ష సభ్యులు 'షేమ్...షేమ్' అంటూ నినాదాలు చేశారు.

ఆశాలకు సేవలను బట్టే చెల్లింపులు

ఆశా వర్కర్లకు వారు అందించిన సేవలను బట్టే



చెల్లించే మొత్తం ఉంటుందని, ప్రతి నెలా ఇంత మొత్తం అంటూ ప్రత్యేకంగా నిర్ణయించలేదని, వేతన పెంపు ప్రభుత్వ పరిశీలనలో లేదని ఆర్థిక మంత్రి యనమల తెలిపారు. అయితే ఆశావర్కర్లను ఎఎన్ఎంలుగా నియమించే అంశం పరిశీలనలో ఉందన్నారు. ఆశా వర్కర్‌ల జీతాల పెంచాలని, సీనియర్లను ఎఎన్ఎంలుగా నియమించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, జి.సూర్యారావు, సునీల్‌కుమార్ ప్రభుత్వాన్ని కోరారు.

ప్రకృతి సేద్యంపై శాస్త్రీయ అధ్యయనం

ప్రకృతి వ్యవసాయంపై శాస్త్రీయ అధ్యయనం చేసేందుకు విదేశీ సంస్థలు ముందుకొచ్చాయని వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడులు పెట్టేందుకు వివిధ సంస్థలు ప్రభుత్వంతో ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. రాష్ట్రంలో నాలుగు ఏజెన్సీలు ప్రకృతి వ్యవసాయోత్పత్తులను ధ్రువీకరిస్తున్నట్లు చెప్పారు. మల్చింగ్ షీట్లకు రాయితీ ఇస్తున్నామని, దీన్ని మరికొంత పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ను మంత్రి అభినందించారు.

8 వేల ఎకరాల్లో చిన్న పరిశ్రమలు

పార్వతీపురం నియోజకవర్గం పరిధిలో లెదర్ పార్కు ఏర్పాటుకు కేంద్రం రూ.50 కోట్లు, రాష్ట్రం రూ.40 కోట్లు కేటాయించినట్లు పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ కింద పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ 94 నియోజకవర్గాలలో 8 వేల ఎకరాల భూమి ఇందుకోసం సేకరించినట్లు చెప్పారు. మదనపల్లెలో రూ. 448 కోట్లతో 4 వేల మందికి ఉపాధి కల్పనకు ఆరు భారీ పరిశ్రమలను ప్రతిపాదించినట్లు చెప్పారు. కదిరి నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని సభ్యులడిగిన ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

అమరావతి, ధరణికోటల్లో కృష్ణనది వెంబడి స్నాన ఘాట్ల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతపై అధికారులతో సమావేశం నిర్వహించి తగు చర్యలు తీసుకుంటామని జలవనరుల శాఖ మంత్రి దేవినని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అడిగిన ప్రశ్నకు జవాబుగా తెలిపారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 308 ఎకరాల భూమిని గుర్తించామని, వాటిలో పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని పరిశ్రమల మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఔషధాల తయారీ పరిశ్రమల వల్ల కాలుష్య సమస్య ఏర్పడుతున్నందున ఆ ప్రాంతంలో ఏర్పాటు చేయలేదని వివరణ ఇచ్చారు.

558 ఎకరాల భూ కుంభకోణం

శ్రీకాకుళం జిల్లా రామకృష్ణాపురంలో 558 ఎకరాల భూ కుంభకోణంపై ఎమ్మెల్యేలు బి.అశోక్, విప్ కూన రవికుమార్ ప్రశ్నించగా విచారణకు జె.సి విచారణధికారిగా నియమించన్నుట్లు రెవెన్యూ మంత్రి కెఇ కృష్ణమూర్తి తెలిపారు. 3 నుంచి 6 నెలల్లో సభ ముందు ఈ నివేదిక ఉంచుతామని చెప్పారు.

మోడీ హఠావో.. దేశ్ బచావో..

- పారిశ్రామికాభివృద్ధిపై లఘు చర్చలో టిడిపి ఎమ్మెల్యేల ధ్వజం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జల వనరులు, పారిశ్రామికాభివృద్ధి రెండుకళ్లుగా రాష్ట్రంలో సిఎం చంద్రబాబునాయుడు కష్టపడుతుంటే, ప్రధాని మోడీ ఇచ్చిన హామలు అమలు చేయకుండా అన్యాయం చేశారని టిడిపి ఎమ్మెల్యే ఎస్వీ మోహనరెడ్డి విమర్శించారు. మోడీ హఠావో.. దేశ్‌కే బచావో నినాదంతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన వ్యాఖ్యానించారు. పెట్టుబడులు, పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగాల కల్పన అనే అంశంపై అసెంబ్లీలో మంగళవారం జరిగిన లఘు చర్చలో పలువురు టిడిపి ఎమ్మెల్యేలు సహా మోహనరెడ్డి మాట్లాడారు. ప్రధాని స్థాయిలో అబద్ధాలు, మోసపు మాటలు చెబుతున్నారని ఆయన దుయ్యబట్టారు. సిఎం చంద్రబాబు విదేశీ పర్యటనలు, విశాఖలో పెట్టుబడిదారుల సదస్సుల వల్ల హోదా లేకుండానే రాష్ట్రం బాగుపడిందని ఎమ్మెల్యే బొండా ఉమ తెలిపారు. గతంలో పెట్టుబడిదారులు అధికారుల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు అధికారులే పెట్టుబడిదారుల చుట్టూ తిరిగే పరిస్థితులు

వచ్చాయని అన్నారు. రాష్ట్రంలో ఇంతవరకు 9.60 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయని బొండా పేర్కొన్నారు. కేంద్రం విడుదల చేసిన జాబితా ప్రకారమే దేశంలోని 80 అభివృద్ధి చెందిన గ్రామ పంచాయతీల్లో సుమారు 30 ఆంధ్రప్రదేశ్ చెందినవి ఉండటం రాష్ట్రంలో అభివృద్ధికి నిదర్శనమని ఎమ్మెల్యే అయితాబుత్తుల ఆనందరావు పేర్కొన్నారు. సింగిల్ విండో విధానంతో పారిశ్రామికాభివృద్ధి వేగవంతమైందని ఎమ్మెల్యే జివి ఆంజనేయులు తెలిపారు. ప్రతి జిల్లా అభివృద్ధికి అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సూచించారు. ప్రత్యేక హోదాకు పరిశ్రమలకు సంబంధం లేదని బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్పష్టం చేశారు. హోదాతో కేవలం పన్ను మినహాయింపులు మాత్రమే వస్తాయని ఆయన అన్నారు. ఉద్యోగాల కల్పన విషయంలో సభ్యులు చెప్పేవి ఒక్కో విధంగా ఉంటున్నాయని వ్యాఖ్యానించారు.

సీరియస్ సినిమాలో బ్రహ్మానందంలా పవన్

కేంద్రంతో సఖ్యతగా ఉన్నంత వరకు పవన్ కల్యాణ్ రాష్ట్ర ప్రభుత్వంపై ఎటువంటి విమర్శలూ చేయలేదని, హోదా గురించి కేంద్రాన్ని నిలదీయడం మొదలు పెట్టడంతో ఆయన దాడి ప్రారంభించారని ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. సీరియస్ సినిమాలో బ్రహ్మానందం వచ్చినట్లు పవన్ చేసేది కామెడీగా ఉందని ఎద్దేవా చేశారు. జనవరిలో అనంతపురంలో సభ పెట్టినప్పుడు కూడా ఒక్క మాట మాట్లాడని పవన్ ఎవరి స్వప్రయోజనాల కోసం ఇదంతా చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నట్లు తెలిపారు. గోద్రా అల్లర్లలో తప్పును అప్పట్లో ఎత్తి చూపినందుకే ముఖ్యమంత్రి చంద్రబాబుపై కక్ష పెంచుకుని ప్రధాని మోడీ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

బొడ్డు నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా మండలి ఛైర్మన్ ఎన్ఎండి ఫరూక్ దృష్టికి మంగళవారం తీసుకొచ్చారు. కనీస వేతనాల కోసం అంగన్‌వాడీలు సోమవారం ఆందోళన నిర్వహించారని వివరించారు. ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచాలని, కనీస వేతనం రూ.18వేలు చేయాలని, పెండింగ్ బిల్లులు తదితర సమస్యల పరిష్కారం కోసం సోమవారం విజయవాడలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారని వివరించారు. రవాణా వాహనాలు పరిమితికి మించి సరుకును లోడ్ చేయించుకుంటున్నాయని పిడిఎఫ్ ఎమ్మెల్సీ రామూ సూర్యారావు ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఛైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. రోడ్ల మరమ్మత్తులకు గురవుతున్నాయని,తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఎయిడెడ్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న సిబ్బందికి 650జీవో అమలు చేయాలని కత్తినరసింహారెడ్డి ప్రత్యేక ప్రస్తావన అందజేశారు.

చంద్రన్న బీమా సమస్యలు పరిష్కరిస్తాం : మంత్రి పితాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చంద్రన్న బీమా క్లయిములకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి పితాని సత్యనారాయణ హామీ ఇచ్చారు. అసెంబ్లీలో మంగళవారం జరిగిన చర్చ సందర్భంగా క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న అనేక సమస్యలను పలువురు ఎమ్మెల్యేలు మంత్రి పితాని దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ సహజ మరణాల కేసులను 10 రోజుల్లో పరిష్కరిస్తున్నామని, ప్రమాదాల కేసులు 13 రోజుల్లో పరిష్కారమవుతున్నాయని వెల్లడించారు. మొత్తం రూ.204 కోట్లు బీమాగా ప్రజలు చెల్లించారని, ఇన్సూరెన్స్ కంపెనీలు లబ్ధిదారులకు రూ.855 కోట్లు చెల్లించినట్లు ఆయన తెలిపారు. బీమా నమోదులో ఎదురవుతున్న ఆన్‌లైన్ సమస్యలతో పాటు కొందరు సిబ్బంది అవినీతిపైనా దృష్టి సారిస్తామన్నారు. బీమా చేసిన వారు 155214 టోల్‌ఫ్రీ నంబరు ద్వారా అవసరమైన సహాయం పొందవచ్చని మంత్రి స్పష్టం చేశారు. చంద్రన్న బీమా ప్రచార కార్యక్రమాల్లో ప్రధాని పేరును ఇంగ్లీష్‌లో చిన్నగా రాశారని దీన్ని సరిచేయాలని విష్ణుకుమార్‌రాజు కోరారు. ఎమ్మెల్యేలు గన్ని వీరాంజనేయులు, గిడ్డి ఈశ్వరి, యామినిబాల, వెలగపూడి రామకృష్ణ, నారాయణమూర్తి, ఉప్పులేటి కల్పన, తోట త్రిమూర్తులూ చంద్రన్న బీమా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



మాట్లాడుతున్న ఎస్.వెంకట్రావు

సామాజిక అంశాలపై రచయితలు స్పందించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై, సామాజిక అంశాలపై ప్రతి రచయిత స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజాశక్తి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు అన్నారు. ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి రచయితల వర్క్‌షాప్ ఏలూరులో ఆ సంఘం జిల్లా కార్యదర్శి పి.మంగరాజు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ముఖ్య అతిథి వెంకట్రావు మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని చెప్పారు. తెలుగు ప్రజలను రెండు రాష్ట్రాలుగా విడగొట్టిన సందర్భంలో ఇచ్చిన విభజన హామీలను నెరవేర్చడంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోసగించిందని విమర్శించారు. ప్రత్యేక హోదాపై కేంద్రంలో, రాష్ట్రంలో పాలకపార్టీలు దొంగ నాటకం ఆడుతున్నాయన్నారు. దీన్ని బట్టబయలు చేస్తూ కవులు, రచయితలు రచనలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కష్టజీవికి ఆ చివర, ఈ చివర కాపు కాసేవాడే నిజమైన కవి అనే మాటను ప్రజానాట్యమండలి రచయితలు ఆచరించడం అభినందనీయమన్నారు. ప్రతి సమస్యపైనా పాటలు, నాటికల రూపంలో స్పందిస్తున్న సాంస్కృతిక సంఘం ప్రజానాట్య మండలి అని అన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడుల నేపథ్యం, నోట్ల రద్దు, జిఎస్‌టి, ప్రత్యేక హోదా, మహిళలు, దళితులు, గిరిజనులకు అండగా పాటలు, నాటికలు రచించేందుకు ప్రజానాట్య మండలి రచయితల వర్క్‌షాపు దోహదపడాలని ఆయన ఆకాంక్షించారు.

పారిశ్రామిక కాలుష్యంతో 25 మంది పారిశుధ్య కార్మికుల మృతి

జీరో అవర్‌లో సమస్యలు ప్రస్తావించిన ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

చిత్తూరు జిల్లాలో సుమారు 120 గ్రానైట్ ఫ్యాక్టరీలు, కెమికల్ ఫ్యాక్టరీలు, కోళ్ల పరిశ్రమలతో పాటు ఇతర పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల ఇప్పటి వరకు సుమారు 25 మంది పారిశుధ్య కార్మికులు మృతి చెందారని ఎమ్మెల్యే సత్యప్రభ మంగళవారం జీరో అవర్‌లో ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. చాలా మంది శ్వాస కోశ వ్యాధులు బారిన పడుతున్నారన్నారు. ఇక్కడి కార్మికులకు మాస్కులు ఇవ్వడంతో పాటు క్షయవ్యాధుల చికిత్స కోసం శానిటోరియం ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. అవుకు రిజర్వాయర్ అటవీశాఖ అనుమతులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బిసి జనార్ధనరెడ్డి కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వంశపారంపర్య ఉద్యోగాలకు సంబంధించి 200 మంది ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే శ్రీనివాస్ కోరారు. సిఆర్‌డిఎ పరిధిలోని 150 గ్రామాల్లోని రోడ్లు 12 అడుగుల నుంచి 40 అడుగుల వరకు ఉన్నాయని ఈ నిర్మాణ అనుమతుల సందర్భంగా సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తెలిపారు. చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్న ధర్మవరం నియోజకవర్గంలో 50 క్లస్టర్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరితే ఇప్పటి వరకు కేవలం ఒకటి మాత్రమే ఏర్పాటు చేశారని ధర్మవరం ఎమ్మెల్యే సూర్యనారాయణ తెలిపారు.

పెనుగొండ నియోజకవర్గంలో లో ఓల్టేజ్‌తో అనేక సమస్యలు వస్తున్నాయని కొత్తగా ఏర్పాటు చేసిన కియో పరిశ్రమ వల్ల విద్యుత్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఎమ్మెల్యే బికె పార్థసారధి తెలిపారు. ముఖ్యంగా రొద్దం మండలంలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉందని ట్రాన్స్‌ఫార్మలు కాలిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విజయనగరంలో ఆటోనగర్ ఏర్పాటుకు సంబంధించి భూములు ఇవ్వడానికి గతంలో ముందుకు వచ్చిన రైతులకు ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించి భూములను స్వాధీనం చేసుకుని ఆటోనగర్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మీసాల గీత కోరారు. అనకాపల్లి నియోజవర్గ పరిధిలో రెండు ఆనకట్టలను పూర్తి చేస్తే అనకాపల్లి, యలమంచిలి నియోజకవర్గ పరిధిలోని సుమారు 20వేల ఎకరాలకు పైగా పంట పొలాలకు సాగునీటి సౌకర్యం లభిస్తుందని ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ కోరారు.



హోదా పోరాటానికి సినీ పరిశ్రమ మద్దతివ్వాలి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమిళనాడులో జల్లికట్టు కోసం సినీ పరిశ్రమ పోరాడినట్లు తెలుగు సినీ రంగంలోని అగ్ర హీరోలు హోదా పోరాటానికి మద్దతివ్వాలి. ఈనెల 22న చేపట్టనున్న జాతీయ రహదారుల దిగ్బంధాన్ని అంతా కలిసి విజయవంతం చేయాలి. టిడిపి కూడా సహకరించాలి. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఎయిడెడ్ టీచర్లకు పెన్షన్ ఇచ్చేందుకు జిఒ 655ను వర్తింపజేయాలి.

- కత్తి నరసింహారెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ

తెలుగు సినీ కళాకారులకు మాయరోగమా..?

తెలుగు సినీ కళాకారులకు మాయరోగమొచ్చిందా? కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు చేస్తున్న అన్యాయం గురించి ప్రజలు ఆందోళనలు చేస్తుంటే సినీ పరిశ్రమ ఏం చేస్తోంది. ప్రజల తరపున సినిమా తారలు, సాంకేతిక నిపుణులు ఎందుకు ఉద్యమించట్లేదు. ప్రేక్షకులు కురిపించే కాసుల వర్షంలో మునిగి తేలుతున్నారా..? చంద్రబాబు అహర్నిశలు రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తుంటే తెలుగు సినీ తారలు ఒక్క రోజైనా అమరావతి వచ్చారా? తెలుగు సినీ పరిశ్రమ మొత్తం ప్రత్యేక హోదా పోరాటంలో పాల్గొనాలి. వారు సామాజిక బాధ్యత మర్చిపోతే ప్రజలు సహించరు.

- ఎమ్మెల్సీ బాబూ రాజేంద్రప్రసాద్

సినీ నటులను బెదిరించడం సరైంది కాదు

రాజకీయ ప్రయోజనాల కోసమే టిడిపి ప్రత్యేక హోదాను డిమాండ్ చేస్తోందని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యాంకిషోర్ అన్నారు. హోదా కోసం పోరాడాలంటూ సినీ నటులను బెదిరించడం సరైన చర్య కాదన్నారు. జాతీయ సగటు కంటే 4 శాతం వృద్ధి రేటు అధికంగా సాధించినట్లు సిఎం చెబుతున్నారని, కేంద్రం సహకారం లేకుండా ఇది సాధ్యమయ్యిదా అని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధికోసమే టిడిపి ప్రాంతాలు, కులాలు, మతాల వారీగా ప్రజలను విడదీస్తోందన్నారు. టిడిపి నాయకులకు జగన్, పవన్ ఫోబియా పట్టుకుందన్నారు. రాష్ట్రానికి ఐదేళ్లలో కేంద్రం నుంచి 1.55 లక్షల కోట్లు కేటాయించిందని చెప్పారు. హోదా కంటే అధనంగా సాయం రాష్ట్రానికి వస్తోందని ఈ నిధులను చూస్తే అర్థం అవుతుందన్నారు.

- బిజెపి

అవిశ్వాసంపై టిఆర్ఎస్ ద్వంద్వ వైఖరి

ప్రధాని మోడీకి వ్యతిరేకంగా కెసిఆర్ వివిధ పార్టీలతో ఫ్రంట్ అంటుండగా, మరో వైపు టిఆర్ఎస్ ఎంపిలు ప్రధానిపై అవిశ్వాస తీర్మానం చర్చకు రాకుండా అడ్డుకోవడం విడ్డూరం. టిఆర్ఎస్, ఎఐఎడిఎంకె వంటి కొన్ని రాజకీయ పార్టీలను అడ్డుపెట్టుకుని కేంద్రం అవిశ్వాస నోటీసుపై చర్చకు రాకుండా నాటకాలు ఆడుతోంది.

- మంత్రి కొల్లు రవీంద్ర

బిజెపి స్క్రిప్ట్..పవన్ యాక్షన్..

బిజెపి స్క్రిప్ట్‌కు పవన్ యాక్షన్ చేస్తున్నారు. ప్యాకేజీని పాచి పోయిన లడ్డూలతో పోల్చిన పవన్ ఇప్పుడు దాని గురించి ఎందుకు మాట్లాడటం లేదు. బిజెపి కుట్రను ప్రజలు గమనిస్తున్నారు. తగిన బుద్ధి చెబుతారు. ఎ1, ఎ2లకు ప్రధాని ఎందుకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారు. పవన్‌కు దమ్ముంటే పోలవరంలో అవినీతిని నిరూపించాలి.

జివి ఆంజనేయులు, టిడిపి ఎమ్మెల్యే, వినుకొండ

అవిశ్వాసమంటే భయమెందుకు?

మోడీకి, అమిత్‌షాకు అవిశ్వాసమంటే భయమెందుకు? విభజించు పాలించు సిద్ధాంతమే బిజెపి మార్గమా? రాష్ట్రాన్ని రెండు ముక్కలు చేయాలని చూస్తున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో జనసంఘ్ (నేటి బిజెపి) పాత్ర జీరో. చరిత్ర తెలిసుంటే పవన్ బిజెపితో సంబంధాలు కొనసాగించరు. పవన్ బిజెపిని ప్రశ్నించాలి, చంద్రబాబును కాదు.

- వాసుపల్లి గణేష్, టిడిపి ఎమ్మెల్యే, విశాఖ సౌత్

ప్రజలదోదారి.. పవన్‌ది మరో దారి

పవన్ వ్యాఖ్యలు చూస్తుంటే రాష్ట్ర ప్రజలది ఒక దారైతే ఆయనది మరో దారి అని స్పష్టమవుతోంది. ప్యాకేజీయే మేలనడం పవన్ అవగాహన రాహిత్యం. రాజకీయాలల్లో పవన్‌కు పరిపక్వత లేదు. పోలవరంపై విచారణ చేపట్టాలనటం అవివేకం. దేశంలో 24 జాతీయ ప్రాజెక్టులు నత్తనడకన సాగుతున్నాయని పవన్ గమనించాలి.

- ఎన్ రామానాయుడు, టిడిపి ఎమ్మెల్యే, పాలకొల్లు

హోదాపై అవగాహన లేని వ్యక్తి ప్రధానా?

హోదాపై అవగాహన లేని నరేంద్ర మోడీకి ప్రధానిగా కొనసాగే అర్హత ఉందా? ఇందుకు ఎపి బిజెపి నేతలే సమాధానం చెప్పాలి. ఆర్థిక నేరగాళ్లకు బిజెపి కాషాయ కండువా కప్పుతోంది. ఎవరు గెలుస్తారో 2019లో తేల్చుకుందాం. కాంగ్రెస్ పాలనలో ప్రజలు అసహనానికి గురైతే నేడు బిజెపి అహంకారంతో ప్రజలు హేళనకు గురవుతున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు. ప్యాకేజీ ఇచ్చినా సరిపోతుందని పవన్ మాట్లాడుతుంటే ఆశ్చర్యం వేస్తోంది. పవన్ రాజకీయాలపై అవగాహన తెచ్చుకుని మాట్లాడాలి. చంద్రబాబు గురించి మాట్లాడే హక్కు వపన్‌కు లేదు.

- ఎ ఆనందరావు,
కె అప్పలనాయుడు, టిడిపి ఎమ్మెల్యేలు

సంపాదకీయం

బిజెపి నక్కజిత్తులు

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీల అమలుకు ఎన్నికల్లో హామీ ఇచ్చి, అధికారంలోకొచ్చాక విస్మరించిన ఎన్‌డిఎ సర్కారు.. తనపై లోక్‌సభలో టిడిపి, వైసిపి మూడు రోజులుగా ప్రవేశపెడుతున్న అవిశ్వాస తీర్మానాలను చర్చకు రానీకుండా చేస్తున్న తీరు దాని దివాలాకోరుతనాన్ని నగ్నంగా బయటపెడుతోంది. ఏ ప్రభుత్వమైనా తానిచ్చిన హామీలను విస్మరించిన పక్షంలో ఇటు ప్రజల్లో అటు పార్లమెంట్‌లో విశ్వాసం కోల్పోతుంది. ఆ సందర్భంగా కేంద్ర మంత్రి మండలిపై ప్రతిపక్షాలు అవిశ్వాస తీర్మాన నోటీసును ప్రతిపాదించినప్పుడు దాన్ని ఎదుర్కొని సభా విశ్వాసం పొందడం ప్రజాస్వామ్యంలో ప్రజల మద్దతుతో గద్దెనెక్కిన ప్రభుత్వ బాధ్యత. ప్రతి రోజూ ప్రజాస్వామ్య విలువల గురించి ప్రవచించే ప్రధాని మోడీ, ఆయన పార్టీ..ఏపీ పార్టీల అవిశ్వాస తీర్మానాలు చర్చకు రాకుండా ఏవో కుంటి సాకులతో తప్పించుకోవడం దారుణం. అవిశ్వాసాలపై వరసగా మూడు రోజులూ లోక్‌సభలో చోటు చేసుకున్న పరిణామాల వెనక కచ్చితంగా బిజెపి పాత్ర ఉంది. తొలుత ఈ నెల 16న ఇచ్చిన నోటీసులపై చర్చను చేపట్టకపోవడానికి కారణం సభ సజావుగా లేకపోవడమేనని స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రకటించారు. ఆ సమయంలో వెల్‌లోకి చేరి ఆందోళన చేస్తున్న పార్టీలు ఎఐడిఎంకె, టిఆర్‌ఎస్. కావేరి జలాలపై బోర్డు ఏర్పాటు చేయాలని ఎఐడిఎంకె, రిజర్వేషన్ల కోటా పెంచాలని టిఆర్‌ఎస్ సభ్యులు ఆందోళన చేశారు. వీరి నిరసనల వలన అవిశ్వాసానికి మద్దతిచ్చే సభ్యుల సంఖ్యను లెక్కించలేకపోతున్నానని నోటీసులను స్పీకర్ నిర్ద్వందంగా తిరస్కరించారు. తిరిగి సోమ, మంగళ రెండు రోజుల్లోనూ ఆ రెండు పార్టీల ఆందోళనలనే స్పీకర్ కారణంగా చూపి సభను వాయిదా వేశారు. ఎఐడిఎంకె కొన్నాళ్ల నుంచి బిజెపి ఆడమన్నట్లు ఆడుతోంది. ఆ పార్టీని బిజెపి ఎగదోసి అవిశ్వాసంపై చర్చ జరక్కుండా పబ్బం గడుపుకుంటోందని స్పష్టమవుతోంది. టిఆర్‌ఎస్ అందుకు భిన్నం. బిజెపి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఫెడరల్ ఫ్రంట్ నెలకొల్పుతామంటున్నారు కెసిఆర్. అలాంటప్పుడు బిజెపి సర్కారుపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సాటి తెలుగు పార్టీలకు టిఆర్‌ఎస్ ఎందుకు సహకరించట్లేదు?

సభ సజావుగా సాగితేనే సభా కార్యకలాపాలు చేపట్టాలన్న స్పీకర్ నిర్ణయం అన్ని సందర్భాలకూ వర్తిస్తుందా అంటే అదేమీ లేదని ఇటీవలి లోక్‌సభ వ్యవహారాలే తేటతెల్లం చేశాయి. ఆర్థిక బిల్లు ఆమోదం సమయంలో సభలో ఉన్న దాదాపు అన్ని విపక్ష పార్టీలూ ఆందోళన చేపట్టాయి. సభ అదుపు తప్పి గందరగోళం నెలకొంది. అయినా సరే ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్థిక బిల్లును స్పీకర్ మూజువాణి ఓటుతో ఆమోదించారు. ఏపీ పార్టీల అవిశ్వాసాల దగ్గరకొచ్చేసరికి కేవలం రెండు పార్టీల సభ్యుల నిరసనలను ప్రాతిపదికగా చేసుకొని సభ అదుపులో లేదంటూ వాయిదా వేయడం ముమ్మాటికీ బిజెపి ప్రభుత్వ పలాయన వాదమే. ఆ మాటకొస్తే సరిగ్గా నాలుగేళ్లనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను విభజించే బిల్లు చర్చకొచ్చినప్పుడు లోక్‌సభ, రాజ్యసభ అస్సలు ఆర్డర్‌లో లేవు. గందరగోళం మధ్యనే విభజన బిల్లుకు నాడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి ఎంచక్కా ఆమోదించింది. అధికారంలోకొచ్చిన నాలుగేళ్ల తర్వాత ఏపీకి ఇచ్చిన హామీలు నెరవేర్చని కారణంగా తమ సర్కారుపై ఏపీ పార్టీలు అవిశ్వాసం పెడితే మాత్రం బిజెపికి సభా సంప్రదాయాలు గుర్తుకు రావడం రెండు నాల్కల వైఖరికి నిదర్శనం,

విభజన సమయంలో ఏపీకి ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వనివి కూడా ఎన్నో అమలు చేశామంటున్న బిజెపి ఎందుకు అవిశ్వాసంపై చర్చకు వెనక్కి పోతోంది? మోడీ, జైట్లీ, అమిత్‌షాలు ఏపీకి ఎన్నో లక్షల కోట్ల రూపాయలిచ్చేశామని కంఠోపాఠం చేస్తున్నారు. తాను కాబట్టి కేంద్రంతో సఖ్యతతో ఉండి సాధించానని టిడిపి గడచిన నాలుగేళ్లల్లో ఎన్నోసార్లు వల్లె వేసింది. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో బిజెపి అస్సలు రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదంటోంది ఆ పార్టీ. నిజంగానే అన్నీ ఇచ్చేసినట్లయితే లోక్‌సభలో చర్చకు బిజెపి అనుమతించొచ్చు కదా? అవిశ్వాసం వలన సంఖ్యా బలం ఆధారంగా చూస్తే ప్రస్తుతానికి ఎన్‌డిఎ సర్కారుకు వచ్చిన ఇబ్బందేమీ లేదని బిజెపి చెబుతోంది. చర్చకు సిద్ధమని హోం మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఒక పక్క చెబుతుండగా చిన్న కారణాలను చూపి చర్చ నుంచి పారిపోవడం దేనికి? ఏపీ విషయంలో తన వైఫల్యాలు, వంచన, ద్రోహం బయట పడతాయన్న భయంతోనే అవిశ్వాసంపై చర్చకు బిజెపి సిద్ధపడట్లేదన్నది స్పష్టం. అవిశ్వాసంపై చర్చకు 50 మంది ఎంపీల మద్దతు ఉంటే సరిపోతుంది. కాంగ్రెస్ సహా పలు పార్టీలు మద్దతిస్తున్నందున చర్చ చేపట్టడానికి ఇబ్బందేమీ లేదు. అయినా కేంద్రం ఒకటి రెండు పార్టీలను ఉసిగొల్పి బయట పడేందుకు ప్రయత్నించడం ఘోరం. అవిశ్వాసాలు, రాజీనామాలతో కేంద్రం దిగి రాదని తేలిపోయింది. ఉధృత ప్రజా పోరాటాలతో కేంద్రం మెడలు వంచడమే మార్గం. ఇప్పటికే రహదారుల దిగ్బంధనం వంటి క్షేత్ర స్థాయి ఉద్యమాలకు ప్రత్యేక హోదా సాధన సమితి, వామపక్షాలు, పలు పార్టీలు, ప్రజా సంఘాలు పిలుపునిచ్చాయి. వైసిపి మద్దతిచ్చింది. ఇప్పటికైనా టిడిపి ప్రజాపోరాటాల్లోకి రావాలి. కనీసం ఆ పోరాటాలకు మద్దతుగా నిలబడాలి.

ఇదీ విషయం




చట్ట సభలో చట్టాలే
దిక్కులేని అనాథలు...
క్షణం క్షణం రగులుతున్న
తెలుగు గుండె నినాదాలు!

ప్రజల సొమ్ముతో సోకులు
నాటకీయ నేతలు...
కుట్రలతో రాష్ట్రాలకు
బూటకాల సాకులు!

- కొల్లూరు వెంకట్

వామపక్షాలకు కాంగ్రెస్ అవసరం లేదు

విశ్లేషణ



జి సంపత్

స్వయం ప్రకటిత ఉదార భావుకులు భారత దేశంలో వామపక్షాలకు అత్యంత ఆనందంగా రాసిన అంతిమ వాక్యాల వెల్లువ దేశాన్ని ముంచెత్తి ఒక వారం మాత్రమే గడిచింది. సూర్యాస్తమయం ఎరుపు, సూర్యోదయం కాషాయం అన్న ఉపమాలంకారాన్ని వారు మళ్లీ ప్రయోగించారు. సరే, గత వారాంతంలో మహారాష్ట్రలో 30 వేల మంది రైతులు రోజుల తరబడి సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ప్రస్థానం సాగించారు. భారత దేశపు ఆర్థిక రాజధానిని తమ ఎర్రజెండాలతో అరుణారుణం చేశారు. రోజూ తమ రిఫ్రిజిరేటర్లలో అట్టిపెట్టుకునే ఆహార పదార్థాలను పండించే వారి పట్ల కనీస గౌరవం లేని కులీన పాలకులను తమ హక్కుల కోసం నిలదీయడమే లక్ష్యంగా సాగిందీ కర్షక ప్రస్థానం.

మరైతే వామపక్షం మరణశయ్య మీదున్నట్టేనా? ఇటీవల జరిగిన త్రిపుర ఎన్నికలలో సిపిఐ(ఎం) ఓటమి వామపక్షాలకు చావు దెబ్బ కాదా? ఒకవేళ కేరళలో కూడా రాబోయే శాసనసభ ఎన్నికలలో అధికారం కోల్పోతే ఏం జరుగుతుంది? ప్రస్తుత పరిస్థితుల్లో బలంగా వినిపిస్తున్న రాజకీయ చతురత ప్రకారం చూసేట్టయితే వామపక్షం చావుబతుకుల మధ్య ఆక్సిజన్‌పై వుంది. కాంగ్రెస్‌తో జత కట్టాలా లేదా? అనే ఒకే ఒక ప్రశ్నకు ఇచ్చే జవాబుపైనే అది బతికి బట్టకట్టడమన్నది ఆధారపడి వుంది. నిజానికిది చాలా పాతకాలపు సందిగ్ధమే.

త్రిపురలో సిపిఐ(ఎం) అధికారం కోల్పోవడం ఒక పెద్ద ఎదురు దెబ్బ అన్నది నిజమే. అలాగాక మరో రకంగా భావించడం ప్రాణాంతక భ్రమే కావచ్చు. కాని, ఈ మహా నష్టం కాంగ్రెస్‌తో కలవడానికి ఒక సాకుగా చెప్పడం విషాదకరమవుతుంది. అటువంటి ఐక్య సంఘటన అవసరమనేందుకు రెండు వాదనలను ముందుకు తెస్తుంటారు. వామపక్షాలు అంతకంతకూ పక్కకు నెట్టివేయబడి ప్రాధాన్యత కోల్పోతూ, తమకు తాముగా ఎన్నికల పోరాటం పెద్ద ఎత్తున సాగించలేనంత బలహీనపడిపోయాయనే వాదన ఒకటి. రెండు, సమాజాన్ని ముక్కచెక్కలు చేసే హిందూత్వ శక్తులు 2019లో తిరిగి అధికారం లోకి రాకుండా అడ్డుకోవడం కోసం అన్ని లౌకిక పార్టీలు చేతులు కలపడం అవసరమనే వాదన రెండోది. స్వల్పకాలిక ఎన్నికల కోణంలో ఈ రెండు వాదాలకూ విలువ వుండొచ్చు. ఏమైనప్పటికీ, దీర్ఘకాలంలో మాత్రం కాంగ్రెస్‌తో చేతులు కలపడమనేది ఒక పెద్ద వ్యూహాత్మక తప్పిదం అవుతుంది. ఇప్పటికే ప్రగతిశీల రాజకీయాలకు స్థానం కుదించుకుపోతున్న పరిస్థితిని మరింత తీవ్రం చేస్తుంది. ద్వేషపూరితమైన కుహనా జాతీయవాద రాజకీయాలకు మరింత అవకాశమిస్తుంది.

గతం నుండి నేర్చుకున్నది

ముందు ముందు ఏం జరిగేది తేరిపారచూడటానికి సిపిఎం అపూర్వమైన సిద్ధాంతీకరణలేమీ చేయవలసిన అగత్యం లేదు. ఇతర దేశాలలో తన తోటి పార్టీల చరిత్రను పరికిస్తే సరిపోతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత పశ్చిమ యూరప్‌లోని అతి పెద్ద కమ్యూనిస్టు పార్టీ ఇటలీ కమ్యూనిస్టు పార్టీ (పిసిఐ). దానికి 1976 జాతీయ సార్వత్రిక ఎన్నికలలో 34.4 శాతం ఓట్లు పోలయ్యాయి. అప్పుడది



ఇటలీలో భారత జాతీయ కాంగ్రెస్‌తో పోల్చదగిన 'క్రిష్టియన్ డెమోక్రసీ' (డిసి) పార్టీతో జత కట్టేందుకు 'చారిత్రక రాజీ' చేసుకుంది. వామపక్ష ఎజెండాను ముందుకు తీసుకెళ్లడానికి దాన్ని ఉపయోగించుకోవాలని భావించినట్టు (పైకి) కనిపించింది.

అయితే ఈ పొత్తు నడిచిన కాలంలో జరిగింది వేరు. ఆ క్రమంలో కమ్యూనిస్టులే మితవాదం వైపు మొగ్గారు. డిసి వెనక వున్న కాథలిక్ మధ్య తరగతి ఓటర్లలో అసంతృప్తి వస్తుందనే జంకుతో గర్భస్రావం, విడాకులు వంటి సమస్యలపై లౌకిక, ప్రగతిశీల పార్టీ 'పిసిఐ' తిరోగమన వైఖరి తీసుకుంది. ఈ ఐక్య సంఘటన ప్రభావం వల్ల పడిన దెబ్బ నుండి ఇటలీ పార్లమెంటరీ వామపక్షం ఎన్నటికీ కోలుకోలేకపోయింది.

ఇక రెండో విషయం. వామపక్షాలకు కాంగ్రెస్ అవసరం కన్నా, కాంగ్రెస్‌కే వామపక్షాల అవసరం ఎక్కువ. కాంగ్రెస్ ఎప్పుడూ వామపక్షానికి, మితవాద వర్గాలకు చోటు కల్పిస్తూనే వుంది. ఆ చారిత్రిక సందర్భంలో ఏది పైచేయిగా వుంటే దాన్ని ప్రతిఫలించడమే కాంగ్రెస్ రాజకీయ స్వభావంగా మారింది.

ప్రత్యేకించి జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వం, తొలి ఎనిమిదేళ్ల యుపిఎ పాలనను-కాంగ్రెస్‌కు అత్యంత ప్రగతి శీలమైన దశలుగా చెప్పాలి. ఆ దశల్లోనే కాంగ్రెస్ అనేక ప్రజానుకూల శాసనాలు తీసుకొచ్చింది. పార్లమెంటు లోపల, బయట సైద్ధాంతిక నిబద్ధతతో కూడిన వామపక్షం లేకపోతే అది జరిగేది కాదు.

ప్రభావశీలమైన పాత్ర చూపగల వామపక్ష ఒత్తిడి లేకపోతే కాంగ్రెస్ చాలా తేలిగ్గా మితవాదం వైపు మొగ్గు చూపేదే. కేవలం ఆర్థిక అంశాలలోనే గాక సామాజిక అంశాలలోనూ అదే జరిగి వుండేది. అది ప్రస్తుతం తనకున్నపాటి ప్రగతిశీల లక్షణాలను సైతం కోల్పోయి, భారతీయ జనతా పార్టీకి బలహీనమైన అనుకరణ రూపంగా మారిపోతోంది.

గుజరాత్‌లో కాంగ్రెస్‌కు జరిగింది అదే. గత సంవత్సరం జిగ్నేష్ మేవాని, హార్దిక్ పటేల్, అల్పేష్ ఠాకూర్‌తో అవగాహన కుదిరిన తర్వాత దానిలోని ప్రగతిశీల ధోరణులు ముందుకు వచ్చే వరకూ కాంగ్రెస్ తీరు అలాగే వుండింది.

భూమి లేని దళితులు, నిరుద్యోగ శ్రామికవర్గం, వూడ్చివేయబడుతున్న వ్యవసాయదారులు వామపక్షాలకు కీలకమైన సామాజిక పునాది వర్గాలు. పైన పేర్కొన్న వ్యక్తులు ఈ తరగతుల ప్రయోజనాలకే ఒక రూపం ఇచ్చి వాణి వినిపిస్తున్నారు. సంపదల పున:పంపిణీకై వారు నడిపిన ఉద్యమాల రాజకీయాలు వామపక్షాలతో సహజ సంబంధం కలిగి ఉన్నాయి. కాని, గుజరాత్‌లో వామపక్షాలు దాదాపు నామమాత్రం గనకనే వారు కాంగ్రెస్‌తో కలసి నడిచారు. ఈ వర్గాల హక్కులను పరిరక్షించడంలో కాంగ్రెస్ వైఖరి అస్తవ్యస్తంగా వున్నా వారు అనివార్యంగా చేతులు కలపాల్సి వచ్చింది. ఆ విధమైన రాజకీయ రూపాంతరం కేవలం కాంగ్రెస్‌కు మాత్రమే గాక ఉదారవాదానికి కూడా వుంటుంది. దాన్నే తాను నిలబెడుతున్నట్టు కాంగ్రెస్ చెప్పుకుంటుంది.

> కాంగ్రెస్‌కు సంబంధించిన వరకూ ఆ హస్తాన్ని ఏ రంగులోనైనా చిత్రించవచ్చు. కాని వీరోచిత రైతాంగం ముంబయిలో నిరూపించిన విధంగా స్వతంత్ర వామపక్షం లేకుండా ఎర్రదనాన్ని బయటకు తేవడం సాధ్యం కాని పని. చిత్రకారుడి రంగుల పళ్లెంలో పూర్తిగా కాషాయ వర్ణమే రావడానికి ఇంకా కొద్ది సమయమే వుంది గనక ఈ విషయం అర్థం చేసుకోవడం అత్యావశ్యకం.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రజాస్వామ్య వ్యవస్థలను చూస్తే వామపక్షాలు సామాజికంగా పైచేయిగా వున్నంత వరకే ఉదారవాద రాజకీయాలు ఒక వెలుగు వెలిగాయని అర్థమవుతుంది. ఇరవయ్యో శతాబ్ది ప్రథమార్థంలో పెట్టుబడిదారీ శక్తులపై కార్మిక వర్గం సాధించిన విజయాలే ఈ ఆధిక్యత తెచ్చిపెట్టాయి. అభివృద్ధి చెందిన పాశ్చాత్య పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలకు ప్రతిరూపంగా చెప్పబడే ఉదారపూరిత సంక్షేమ రాజ్యం అన్నది నిజానికి వామపక్షాలు బహూకరించిందే గాని ఉదారవాదుల ప్రజ్ఞ కానేరదు.

సోవియట్ యూనియన్ కుప్పకూలిపోయి, ప్రపంచ వ్యాప్తంగా వామపక్షం నత్తగుల్లలా లోలోపలికి ముడుచుకు పోయిందో లేదో ఈ సంక్షేమ విధానం రాలిపోవడం మొదలుపెట్టింది. ఇక అభివృద్ధి అంటే నయా ఉదారవాద కఠిన నిర్ణయాలేనని, అవే సర్వరోగ నివారిణి అని ఈ ఉదారవాదులు విశృంఖలంగా వాదించే పరిస్థితి ఏర్పడింది.

సాధికారికమైన వామపక్షపు ఆవశ్యకత

వామపక్షం క్షీణతకు, మితవాద శక్తుల విద్వేష పూరిత రాజకీయాల పెరుగుదలకు మధ్య ప్రత్యక్ష సంబంధం వుంది. ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడం కోసం కంకణధారులై పోరాడిందీ, నయా ఫాసిస్టు శక్తులను వీధులలో నిలవరించి పోరాడిందీ వామపక్షాలు...వాటికి సంబంధించిన బృందాలే గాని ఉదారవాదులు కాదు. నాజీ యూరోప్ నుండి సమకాలీన గ్రీస్, జర్మనీల వరకు చరిత్ర పదే పదే నిరూపించిన సత్యమిది. భారతదేశంలోను జెఎన్‌యు నుండి కేరళ వరకు మనం ఇదే చూశాం.

దీని వెనక కారణం తేలిగ్గానే తెలుస్తుంది. బడా పెట్టుబడి, మితవాద అభివృద్ధి నిరోధ జాతీయవాదం (లేదా ఫాసిజం) మధ్య-అలాగే శ్రామిక వర్గాల దారిద్ర్యం, ప్రజాకర్షక నిరంకుశత్వం మధ్య వున్న సహజ సంబంధాన్ని వివరించి చెప్పడం అటుంచి కనీసం గుర్తించేందుకు కావాల్సిన సైద్ధాంతిక చైతన్యం ఉదారవాదానికి లేదు. పైగా ఈ రకమైన కుల పీడన, జాతి దురభిమానం వంటి సమస్యలను స్వేచ్ఛా మార్కెట్ చికిత్సతో వినియోగదారీ విధానమనే హోమియోపతితో పరిష్కరించవచ్చని ఉదారవాదం భావిస్తుంది.

హిందూత్వ కూటమి తీవ్రాతితీవ్రమైన తన దాడిని ఉదారవాదులపై గాక వామపక్షాలపై కేంద్రీకరించడానికి అదే కారణం. భారత దేశంలో వామపక్ష పార్టీలు చేయాల్సిందేమిటో చాలాకాల కిందటే ఒక స్పష్టత ఏర్పడింది. వారు వీధులలోకి రావాలి. దేశవ్యాప్తంగా వివిధ తరగతుల పలు రకాల ప్రజా పోరాటాలకు సహాయంగా తమకున్న వనరులనూ నిర్మాణ శక్తినీ సమకూర్చాలి. రైతుల సమీకరణ నుండి ఉపాధ్యాయుల పోరాటాలు, విద్యార్థుల ఆందోళనలు, భూమి హక్కుల కోసం దళితులు, ఆదివాసుల పోరాటాలు అన్నిటినీ బలపర్చాలి.

వామపక్షాలు ఎన్నికల పరమైన ఆందోళనలు వదులుకొని రాజకీయ సమీకరణ కర్తవ్యాన్ని చేపడితే సాధించగలదేమిటో సిపిఐ(ఎం)కు సంబంధించిన అఖిల భారత కిసాన్ సభ జరిపిన రైతు యాత్ర విజయంతో రుజువైంది. గత ఆదివారం ఈ యాత్ర ఆర్థిక రాజధానిలో ప్రవేశించినప్పుడు వామపక్షేతరులు మాత్రమే గాక వామపక్ష వ్యతిరేకులు, ప్రతిపక్షాలు ఎర్రసముద్రంలో దూకేశాయి. కాంగ్రెస్‌తో పాటు మహారాష్ట్ర నవనిర్మాణ సేన చివరికి శివసేన కూడా మద్దతు ప్రకటించాయి.

దీనంతటిని బట్టి చివరగా చెప్పేది ఏమిటంటే-కాంగ్రెస్, వామపక్షం కలిసి ఒకే ఎన్నికల కూటమిగా రావడం కంటే, ఈ రెండింటిలో ఒక దానిని ఎంపిక చేసుకునే అవకాశమివ్వడం ఎక్కువ ఉపయోగం. తద్వారా ఓటర్ల సమీకరణ సులభతరం అవుతుంది. ఇది బిజెపికి వ్యతిరేకంగా ఒక్కటి గాక వామపక్ష, మధ్యవాద కూటములు రెండింటినీ వేర్వేరుగా నిలబెట్టడం ఇంగితజ్ఞానానికి విరుద్ధంగా కనిపించినా నిజానికి చాలా వివేకవంతమైన ఆలోచన. అత్యంత అభివృద్ధి నిరోధకమైన బిజెపిని సామాజిక-సాంస్కృతిక చట్రంలో సరైన చోట చూపించడం దీనివల్ల కలిగే అదనపు ప్రయోజనం.

ఒక హిందూత్వ పార్టీ ఎన్నికలో ఎంత ప్రబల శక్తిగా ఉన్నప్పటికీ...మధ్యవాద శక్తుల స్థానాన్ని ఆక్రమించి అక్కడి నుండి క్రమంగా వామపక్షాన్ని మొత్తంగా తోసివేసే ప్రక్రియ దీనంతటి వల్ల మరింత కష్టతరం అవుతుంది. మెజార్టీవాద రాజకీయాలు కూడా క్షీణ ఉపాంతర సూత్రానికి గురవుతాయని ఉత్తరప్రదేశ్, బీహార్ మధ్యంతర ఎన్నికల ఫలితాలు సరైన సందర్భంలోనే గుర్తుచేశాయి.

కాంగ్రెస్‌కు సంబంధించిన వరకూ ఆ హస్తాన్ని ఏ రంగులోనైనా చిత్రించవచ్చు. కాని వీరోచిత రైతాంగం ముంబయిలో నిరూపించిన విధంగా స్వతంత్ర వామపక్షం లేకుండా ఎర్రదనాన్ని బయటకు తేవడం సాధ్యం కాని పని. చిత్రకారుడి రంగుల పళ్లెంలో పూర్తిగా కాషాయ వర్ణమే రావడానికి ఇంకా కొద్ది సమయమే వుంది గనక ఈ విషయం అర్థం చేసుకోవడం అత్యావశ్యకం.

('ది హిందూ' సౌజన్యంతో)

గణాంకాలు

ఎవరెవరు ఎంత కాలం?

ఇటీవల రష్యా అధ్యక్ష ఎన్నికల్లో వ్లాదిమిర్ పుతిన్ విజయం సాధించారు. గత వందేళ్లలో రష్యాను పరిపాలించిన ప్రసిద్ధ నేతల పదవీ కాలం చూద్దాం..

నేత	పదవీ కాలం (రోజులలో)
జోసఫ్ స్టాలిన్	10,636
వ్లాదిమిర్ పుతిన్ (ప్రధానిగా, అధ్యక్షుడిగా)	6,788
లియోనిడ్ బ్రెజిన్యూ	6,601
నికిటా క్రుశ్చేవ్	3,536
బోరిస్ ఎల్సిన్	3,096
మిఖైల్ గోర్బచేవ్	2,480
డిమిత్రీ మెద్వెదేవ్	1,461
జార్జ్ మాలెన్‌కోవ్	705
యూరి యాండ్రోపోవ్	454
కాన్‌స్టాంటిన్ చెర్‌నెంకో	391
వ్లాదిమిర్ లెనిన్	387

అవినీతిలో మన ర్యాంకు

గత పదేళ్లలో భారత్‌లో అవినీతి నిర్మూలనలో ఎటువంటి పురోగతి లేదు. అంతర్జాతీయంగా అవినీతి నిర్మూలనపై 'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' చేసిన సర్వేలో భారత్ ర్యాంకు ఇలా వుంది.

సంవత్సరం	భారత్ ర్యాంకు	సర్వే చేసిన దేశాలు
2008	85	180
2009	84	180
2010	87	178
2011	95	182
2012	94	174
2013	94	175
2014	85	174
2015	76	167
2016	79	176
2017	81	182



జన వాక్యం

గొంతెండుతోంది




ఎండాకాలం ప్రారంభంలోనే భానుడు విశ్వరూపాన్ని చూపిస్తున్నాడు. ఉష్ణోగ్రతలు అంతకంతకూ పెరుగుతున్నాయి. దీనివల్ల అనేక ప్రాంతాలలో తీవ్ర నీటికొరత ఏర్పడింది. ముఖ్యంగా పల్లెల్లోకన్నా పట్టణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాదచారులు తాగడానికి సైతం నీరు వుండటం లేదు. కొంతమంది చలివేంద్రాలతో దాహార్తిని తీరుస్తున్నా అవి ఎంతకాలం వుంటాయో చెప్పలేం. నిత్యం రద్దీగా వుండే బస్ స్టాండ్లలో కూడా మన ప్రభుత్వం ఇప్పటికీ మంచినీటి వసతి కల్పించలేక పోతోంది. ఒకవేళ ఏర్పాటు చేసినా దానిని నిర్వహించే బాధ్యత మాత్రం తీసుకోనంటున్నది. ప్రభుత్వం ఇకనైనా ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలి. ప్రజల దాహార్తిని తీర్చేందుకు విరివిగా చలివేంద్రాలు ఏర్పాటుచేసి నిర్వహించాలి.

శేష సాయి కుమార్, తిరుపతి.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

ఔషధ రంగంలో ఏం జరుగుతోంది?

సమీక్ష



ఎస్ వినయకుమార్

ఏదైనా వ్యాపారంలో రెండు వేల శాతం మార్జిన్ ఉంటుందా? ఔషధ రంగంలో ఉంటుందని కార్పొరేట్ ఆస్పత్రులు నిరూపించాయి. తమ దోపిడీని వేలెత్తి చూపితే ఎంతటి వాడిదైనా తల తెగిపడ్తుందని కూడా చూపెట్టాయి. ఔషధ ధరల నిర్ణయాధికార సంస్థ (ఎన్‌పీపీఏ) చైర్మన్ భూపేంద్రసింగ్ ఎకాఎకి బదిలీ ఇందుకో ఉదాహరణ. మందుల ధరలను తగ్గిస్తామన్న మోడీ ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా చుక్కలు చూపింది. ప్రధాని మాటలు నీటిమూటలేనని పదేపదే తేలిపోయింది. నాలుగేళ్లలో దేశంలో మందుల ధరలు తగ్గకపోగా మరింత పెరిగాయి. జీఎస్‌టీ వడ్డన కూడా ధరలకు తోడైంది. జనరిక్ మందులే రాయాలంటూ ఏడాది క్రితం మోడీ చేసిన హూంకరింపులు గాలిలో కలిశాయి. జనం నిట్టూర్పులు మిగిలాయి. ఫార్మసీ కంపెనీల, కార్పొరేట్ ఆస్పత్రుల నిలువు దోపిడీ నిరాటంకంగా కొనసాగుతోంది.

ఎన్‌పీపీఏ చైర్మన్ భూపేంద్ర సింగ్‌ను బదిలీ దురంతం కూడా మోడీ ప్రభుత్వ జన వ్యతిరేక ధోరణికి ఓ తాజా ఉదాహరణ. ప్రయివేట్ రంగంలోని నాలుగు కార్పొరేట్ ఆస్పత్రులు ఆపద సమయంలో రెండు వేల శాతం లాభం వేసుకొని, అంటే రూపాయి మందును రెండు వేలకు అమ్మాయి. సినిమా థియేటర్లలో గేట్లు మూసి నిలువు దోపిడీ చేసినట్టు ఆ మందులు తమ ఆస్పత్రుల్లోని ఫార్మసీ షాపులోనే కొనాలని షరతు విధించాయి. ఎన్‌పీపీఏ దర్యాప్తులో ఈ విషయం బయటపడింది. ఆ నివేదికను ఎన్‌పీపీఏ విడుదల చేసిన పది రోజుల్లోనే చైర్మన్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో మరొకరిని ప్రభుత్వం నియమించలేదు. ఆ ఆస్పత్రులపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తమ దోపిడీని ఎన్‌పీపీఏ బయట పెట్టినందువల్లే పలుకుబడిగల ఆస్పత్రుల యాజమాన్యాలు చైర్మన్‌ను బదిలీ చేయించాయని ఆలిండియా డ్రగ్ యాక్షన్ నెట్‌వర్క్ సంస్థ విమర్శించింది.

ప్రమోషన్ పేర డాక్టర్లపై పెట్టే ఖర్చును తమ అకౌంట్లలో చూపి ఔషధ కంపెనీలు పన్ను మినహాయింపు కోరవచ్చని పూనేలోని ఆదాయపు పన్ను అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు కూడా విస్మయం కల్గించేదే. ఈ తీర్పు వైద్య రంగంలో పరిరక్షించాల్సిన విలువలను ప్రశ్నార్థకం చేసింది. తమ కంపెనీ మందులు రాయాలని కోరుతూ డాక్టర్లను మందుల కంపెనీలు ప్రలోభ పెట్టడం అందరికీ తెలిసిందే. డాక్టర్లకు మందుల శాంపిల్స్ ఇవ్వడంతోనే కంపెనీలు ఆగవు. ఖరీదైన గిఫ్టులు, ప్రయాణ టిక్కెట్లు, ఆతిథ్యం వగైరాలూ సమకూర్చుతుంటాయి. మెడికల్ కాన్ఫరెన్సులను స్పాన్సర్ చేస్తుంటాయి. ఈ చర్యలు భారతీయ వైద్య మండలి (ఎంసీఐ) కోడ్ ఆఫ్ ఎథిక్స్‌కు విరుద్ధం కనుక ఆ ఖర్చుకు పన్ను మినహాయింపు ఇవ్వలేమని ఆదాయపు పన్ను శాఖ చెపుతూ వచ్చింది. ఆదాయపు పన్ను శాఖ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఓ ఔషధ కంపెనీ ట్రిబ్యునల్‌కు వెళ్లగా ట్రిబ్యునల్ పై తీర్పు ప్రకటించింది.

ఔషధ రంగం ఇతర వ్యాపారాల్లాంటిది కాదు అని చెప్పడం న్యాయసమ్మతం! ఎంసీఐ మార్గదర్శకాలు మందుల కంపెనీలకు ఎందుకు వర్తించరాదు? అవి పాటించదగినది కావా? ఇవన్నీ ప్రశ్నలే. ఎంసీఐ వ్యవహారం కూడా గొప్పగా లేదు. కాగా డాక్టర్లకు సంబంధించైనా తన మార్గదర్శకాల అమలుకు ఎంసీఐ ప్రయత్నిస్తుందా? దానికి అంత యంత్రాంగం ఉందా? ఇటీవల ప్రసార భారతి చూపుతున్న తెగువ అదెందుకు చూపలేకపోతోంది? మందుల అమ్మకాలకు ప్రచారం చేసుకోరాదన్న ఎంసీఐ మార్గదర్శకాలు మందుల కంపెనీలకు వర్తించరాదని భావిస్తే అదే విషయం స్పష్టంగా చెప్పాలి. లేదా మందుల కంపెనీలకు కూడా అవి వర్తించేలా అవసరమైన చర్యలు చేపట్టాలి. కానీ మోడీ ప్రభుత్వం అందుకు పూనుకొంటుందన్న ఆశ లేదు. తమ ఉత్పత్తుల ప్రమోషన్ల పేర్లతో డాక్టర్లను ప్రలోభ పెట్టి, ఆ భారాన్ని మందుల కంపెనీలు రోగుల నుండే వసూలు చేస్తాయి కదా. తక్కువ ధరలో అందుబాటులో ఉన్న మందులను వదలి డాక్టర్లు తమ లాభం కోసం ఖరీదైన మందులు రాస్తారన్నది కేవలం నిరాధార విమర్శ కాదుగదా!

డాక్టర్లు జనరిక్ మందులనే చీటీల్లో (ప్రిస్క్రిప్షన్) రాయాలని బ్రాండెడ్ మందులు రాయకూడదని గతేడాది ఏప్రిల్‌లో ప్రధాని అట్టహాసంగా పునరుద్ఘాటించారు. దానిని గొప్ప ముందడుగులా చూపుతూ మీడియా విశేష ప్రాధాన్యత కూడా ఇచ్చింది. చీటీలపై మందుల జనరిక్ పేర్లనే రాయాలన్న నిబంధన వల్లకాట్లో బొగ్గులేరు కోరాదన్న ఉద్దేశంతో రూపొందించబడింది. జనరిక్ మెడిసిన్ తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తుందని ప్రధాని గొప్ప ఉపన్యాసం దంచారు. ప్రధాని బొమ్మను సైన్ బోర్డుల మీద వేసుకొని దేశంలో అక్కడక్కడా జనరిక్ మెడికల్ షాపులు వచ్చాయి. ఆ తర్వాత మూతబడ్డాయి.



మోడీ ప్రభుత్వ రాజకీయ కక్కుర్తి ఎలా ఉందంటే జనరిక్ మందుల పథకానికి కూడా తన పార్టీ పేరు వచ్చేట్టు చూసుకొంది. 'భారతీయ జన ఔషధి ప్రోగ్రాం' (బీజేపీ) అని ఆ పథకానికి కొత్త పేరొకటి పెట్టారు.

డాక్టర్లు మందు చీటీలపై జనరిక్ పేర్లు రాయడం లేదు. బ్రాండ్ల పేర్లే రాస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోని డాక్టర్లు కూడా రోగులతో బ్రాండెడ్ మందులనే తెప్పించి ఇస్తున్నారు. ప్రభుత్వ డాక్టర్లతోనైనా జనరిక్ మందులు రాయించాలన్న కొద్దిపాటి చిత్తశుద్ధినీ మోడీ ప్రభుత్వం చూపలేదు. జనరిక్ మందులకు బ్రాండెడ్ మందులకు ధరల్లో తేడా కనీసం నాలుగు రెట్లు ఉంటుంది.

'ఒక దేశం ఒకే ఎన్నికలు' అనే ప్రధానికి 'ఒకే మందు-ఒకే పేరు-ఒకే ధర' అన్న ఆలోచన కూడా రాదు. జనరిక్ మందులపై కూడా కంపెనీలు బ్రాండెడ్ ఎంఆర్‌పీ ధరలనే ముద్రిస్తున్నాయి. దీన్ని అవకాశంగా తీసుకొని జనరిక్ మందులను కూడా ఎక్కువ ధరలకు అమ్ముతున్నారు. మందుల దుకాణాలు, ప్రయివేట్ ఆస్పత్రులు కూడా అదే పని చేస్తున్నాయి. విషయం తెలియని పేషెంట్లు మాత్రం డిస్కౌంట్లను చూసి సంబర పడ్తుంటారు. గత ప్రభుత్వాలు ఈ విషయం పట్టించుకోలేదు. మోడీ కూడా అంతే.

కొత్త మందుల కోసం పరిశోధనలు చేయవలసిన ప్రభుత్వాలు ఆ పని చేయడం లేదు. ప్రయివేట్ కంపెనీలు ఆ పని చేసి కొత్త మందులపై 15 నుండి 20 ఏళ్ల వరకు పేటెంట్లు పొందుతున్నాయి. పేటెంట్ కాలంలో ఆ కంపెనీలు తమ ఇష్టమైన ధరకు మందుల్ని అమ్ముకోవచ్చు. కనుక పేటెంట్ కాలం ముగిసేలోపు వీలైనంత పిండుకోవడానికి కంపెనీలు ప్రయత్నిస్తాయి. పేటెంట్ కాలం ముగిశాక ఏ కంపెనీ అయినా ఆ మందును తయారు చేయవచ్చు. అప్పుడు కంపెనీల మధ్య పోటీ పెరిగి మందుల ధరలు తగ్గుతాయి. అది వరకు పేటెంట్ ఉన్న కంపెనీ కూడా జనరిక్ పేరుతో ఆ మందు ధర తగ్గించి అమ్ముతుంది. జనరిక్ మందుల పోటీని ఎదుర్కోవడానికి కంపెనీలు రెండు, మూడు మందులను కలిపి కాంబినేషన్ మందులు తయారు చేసి ఎక్కువ ధరలకు అమ్ముతున్నాయి. డాక్టర్ల చేత కాంబినేషన్ మందులు రాయిస్తున్నాయి. కాంబినేషన్ మందులు జనరిక్‌లో ఉండవు కనుక మందుల కంపెనీలు ఈ ఎత్తు వేస్తున్నాయి.

డ్రగ్ రెసిస్టెంట్ టీబీ చికిత్సకు అవసరమైన బెడాక్విలిన్, డెలామనిడ్ అనే మందులను కనిపెట్టి ఉత్పత్తి చేస్తున్న విదేశీ కంపెనీలు వాటి తయారీ కోసం భారతీయ కంపెనీలకు లైసెన్సు ఇవ్వడం లేదు. ఆ లైసెన్సు లభిస్తే డ్రగ్ రెసిస్టెంట్ టీబీ రోగులకు చికిత్స అందుబాటులోకి వస్తుంది. ఖరీదు కూడా భారీగా తగ్గుతుంది. దేశంలో ఇలాంటి క్షయవ్యాధి బాధితులు 1.13 లక్షల మంది వుంటే విదేశీ మందుల కంపెనీల నుండి 'డొనేషన్'గా సేకరించిన 10,000 బెడాక్విలిన్, 400 డోసుల డెలామనిడ్ మందులు మాత్రమే దేశంలో అందుబాటులో ఉన్నాయి. ఈ విషయంలో కూడా భారత ప్రభుత్వ ధోరణి పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

(రచయిత ప్రజాశక్తి పూర్వ సంపాదకులు)

ప్రజాశక్తి
jeevanapageps@gmail.com
జీవన the family
JEEVANA





మామిడితో టేస్టీ పలావ్

ఇది మామిడికాయల సీజన్. పుల్లపుల్లని, తీయ తీయని రుచికే కాదు, ఎన్నో రకాల పోషక విలువలు, విటమిన్లూ మామిడిలో పుష్కలంగా ఉంటాయి. అయితే పచ్చి మామిడికాయ అనగానే చాలామందికి తొక్కుడు పచ్చడి, పప్పు మామిడికాయ, పప్పు పులిహోర లాంటివి మాత్రమే గుర్తుకొస్తాయి. కానీ మామిడితో మరెన్నో వంటకాలు ఇంట్లోనే తయారు చేసుకోవచ్చు. అలాంటి నోరూరించే మ్యాంగో వెరైటీస్ ఎలా చేయాలో తెలుసుకుందాం!!

సీజన్‌లోనే తినాలి

మామిడిని పండ్ల అన్నింటిలో రాజు అంటారు. వీటిని దాదాపు అందరూ ఇష్టపడతారు. ఇవి పలు రకాల క్యాన్సర్లు రాకుండా చేస్తుంది. వీటిలో ఆరోగ్యాన్ని చక్కబెట్టే యాంటీ ఆక్సిడెంట్స్, ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉంటాయి. ఇంకా విటమిన్ ఎ, బి, సితో పాటుగా పీచు పదార్థం కూడా అధికంగా ఉంటుంది. అయితే వీటిని సీజన్‌లో వచ్చినప్పుడు మాత్రమే తినాలి. సీజన్ కానప్పుడు వచ్చేవి తినడం మంచిది కాదు. చక్కని రంగు, తియ్యటి వాసన వచ్చే కాయలు ఆరోగ్యానికి మంచిది.



- జానకి బడుగు
పోషకాహార నిపుణులు

పలావు

కావాల్సిన పదార్థాలు : బాస్మతి రైస్– కప్పు, మామిడి గుజ్జు – కప్పు, జీడిపప్పు– పావు కప్పు, ఎండుమిర్చి– రెండు, నెయ్యి– రెండు టేబుల్ స్పూన్లు, దాల్చిన చెక్క– తగినంత, లవంగాలు– కొద్దిగా, ఉప్పు– రుచికి సరిపడా, పోపుగింజలు – తగినన్ని



తయారుచేసే విధానం: ముందుగా బియ్యాన్ని అరగంటపాటు నీళ్ళల్లో నానబెట్టాలి. తర్వాత నీళ్ల వంపేసి పక్కన పెట్టుకోవాలి. ఆ తరువాత గ్యాస్ మీద పాత్రపెట్టి అందులో నెయ్యి వేసి, వేడయ్యాక అందులో పోపుగింజలు, దాల్చిన చెక్క, లవంగాలు, యాలకులు, ఎండుమిర్చి వేసి వేయించాలి. అవి వేగాక బియ్యం వేసి కలియబెట్టాలి. కొద్దిసేపు తరువాత అందులో మామిడిపండు గుజ్జు, కాస్త ఉప్పు వేసి, సరిపడా నీళ్ళు పోసి మూత పెట్టాలి. అన్నం ఉడికాక గ్యాస్ ఆఫ్ చేసి, నెయ్యిలో వేయించిన జీడిపప్పును గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. అంతే నోరూరించే మ్యాంగో పలావ్ రెడీ.

మ్యాంగో యోగర్ట్

కావలసిన పదార్థాలు : చల్లని పాలు – నాలుగు కప్పులు, మామిడి ముక్కలు – రెండు కప్పులు, పంచదార – అర కప్పు, మిరియాల పొడి – చెంచా,జీలకర్ర– చెంచా, పెరుగు – అర కప్పు, పచ్చిమిర్చి – ఒకటి, బాదం పొడి – రెండు చెంచాలు, ఉప్పు – చెంచా

తయారుచేసే విధానం : ముందుగా చల్లని పాలు నాలుగు కప్పుల్లో పంచదార కలిపి కరిగించి బాదంపొడి, ఉప్పు చేర్చి మామిడి ముక్కలు చేర్చి రెండు నిమిషాల్లో వెచ్చబెట్టి దింపి పెరుగు చేర్చి తోడుపెట్టాలి. ఇది నాలుగు గంటల తర్వాత గట్టిగా తోడుకుని ఉంటుంది. దీన్ని డీప్ ఫ్రిజ్‌లో రెండు గంటలు ఉంచి కప్పుల్లోకి తీసుకుని తినాలి.



వడ

కావలసిన పదార్థాలు : మామిడి ముక్కలు – రెండు కప్పులు, శెనగపప్పు – కప్పు, బొబ్బరపప్పు – కప్పు, ఎండుమిర్చి – రెండు చెంచాలు, రస్కులపొడి –కప్పు, పచ్చిమిర్చి – ఆరు, జీలకర్ర – చెంచా, ఉప్పు – రెండు చెంచాలు, నూనె – 250 గ్రా



తయారుచేసే విధానం : పప్పులు నానబెట్టి నీరు వడకట్టి మిక్సీ పట్టాలి. దీనిలో ఉప్పు, జీలకర్ర, ఎండుకొబ్బరి, పచ్చిమిర్చి, జీలకర్ర చేర్చి మిక్సీ పట్టాలి. నూనె మరగించి పై మిశ్రమం బంగాళా దుంప ఉండలుగా చేసి రస్కుల పొడిలో ముంచి ప్లాస్టిక్ పేపర్‌పై వత్తి నూనెలో వదలాలి. ఇలా మొత్తం వడలన్నీ వేయించి పెట్టాలి.

మామిడి హల్వా

కావల్సిన పదార్థాలు : దోర మామిడికాయలు – నాలుగు, బెల్లం కోరు – రెండు కప్పులు, కొబ్బరి కోరు – రెండు కప్పులు, నెయ్యి – రెండు చెంచాలు, జీడిపప్పులు – 24, కిస్‌మిస్ – 24, యాలకులు –ఆరు, కుంకుమ పువ్వు – కొంచెం, నెయ్యి – అర కప్పు

తయారుచేసే విధానం : దోర మామిడి ముక్కలు కప్పు నీరు చేర్చి ఉడికించాలి. దీనికి బెల్లం నేతిలో వేయించిన కొబ్బరి, జీడిపప్పులు, కిస్‌మిస్‌లు, యాలకులు అన్నీ చేర్చి ఉడికించాలి. కుంకుమ పువ్వు వేసి కలుపుతూ ఉండాలి. గిన్నెనుంచి మిశ్రమం విడిపోతుండగా దింపి పళ్ళానికి నెయ్యి రాసి పొయ్యాలి. బాగా ఆరాక ఫ్రిజ్‌లో పెట్టి తీసి ముక్కలు తింటే మంచి రుచి! వారంపైగా నిల్వ ఉంటుంది.



రొయ్యల కూర

కావాల్సిన పదార్థాలు : పచ్చి రొయ్యలు– అర కేజీ (శుభ్రం చేసి పసుపు ఉప్పు కలిపి పక్కకు పెట్టాలి), ఉల్లిపాయలు–రెండు, పచ్చిమిర్చి–ఐదు, అల్లం వెల్లుల్ల పేస్టు–రెండు చెంచాలు, చిటికెడు పసుపు, కారం– నాలుగు చెంచాలు, ధనియాల పొడి– చెంచా, మసాలా పొడి– చెంచా, నూనె– తగినంత, ఉప్పు– తగినంత కొత్తిమీర – ఒక కట్ట,



తయారుచేసే విధానం : మామిడికాయను మెత్తగా పేస్టు చేసుకోవాలి. గిన్నెలో నూనె వేసి కాగాక మొదట సన్నగా తరిగిన ఉల్లి పాయలు, పచ్చిమిర్చి వేసి అవి వేగాక అల్లం, వెల్లుల్లి పేస్టు వేసి సన్న మంట మీద వేగనివ్వాలి. తరువాత రొయ్యలు వేసి బాగా వేగాక మామిడి కాయ గుజ్జు కూడా వేసి ఉప్పు, కారం, ధనియాల పొడి, మసాలా పొడి వేసి నీరంతా ఇంకిపోయాక కొత్తిమీర వేసి దించాలి.

మీకోసం



చింతపండు రంగు మారకుండా ఎక్కువ రోజులు తాజాగా ఉండాలంటే కాస్త ఉప్పుచల్లి గాలి తగలని డబ్బాలో ఉంచండి.

ఇలా చేస్తే.. కంటినిండా నిద్రే

ప్రస్తుత రోజుల్లో మహిళల్లో నిద్రలేమితో ఉత్పన్నమయ్యే అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా ప్రసవం తర్వాత వారంలో రెండు, మూడు రోజులు నిద్రలేని రాత్రులు గడుపుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇక ఉద్యోగాలు చేసే మహిళలయితే సగటున పనిదినాల్లో రోజూ ఏడుగంటల ఇరవై నిమిషాల పాటు, సెలవు దినాలలో ఎనిమిది గంటల ఇరవై నిమిషాల పాటు నిద్రపోతున్నారని ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో వెల్లడైంది. తక్కువ సమయం నిద్ర పోవడం వల్ల శారీరకంగా, మానసికంగా అనేక సమస్యలు వస్తున్నాయి. పని ఒత్తిడి, లైఫ్‌స్టైల్, డిప్రెషన్ నిద్రపై ప్రభావాన్ని చూపిస్తున్నాయి.



నిద్ర సరిపోని వారు తిండి, పని వంటి విషయాలపై ఆసక్తిని కోల్పోతున్నారని తాజా అధ్యయనాల్లో తేలింది. అయితే సమయం తగ్గినా గాఢ నిద్రపోయే వారిలో ఇలాంటి సమస్యలు చాలా తక్కువగా కనిపిస్తున్నాయి. కంటినిండా హాయిగా నిద్రపోవడానికి కొన్ని చిట్కాలు పాటిస్తే మంచి ఫలితాలు ఉంటాయి. నిద్రకు ఉపక్రమించడానికి మూడు గంటల ముందు వ్యాయామం చేస్తే మంచి నిద్రపడుతుంది. అలాగే, పడుకునే ముందు కాఫీ, టీ లాంటివి తాగకూడదు. గోరువెచ్చని పాలు తాగితే మంచి నిద్ర పడుతుంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఒకే సమయంలో పడుకోవడం, నిద్రలేవడం అలవాటు చేసుకోవాలి. పడకగదిలో మంచి సువాసన వచ్చే హానికారకం కాని అగరవత్తులు, క్యాండిల్స్ వెలిగించుకంటే, పరిమళభరితమైన సువాసన మంచి నిద్ర పట్టేలా చేస్తుంది. ★

జీవన సౌరభం

సాధించిన విజయాలను నిరంతరం.. తలచుకోవడమే ముఖ్యం కాదు. రేపటి విజయాల కోసం.. నేడు చేయాల్సిన పనుల గురించి ఆలోచించడమూ ముఖ్యమే!

ఈ సీజన్లో ఖర్బూజ తినాల్సిందే!

వేసవిలో విరివిగా ఖర్బూజ తింటే.. శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. ఎన్నో రకాల ఆరోగ్యకర ప్రయోజనాలను ఇది అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు.



- ఖర్బూజ పండులో దాదాపు 92 శాతం నీరుంటుంది. దీంతో వేసవిలోకలిగే అధిక దాహం సమస్యను ఇది తీరుస్తుంది.
- ఖర్బూజ పండ్లు నేత్ర సమస్యలను దూరం చేస్తాయి. చూపు మెరుగవుతుంది.
- ఈ పండ్లలో ఉండే విటమిన్ ఎ ఊపిరితిత్తుల ఆరోగ్యానికి అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుంది. రోజూ ఓ కప్పు ఖర్బూజ పండ్ల ముక్కల్ని తింటే శరీరానికి అవసరమైన విటమిన్ ఎ అందుతుంది.
- శరీరంలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ఇన్ఫెక్షన్లు తగ్గుతాయి. వ్యాధులు రాకుండా ఉంటాయి.
- ఈ పండ్లలో ఉండే పొటాషియం హైబీపీని తగ్గిస్తుంది. రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. గుండె సమస్యలు ఉన్న వారికి ఈ పండు మంచి ఔషధం,
- తరచూ కండరాలు పట్టేసేవాళ్లు వీటిని తింటే మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యంగా వీటి రసాన్ని తాగడంవల్ల మెదడుకి ఆక్సిజన్ సరఫరా బాగుంటుంది. దాంతో ఒత్తిడి తగ్గుతుంది. చక్కగా నిద్రపడుతుంది.
- చర్మసౌందర్యానికి ఈ పండ్లు ఎంతో మేలు చేస్తాయి. నెలసరి సమయంలో నొప్పి, అధిక రక్తస్రావంతో బాధపడే మహిళలు ఖర్బూజ పండు తింటే ఆ సమస్యలు ఇట్టే తగ్గుతాయి.
- వీటిలో ఉండే ఫోలిక్ యాసిడ్ గర్భిణులకు ఎంతో మేలు చేస్తుంది. బిడ్డ ఎదుగుదలకు తోడ్పడుతుంది.
- ఖర్బూజ పండ్ల గింజల్ని పొడి చేసుకుని తింటే జీర్ణాశయం శుభ్రమవుతుంది. దగ్గు, జ్వరం, అజీర్తి సమస్యలు తగ్గుతాయి. ★

హైహీల్స్‌తో.. హై రిస్కే!

ప్రస్తుత కాలంలో అమ్మాయిలు ఆధునిక ట్రెండ్‌కు అనుగుణంగా హైహీల్స్ ధరించేందుకు అమితాసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా కాస్తంత ఎత్తు తక్కువగా ఉండే అమ్మాయిలు అయితే.. హైహీల్సే వేసేందుకే ఇష్టపడతారు. అయితే, హైహీల్స్ ధరించడం వల్ల అందంగా కనిపించడం కంటే.. అనారోగ్య సమస్యల బారిన పడతారని వైద్యులు హెచ్చరిస్తున్నారు. హైహీల్స్ వేసుకోవడం వల్ల కాళ్లపై అధిక ఒత్తిడి పడుతుంది. హీల్ సైజ్ పెరిగే కొద్దీ ఒత్తిడి కూడా పెరుగుతూ ఉంటుంది. అలాగే, సాధారణంగా నిలబడక పోవడంవల్ల కండరాలపై అధికంగా ఒత్తిడి పడుతుంది. ఒక అంగుళం ఉన్న హీల్ వల్ల 22 శాతం, రెండు అంగుళాల హీల్ వల్ల 57 శాతం, మూడు అంగుళాల హీల్ వల్ల 76శాతం అధిక భారం పాదాలపై పడుతుందట! అలాగే, నడుము కిందిభాగంలో ఒత్తిడిపడి కొంచెం వెనక్కి వంగిపోయి, ఛాతిభాగం ముందుకు వస్తుంది. అందువల్ల



స్పాండిలైటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. కాళ్లకూ పాదాలకు మధ్య రక్తప్రసరణ సరిగా జరగకపోవడం వల్ల నరాలు బలహీనంగా మారి అనేక సమస్యలు వస్తాయి. మోకాళ్ళపై ఎక్కువ ఒత్తిడి పడడం వల్ల ఆస్టియో ఆర్థరైటిస్ వస్తుంది. శరీర బరువు అంతా పాదాలపై పడటం వల్ల నరాలు ఎముకలు దెబ్బతినే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సో.. హైహీల్స్‌కు దూరంగా ఉంటేనే మంచిది. ★

ప్రణాళికతో ఒత్తిడి దూరం

స్వాతి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. పెద్ద కంపెనీలో ఉద్యోగం. ఇంటి పనుల కంటే ఆఫీస్ పనులకే ప్రాధాన్యం ఇస్తుంది. కూతురి అభివృద్ధిని చూసి తల్లిదండ్రులు చాలా సంతోషించారు. అదే సమయంలో మంచి సంబంధం చూసి పెళ్ళి చేశారు. అతను కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగే. పెళ్ళి తర్వాత స్వాతికి బాధ్యతలు పెరిగాయి. ఇటు ఆఫీస్ పనులు, అటు ఇంటి పనులతో సతమతమయ్యేది. భర్తతో మాట్లాడటానికి కూడా సమయం దొరికేది కాదు. దాంతో ఇద్దరి మధ్యా చిన్న చిన్న మనస్పర్థలు మొదలు. స్వాతి మాదిరిగానే ఉద్యోగం చేసే మహిళలు చాలామంది ఉదయం లేచింది మొదలు రాత్రి చీకటి పడే వరకు అనేక పనులతో తీవ్ర ఒత్తిడిలో గడిపేస్తున్నారు. ఉద్యోగ భద్రతలేక ఎక్కువగా ఆఫీసులకే పరిమితమవుతున్నారు. దాంతో ఇంట్లోవాళ్లతో కలిసి కొద్దిసేపు సరదాగా గడపడానికిగాని, ఎక్కడికైనా బయటకు వెళ్లడానికిగాని అస్సలు కుదరడం లేదు. దాంతో భార్యభర్తల మధ్య సంబంధాలు దెబ్బతింటున్నాయి. అలాంటి వారు కొన్ని ప్రణాళికాబద్ధమైన చిట్కాలను అవలంబిస్తే అటు ఆఫీసు పనులతోపాటు, ఇంట్లోవారితో కూడా హాయిగా సమయాన్ని కేటాయించుకోవచ్చు.

✧ ముందుగా ఏదైనా ఒక పని మొదలు పెట్టినప్పుడు దానిపైనే దృష్టి సారించాలి. ఆఫీసు పనులను తొందరగా పూర్తి చేసుకుంటే, ఇంటికి త్వరగా చేరుకోవచ్చు. అలాగే ఇంట్లో ఉన్న పనులు, బాధ్యతలు ఒక్కరే తీసుకోకుండా ఎవరి పని వాళ్లు చేసుకుంటే చాలా మంచిది. లేకపోతే తీవ్ర నష్టాలను చవిచూడాల్సి వస్తుంది.

✧ మొదటగా పూర్తి చేయాల్సిన పనులను పూర్తి చేయకముందే ఇతర బాధ్యతలను తీసుకోవడం వల్ల.. రెండింటికీ న్యాయం చేయలేరు. ఒకవేళ ఇలా చేయాల్సి వస్తే.. వ్యక్తిగత జీవితంలో పొందాల్సిన సంతోషాన్ని కోల్పోయే అవకాశాలు ఉన్నాయి. అందుకే ఈ విషయంలో జాగ్రత్త వహించక తప్పదు.

✧ మన సామర్థ్యానికి తగ్గట్టుగా ఒక పనిని ఎంచుకోవాలి. అంటే ఆఫీసులో చేస్తున్న పనిమీదే దృష్టిని కేంద్రీకరించాలి. ఆఫీసులో ఇతరులతో అనవసరపు మాటలతో సమయాన్ని వృథా చేసుకోకూడదు. అంతేకాదు, ప్రస్తుత కాలంలో ప్రతిఒక్కరు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లు తెగ వాడేస్తుంటారు. అయితే పని మధ్యలో వీటిని ఉపయోగించకూడదు. అలా అని అసలే విశ్రాంతి లేకుండా పని చేయకూడదు. మధ్యమధ్యలో పది నిమిషాలు విరామం తీసుకుంటే చాలా మంచిది. మెదడు కూడా చురుగ్గా పనిచేస్తుంది.

✧ పనిచేస్తున్న సమయంలో తోటివారుగాని, మరేవరైనాగాని ఇతర పనులు అప్పగించినప్పుడు నిస్సందేహంగా వాటిని తిరస్కరిస్తే మంచిది. ముందు మన పని ముగిసిన తర్వాతే ఇతరుల పనిని సమర్థవంతంగా చేయగలమని గ్రహించాలి.

✧ మనం చేసే పనిని ఇతర ఆలోచనలు లేకుండా నిర్వర్తించుకోవాలి. అప్పుడే విజయాన్ని సాధించగలం. అలా అని ఎక్కువ సమయాన్ని కూడా కేటాయించుకోకూడదు. ప్రణాళికబద్ధంగా ఆఫీసు పనులను నిర్వర్తించుకుని వాటిని సాధ్యమైనంత వరకు పూర్తి చేయడానికి ప్రయత్నించాలి. అప్పుడే వ్యక్తిగతంగా కొంత సమయాన్ని కుటుంబ సభ్యులతో కేటాయించుకోడానికి వీలుగా ఉంటుంది.

✧ ఏదైనా ఒక పని చేయలేరు అనుకుని నిర్ధారణకు వస్తే, ప్రారంభంలోనే వదిలేయాలి. అనవసరంగా ఆలోచించి సమయాన్ని వృథా చేసుకోకూడదు. ముందు ఏది అవసరం అయితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి. ఒకవేళ నిర్ణయించుకున్న సమయంలో ఆఫీసు పనులు పూర్తి కాకపోతే.. తర్వాతి రోజు వాటిని పూర్తి చేసేందుకు ప్రయత్నించాలి. అప్పుడే మిగతా వాటి గురించి ఆలోచించుకోవాలి. ఈ విధంగా రోజువారీ ప్రణాళికలను పాటించడం ద్వారా ఒత్తిడినుంచి బయటపడటంతోపాటు కుటుంబంతో హాయిగా గడపొచ్చు. ★



సెన్సెక్స్ ⬆ 74
32,996

నిఫ్టీ ⬆ 30
10,124

రూపాయి ⬇ 02 పై॥
అమెరికా డాలరుకు రూ.
65.19



గుమ్మం వద్దే 'బాష్' సేవలు..

పవర్‌టూల్స్ తయారీ సంస్థ బాష్ పవర్ టూల్స్ ఇండియా తమ వినియోగదారులకు చేరువయ్యేందుకు గుమ్మం వద్దనే సేవలు అందించాలని నిర్ణయించింది. మరమ్మత్తు, శిక్షణ, రొటీన్ మెయింటనెన్స్, ప్రొడక్ట్ డిమాన్‌స్ట్రేషన్ తదితర సేవలను అందించే 'సర్వీసు ఆన్ వీల్స్' వ్యాన్లను బాష్ వపర్ టూల్స్ ఎంబిహెచ్ ప్రెసిడెంట్ హెన్నింగ్ వన్ బాక్స్‌బర్గ్ లాంచనంగా ప్రారంభించారు.



వేతనయేతరులకు గృహ రుణం..

వేతనయేతర, స్వయం ఉపాధి గృహ రుణ గ్రహీతలకు మార్టిగేజ్ అప్పులివ్వడానికి ఎస్‌బిఐ, మార్ట్‌గేజ్ గ్యారంటీ కార్పొరేషన్ (ఐఎంజిసి) ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. దీంతో వేతనయేతర జీవులు గృహ రుణాలు పొందడానికి వీలవుతుందని ఎస్‌బిఐ రిటైల్ ఎండి పికె గుప్తా పేర్కొన్నారు. ఈ రుణాలకు డిఫాల్ట్ గ్యారంటీ కవర్‌ను తాము అందిస్తామని ఐఎంజిసి సిఇఒ మహేష్ మిశ్రా పేర్కొన్నారు.

రేపటి నుంచి ఐసిఐసిఐ సెక్యూరిటీస్ ఐపిఒ



కేతన్ కార్తనిస్

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

ఐసిఐసిఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ నిధుల సమీకరణలో భాగంగా ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు వచ్చింది. మార్చి 22 నుంచి 26 వరకు ఈ ఇష్యూ ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఆ కంపెనీ తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐసిఐసిఐ సెక్యూరిటీస్ లిమిటెడ్ రిటైల్ డిస్ట్రిబ్యూషన్ హెడ్ కేతన్ కార్తనిస్ మాట్లాడుతూ ఇందులో 77 మిలియన్ షేర్లను జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతీ ఈక్విటీ షేర్ రూ.519–520గా నిర్ణయించినట్లు తెలిపారు. కనీసం 28 షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. ఈ ఇష్యూ ద్వారా రూ.4,017 కోట్లు సమీకరించాలని ఆ కంపెనీ నిర్దేశించుకుంది. ఆఫర్ చేస్తున్న ఈక్విటీ షేర్ల మార్చి 13 నుంచి బిఎస్ఇ, ఎన్ఎస్ఇలో లిస్టింగ్ అవుతాయి.

ఎట్టకేలకు లాభాలు..


ముంబయి : ఎన్‌డిఎ ప్రభుత్వంపై తెలుగు దేశం పార్టీ అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో గత ఐదు సెషన్లలో వరుస నష్టాలు మూటగట్టుకున్న దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం తిరిగి ఎట్టకేలకు లాభాలు నమోదు చేశాయి. వివిధ పరిణామాల మధ్య రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు గురైన సెన్సెక్స్ తుదకు 73.64 పాయింట్లు లేదా 0.22 శాతం పెరిగి 32,996.76 వద్ద ముగిసింది. ఉదయం 32,876 వద్ద మొదలైన సూచీ ఓ స్థాయిలో 33,103 గరిష్ట స్థాయికి చేరినప్పటికీ మరో దశలో అమ్మకాల ఒత్తిడితో 32,810.86 వద్ద నమోదయ్యింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 30 పాయింట్లు పెరిగి రాణించి 10,124 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో టాటా స్టీల్ 3.33 శాతం, సన్ ఫార్మా 2.23 శాతం, డాక్టర్ రెడ్డీస్ 2.07 శాతం చొప్పున అధిక లాభాలు సాధించిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు ఒఎన్‌జిసి 1.13 శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.02 శాతం, యస్ బ్యాంకు 0.61 శాతం, కొటాక్ బ్యాంకు 0.60 శాతం చొప్పున అధిక నష్టాలు చవి చూశాయి.

బాస్మతి ఎగుమతులకు డిమాండ్

కొల్‌కత్తా : అంతర్జాతీయ మార్కెట్‌లో భారత బాస్మతీ బియ్యానికి డిమాండ్ పెరుగుతుందని ఇక్రా ఒక రిపోర్టులో పేర్కొంది. ముఖ్యంగా ఇరాన్‌కు అత్యధికంగా ఎగుమతులు జరుగుతున్నాయని పేర్కొంది. ఇక్రా రిపోర్టు ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి తొమ్మిది మాసాల్లో భారత బాస్మతి ఎగుమతుల్లో 22 శాం పెరుగుదల అంచనా వేసింది. వీటి ఎగుమతుల విలువ రూ.26,000 కోట్ల మైలురాయని దాటొచ్చు. 2018–19లో 20 శాతం వృద్ధితో రూ.28వేల కోట్లకు చేరొచ్చని ఇక్రా అంచనా వేసింది.

భారత వృద్ధికి కోతలు

- 2018-19లో 7.6 శాతం
- గోల్డ్‌మాన్ సాచే అంచనాలు
- పిఎన్‌బి స్కామ్‌తో ఒత్తిడి
- రుణాలపై ప్రభావం



న్యూఢిల్లీ / ముంబయి : ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు గోల్డ్‌మాన్ సాచే భారత వృద్ధి రేటు అంచనాలకు కోత పెట్టింది. పంజాబ్ నేషనల్ బ్యాంకులో చోటు చేసుకున్న దాదాపు రూ.13వేల కోట్ల మోసం వల్ల బ్యాంకింగ్ రంగం నిబంధనలు కఠినతరం కానున్నాయని పేర్కొంది. దీంతో రుణాల జారీ వృద్ధిపై కూడా ప్రభావం పడనుందని తెలిపింది. ఈ పరిణామాల మధ్య 2018–19లో భారత వాస్తవ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు 7.6 శాతానికి పరిమితం కానుందని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది. ఇంతక్రితం ఈ వృద్ధి రేటు అంచనాలను 8 శాతంగా పేర్కొంది.

రుణ భయాలు..

గోల్డ్‌మాన్ సాచే రిపోర్టు ప్రకారం పిఎన్‌బిలో చోటు చేసుకున్న మోసం ఇతర బ్యాంకులను తీవ్ర ప్రభావితం చేసింది. ఈ పరిణామం ఆర్థిక వ్యవస్థను స్తబ్దతలోకి నెట్టింది. ఇప్పటికే ప్రభుత్వ రంగ బ్యాంకుల మొండి బాకీలు శిఖరాలకు చేరాయి. రుణాల్లో మూడింట్లో రెండు వంతులు నిరర్థక ఆస్తులుగా మారాయి. రెండేళ్ల క్రితం బ్యాంకులకు దాదాపుగా రూ.2 లక్షల కోట్ల మూలధనం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిధులు బ్యాంకులకు కొంత ఆసరనివ్వచ్చని, ఆర్థిక వ్యవస్థ వృద్ధి, ఉపాధికి దోహదం చేయొచ్చు. భారత్‌లోని బ్యాంకులు దాదాపుగా రూ.8 లక్షల కోట్ల పైగా మొండి బాకీలతో సతమతమవుతున్నాయి.

నియంత్రణ సంస్థలు విఫలం..

పిఎన్‌బిలో చోటు చేసుకున్న భారీ మోసాన్ని అరికట్టడంలో నియంత్రణ సంస్థలు విఫలం అయ్యాయి. బ్యాంకుల కేటాయింపుల భారం పెరగడం, రుణ వృద్ధి రేటు మందగించిందని గోల్డ్‌మాన్ సాచే తన రిపోర్టులో పేర్కొంది. ఈ మోసం వల్ల బ్యాంకులపై ఉన్న సానుకూలత, పునర్ మూలధనం కల్పనపై విశ్వసనీయతను దెబ్బతీయనుంది. అదే విధంగా రుణ మంజూరు, పెట్టుబడులు, వృద్ధి రేటుపై ప్రభావం చూపనుందని విశ్లేషించింది.

2017-18లో 6.6 శాతమే..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 7.2 శాతానికి చేరింది. ఇది గత ఐదు త్రైమాసికాల్లోనే గరిష్టం. 2017–18లో భారత్ 6.6శాతం వృద్ధి నమోదు చేయనుందని గోల్డ్‌మాన్ సాచే అంచనా వేసింది. కాగా 2019–20 నాటికి 8.3 శాతానికి చేరొచ్చని పేర్కొంది. పిఎన్‌బి దాదాపుగా 2 బిలియన్ డాలర్లు నష్టపోయినట్లేనని, ఇది దాదాపుగా ఆ బ్యాంకు ఒక త్రైమాసికం విలువ చేస్తుందని సాచే విశ్లేషించింది.వచ్చే రెండేళ్లలో మొండి బాకీల కోసం బ్యాంకుల కేటాయింపులు 60–65 శాతానికి చేరొచ్చని హెచ్చరించింది. ఇంతక్రితం కేటాయింపుల భారం 50 శాతంగా ఉంది. పిఎన్‌బి మోసం తర్వాత ఇతర చిన్న చిన్న మోసాలు కూడా వరసగా బయటపడుతున్నాయని సాచే తెలిపింది. దీంతో బ్యాంకుల షేర్లపై తీవ్ర ప్రభావం పడుతుందని పేర్కొంది.

మరిన్ని సేఫ్ వాటర్ స్టేషన్లు

హనీవెల్ ఇండియా వెల్లడి

ప్రజాశక్తి – బిజినెస్ బ్యూరో

దేశంలో మరిన్ని సేఫ్ వాటర్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నామని హనీవెల్ ఇండియా ప్రెసిడెంట్ వికాస్ ఛాదా తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సేఫ్ వాటర్ నెట్‌వర్క్ సహకారంతో ప్రతీ ఏడాది కొత్తగా 50 చొప్పున ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. తెలంగాణలో 100 స్టేషన్లను అందుబాటులోకి తెచ్చామన్నారు. 20 లీటర్ల నీటికి రూ.5 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. భారత్‌లో సేఫ్ వాటర్ నెట్‌వర్క్‌కు 225 వరకు స్టేషన్లు ఉన్నాయని ఆ సంస్థ సిఇఒ కుర్ద్ సోడర్ లుండ్ తెలిపారు.

టాటా కార్లు ప్రియం

న్యూఢిల్లీ : ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ తన ప్యాసింజర్ వాహన ధరలను రూ.60,000 వరకూ పెంచుతున్నట్లు ప్రకటించింది. పెంచిన ధరలు ఏప్రిల్ 1వ తేది నుంచి అమల్లోకి వస్తాయని పేర్కొంది. ముడి సరుకుల ధరలు పెరగడంతో పాటు విదేశీ ఆర్థిక పరిణామాలు, దేశీయ మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో ధరలు పెంచాల్సి వచ్చిందని టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్ బిజినెస్ ప్రెసిడెంట్ మయాంక్ పరీక్ తెలిపారు. ఈ కంపెనీ ప్రస్తుతం జెన్ ఎక్స్ నానో రూ.2.28 లక్షల నుంచి ఎస్‌యువి హెక్సా ధర రూ.17.42 లక్షల మధ్య విలువ చేసే అనేక మోడళ్లను విక్రయిస్తుంది. జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల తయారీ కంపెనీ ఆడి తమ ఉత్పత్తుల ధరలను రూ.1 లక్ష నుంచి రూ.9 లక్షల వరకు పెంచుతున్నట్లు గత వారం ప్రకటించిన విషయం తెలిసిందే.

S.S.C. MODEL PAPER

MATHS PAPER-II

ప్రాక్టీస్ బిట్ పేపర్లు

PART – B (1)

Time: 30 Min **Marks: 10**

Instruction:
1. Answer the all questions.
2. Each quention carries 1/2 mark.
3. Part - B answers should be written on the given paper only.
4. No marks given to over writing answers.


14. Slop of the line y = 2 is ________ ( )
A) 2 B) 0
C) 1 D) Undefined


15.  In the figure $\angle CBT = 60^0$ than $\angle CAB$ = ______ ( )
A) 60^0 B) 30^0 C) 90^0 D) 45^0


16. Distance between the points (Sinθ, Cosθ) and (0,0) is _______ ( )
A) Sinθ + Cosθ B) 0
C) 1 D) $Tan^2θ$

17. The proof method which we follow to prove the convers of the thales thoran is ___ ( )
A) Direct proof method
B) Indirect proof method
C) Prove by counter example
D) None of these

18. ΔABC ~ ΔDEF is given of the following is correct ______ ( )




19.  Area of the shaded region is _____ ( )
A) 105 B) 49
C) 10.5 D) 11.5

20. In the adjoing figure ∠ACB ( ) 
A) 60^0 B) 30^0
C) 90^0 D) 45^0


21. $Sin^2 10^0 + Sin^2 8^0$ = _____ ( )
A) 1 B) 6 C) $\frac{1}{2}$ D) $\frac{\sqrt{3}}{2}$

22. $\frac{2\tan 30^0}{1+\tan^2 45^0}$ = _____ ( )
A) $Sin60^0$ B) $Cos60^0$
C) $Tan30^0$ D) $Sin30^0$

23. If the angle of elevation of the sun is increasing from 0^0 to 90^0 the shadow of the pole is ___ ( )
A) Decreasing B) Increasing
C) No change D) Con't say

24. Quadrilateral ABCD is a ____in the diagram ( ) 
A) Square
B) Paralellagram
C) Rectangle
D) Rhombs

25. Which of the following can not be probability of an event _______ ( )
A) $\frac{1}{2}$ B) 1.5 C) 15% D) 0.7

26. In the adjoing figure AP, BP are the tangents to the circle with centre 'O' if $\angle ACB=60^0$ then ∠APB = _______ ( ) 
A) 45^0 B) 60^0
C) 30^0 D) 120^0

27. A bag contain 3 Red x black balls. A ball is drawn at radom probability that the ball drown is black is $\frac{5}{8}$ then x : ______ ( )
A) 8 B) 3 C) 3/8 D) 5

28. The probability of getting heads in both trials when balanced coin is tossed twice will be ________ ( )
A) $\frac{1}{4}$ B) $\frac{1}{2}$ C) $\frac{3}{4}$ D) 1

29. The extreame values of date influenced high on____ ( )
A) Mean B) Median
C) Mode D) Range

30. Mean of the date is 29.75 and mode is 24.5 then the median is ____ ( )
A) 16 B) 20 C) 30 D) 28

31. Value of the mean is ____ ( )
A) Represent All values of the data
B) A unique one
C) Reliable
D) All the above

32. If the point (4,-y) lie on x-axis the y =_______ ( )
A) 1 B) 0 C) -1 D) 2

33. ΔABC~DEF and $\angle A=30^0$ $\angle B=80^0$ then ∠F =___ ( )
A) 80^0 B) 30^0 C) 70^0 D) 50^0

Part -B (1) (Answers)

14.B	15.A	16.C	17.B	18.D
19.C	20.B	21.A	22.C	23.A
24.D	25.B	26.B	27.D	28.A
29.A	30.D	31.D	32.B	33.C

PART – B (2)


Time: 30 Min **Marks: 10**

Instruction:
1. Answer the all questions.
2. Each quention carries 1/2 mark.
3. Part - B answers should be written on the given paper only.
4. No marks given to over writing answers.


14. The lines joining the points (4,5), (2,5) and (-7,-1), (6,-1) are _________ ( )
A) Perpendicular B) Parallel
C) Intersecting D) Con't say

15. In trepizium PQRS, E and F are the points on the non-parallel sides QR and PS respectively such that EF//PQ then $\frac{PE}{ES}$ = _______ ( )
A) $\frac{QF}{FR}$ B) $\frac{BF}{FC}$ C) $\frac{FR}{QF}$ D) $\frac{RE}{QF}$


16. A 15cm pole cost 6m shadow, If the same instance a man of height 1.5 cm cost shadow is ____ ( )
A) 0.16m B) 4.5m
C) 0.6m D) 1.6m

17.  In the figure AD ⊥ BC then AB^2+CD^2=___ ( )
A) $\frac{1}{2}$ B) $\frac{1}{4}$ C) $\frac{1}{3}$ D) $\frac{2}{5}$

18. If Two tangents drawn parallel to a circle, shortest distance between them is equal to _____ ( )
A) Circumference B) Diameter
C) Radius D) Can't Say

19.  Area of the OA×B in the figure is __ square ( )
A) 154 B) 196 C) 140 D) 98

20. If Sin A = $\frac{1}{\sqrt{2}}$ a triangle ABC whose right angle at B. than is C = __________ ( )
A) $\frac{1}{\sqrt{2}}$ B) $\frac{1}{2}$ C) $\frac{\sqrt{3}}{2}$ D) 1


21.  Height of the AB in the diagram is _____m ( )
A)70.32 B) 38.38
C) 40.28 D) 24.2

22. If Sin 81^0 = Cosθ the θ___ ( )
A) 81^0 B) 19^0 C) 99^0 D) 9^0

23. Midpoint of a class interval is 35 upper limit is 40 then the lower limit of the class is ____ ( )
A) 25 B) 45 C) 35 D) 30

24. Which statment is incorrect for the mode the date ( )
A) Must be continuous class intervals
B) Do not depend all values in the data
C) Calculate by using midvalues
D) May not a unique one

25. Sum of probabilities of elementary events in an experiments is ______ ( )
A) 1 B) 0 C) 2 D) 100

26.  ABCD is a rectanglar card board and Q Square in the cardboard with given measurements probability of stone touches the square when it thrown is ____ ( )
A) 1/12 B) 1/3 C) 2/3 D) 1

27. Slop of the line joining the points (a,o), (o,-b) is___ ( )
A) $\frac{a}{b}$ B) 0 C) $\frac{-b}{a}$ D) $\frac{b}{a}$

28. If a side the equilatiral triangle is x cm and it's attitude h cm then $3x^2$ = ________ ( )
A) $3h^2$ B) 4h C) $2h^2$ D) $4h^2$

29. From a point Q length of the tangent to a circle is 24 cm and the distance from Q to its centre is 25cm then the radius is __________cm ( )
A) 20 B) 16 C) 7 D)14

30. $Sec^4θ - Sec^2θ$ = _______ ( )
A) $Cose^2θ-Sec^2θ$
B) $Sec^2θ+Cosec^2θ$
C) $Tan^2θ+Sec^2θ$
D) $Tan^2θSec^2θ$

31. X-coordinate of intersecting point of a less than and greater than agives is ______ ( )
A) Mean B) Mode
C) Median D) Range

32. A bag contains 3 while 5 black balls the probability of black ball drawn is _____( )
A) $\frac{3}{5}$ B) $\frac{5}{3}$
C) $\frac{5}{8}$ D) $\frac{3}{8}$

33. Centroid of the Triangle whose vertics are B(0,0) C(4,-7) is _______ ( )
A) $\left(\frac{10}{3}, \frac{-5}{3}\right)$ B) (10,-5)
C) $\left(\frac{a}{3}, \frac{14}{3}\right)$ D) (0,0)

Part -B (2)(Answers)

14.B	15.A	16.C	17.A	18.B
19.B	20.A	21.D	22.D	23.D
24.C	25.A	26.B	27.C	28.D
29.C	30.D	31.C	32.C	33.A

ఉద్యోగాలు

ఏపీ ఈసెట్-2018

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ వృత్తి విద్యా కళాశాలల్లో 2018–19కి గానూ బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సుల లేటరల్ ఎంట్రీ ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతూ 'ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఈసెట్)–2018' ప్రకటన విడుదలైంది.

కోర్సులు: బీఈ, బీటెక్, బీఫార్మసీ.
అర్హతలు: సంబంధిత విభాగాల్లో డిప్లొమా/ బీఎస్సీ (మ్యాథమెటిక్స్) ఉత్తీర్ణత.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్.
దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 14, 2018.
రూ.1,000 ఆలస్య రుసుముతో చివరి తేదీ: ఏప్రిల్ 21, 2018.
దరఖాస్తు ఫీజు: రూ.550.
పరీక్ష తేదీ: మే 3, 2018.
పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో చూడొచ్చు
వెబ్‌సైట్: www.sche.ap.gov.in

కౌలు రైతు ఆత్మహత్య



వీరాంజనేయులు (ఫైల్)

ప్రజాశక్తి - యడ్లపాడు (గుంటూరు జిల్లా)

అప్పుల బాధ తాళలేక కౌలు రైతు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన గుంటూరు జిల్లా యడ్లపాడు మండలం గింతెనపాడులో మంగళవారం చోటు చేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోపూరి వీరాంజనేయులు(38) కొన్నేళ్లుగా ఆరెకరాల్లో పత్తి పంటను సాగుచేస్తున్నాడు. రెండేళ్లుగా నష్టాల పాలయ్యాడు. ఈ ఏడాదీ గులాబీరంగు పురుగు ఆశించి నష్టం రావడంతో తాను సాగు చేస్తున్న పొలం వద్దే చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



నృత్యప్రదర్శన
ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని ఘంటసాల కళాశాలలో ప్రదర్శించిన కాశ్మీరీ సంప్రదాయాల నృత్యప్రదర్శన

వ్య.కా.సం నాయకుల అక్రమ అరెస్టులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం/తిరుపతి సిటీ

ఉపాధి హామీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపడుతున్న చలో విజయవాడకు బయలుదేరుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులను పోలీసులు మంగళవారం ముందస్తు అక్రమ అరెస్టులు చేశారు. శ్రీకాకుళం జిల్లా పాలకొండ పట్టణంలో సంఘం జిల్లా అధ్యక్షులు గంగరాపు సింహాచలం, జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరమ్మను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వీరఘట్టం మండలం రేగులపాడులో సంఘం నాయకులు వై.గేయమూర్తిని ఆయన నివాసంలో ఎస్ఐ బి.అప్పారావు ముందస్తుగా అక్రమ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. చలో విజయవాడకు వెళ్లేందుకు పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకున్న సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బమ్మిడి ఆనందరావు, నాయకులు దుబ్బ భాస్కరరావును రైల్వేస్టేషన్‌లో కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న వారిని అక్రమంగా అరెస్టు చేయడం అప్రజాస్వామికమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.సింహాచలం, కె.నారాయణరావు విమర్శించారు. తిరుపతి రైల్వేస్టేషన్ ప్రధాన ద్వారం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వందవాసి నాగరాజును అరెస్టు చేసి ఈస్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. అలాగే సిపిఐ కార్యాలయం వద్ద చిన్నం పెంచులయ్యను అరెస్టు చేసే ప్రయత్నం చేయగా పోలీసుల కళ్లుగప్పి వెళ్లిపోవడం గమనార్హం. విజయవాడకు వస్తున్న వ్యవసాయ కార్మికులను ప్రభుత్వం నిర్బందించి అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామని ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాలు తెలిపాయి. ఈ మేరకు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం(ఎఐఎడబ్ల్యాయు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవుల శేఖర్, జల్లి విల్సన్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

సిట్ నివేదికను నీరుగార్చే యత్నం!

- భూ ఆక్రమణల విలువ వేలకోట్ల రూపాయలు
- అధికార పార్టీ పెద్దలకు బినామీలుగా ఆక్రమణదారులు
- పరువు పోతుందని వెనక్కు తగ్గుతున్న ప్రభుత్వం

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ నగర, పరిసర ప్రాంతాల్లో వేల కోట్ల రూపాయల విలువైన భూ ఆక్రమణల వాస్తవాలు వెలుగు చూడకుండా ప్రభుత్వం నీరుగార్చాలని చూస్తోంది. విలువైన ప్రభుత్వ స్థలాలు, భూములు ఆక్రమణల వెనుక అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల అనుయాయులు ఉండడంతో ప్రభుత్వ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించి భూ ఆక్రమణలపై ప్రభుత్వానికి సమర్పించిన సిట్ నివేదికను బయటపెట్టకుండా సిఎం చంద్రబాబు తాత్సారం చేస్తున్నట్లు తెలిసింది.

విశాఖలో భూ కుంభకోణాలపై 2017 జూన్ 28న గ్రేహౌండ్స్ డిఐజి వినీత్‌బ్రిజ్‌లాల్, విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ జి.సృజన, చిత్తూరు జిల్లాకు చెందిన ప్రత్యేక ఉపకలెక్టర్ పార్థసారధితో నియమించిన ప్రత్యేక విచారణ బృందం(సిట్) ఈ ఏడాది జనవరి 29న విశాఖ నగర్ పోలీస్ కమిషనర్ యోగానంద్‌కు నివేదిక అందజేసింది. తరువాత కొద్ది రోజులకు సిట్ నివేదికను ప్రభుత్వానికి సిపి యోగానంద్ అందజేశారు. సిట్‌కు అందిన దాదాపు మూడువేల భూ సంబంధిత ఫిర్యాదుల్లో 348 ఫిర్యాదులను సిట్ అధికారులు విచారించారు. నగరం, జిల్లా వ్యాప్తంగా సిట్‌కు వచ్చిన మొత్తం ఫిర్యాదుల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలు, ట్యాంపరింగ్‌కు సంబంధించిన 348 ఫిర్యాదులపై సిట్ బృందం దృష్టిపెట్టి విచారణను గతేడాది డిసెంబరు 28కి పూర్తి చేసింది. మిగిలినవి వ్యక్తిగత సమస్యలకు సంబంధించినవి కావడంతో సిట్ బృందం ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై కేంద్రీకరించి తమకున్న సమాచారం ఆధారంగా విచారణ చేపట్టింది.

రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, ఫిర్యాదుదారులను సిట్ బృందం విచారించింది. భీమిలి, విశాఖ రూరల్, పెందుర్తి, గాజువాక, పెదగంట్యాడ, విశాఖ అర్బన్, ఆనందపురం, పద్మనాభం, అనకాపల్లి, పరవాడ, అచ్యుతాపురం, సబ్బవరం సహా మరికొన్ని మండలాల్లో వివిధ రకాల ప్రభుత్వభూములకు సంబంధించి దాదాపు మూడువేల ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు సిట్ నివేదించినట్లు తెలిసింది. మూడువేల ఎకరాల్లో అధిక భాగం నగర పరిధిలో ఉన్నట్లు సమాచారం. వేల కోట్ల రూపాయల విలువజేసే మూడువేల ఎకరాలు మూడువందల మందిలోపు కల్గిన వ్యక్తుల చేతుల్లోనే ఉన్నట్లు తెలుస్తుంది. భూ ఆక్రమణల్లో ఆరితేరిన వారంతా ఈ దందాలో భాగస్వాములు కావడంతో 140 మందిపై ఎఫ్ఐఆర్‌కు సిఫార్సు చేసినట్లు సమాచారం. దీంట్లో తహశీల్దార్ స్థాయి నుంచి ఆర్ఐ, విఆర్ఒల వరకు ఉన్నట్లు తెలిసింది. అయితే భూ ఆక్రమణలకు పాల్పడినవారంతా అధికారి పార్టీకి చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల అనుయాయులు కావడం, మరికొందరు అధికార పార్టీకి చెందిన పెద్దతలకాయలకు బినామీలుగా ఉండడంతో సిట్ నివేదికను అసెంబ్లీలో పెట్టడానికి ప్రభుత్వం భయపడుతున్నట్లు తెలిసింది. అధికార పార్టీ వైఫల్యాలపై అన్ని వైపుల నుంచి దాడి పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలన కల్గించిన విశాఖ కుంభకోణంపై సిట్ సమర్పించిన నివేదికను బట్టబయలు చేస్తే మరింత ఇరకాటంలో పడతామని భావించి నివేదికను నీరుగార్చాలని చూస్తున్నట్లు సమాచారం.



ఈ ఏడాది జనవరి 29న విశాఖ సిపి యోగానంద్‌కు నివేదిక అందజేస్తున్న సిట్ బృందం



పోస్టరును ఆవిష్కరిస్తున్న సమాచార శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ 'చలో విజయవాడ' పోస్టరును ఆవిష్కరించిన మంత్రి కాలువ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎజె అనుబంధం) ఆధ్వర్యాన ఈనెల 26వ తేదీన జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమం పోస్టర్‌ను రాష్ట్ర పౌర సంబంధాల శాఖ మంత్రి కాలువ శ్రీనివాసులు మంగళవారం ఆవిష్కరించారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ పదేళ్ల పండుగ సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా చేపట్టిన 'చలో విజయవాడ' పోస్టరును రాజధాని వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన ఆవిష్కరించారు. జర్నలిస్టుల సొంతింటి కల నిజం కావాలని, జర్నలిస్టులపై దాడుల నిరోధానికి ప్రత్యేక చట్టం అవసరమని, పెన్షన్ సదుపాయం కల్పించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ కోరింది. ఈ కార్యక్రమంలో ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఎజె) జాతీయ ఉపాధ్యక్షులు కోటి శ్రీనివాస్, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.బి.నాథన్ పాల్గొన్నారు.

ఓ రైతు నుంచి 60 వేల రూపాయలు లంచం తీసు కుంటూ చిత్తూరు జిల్లా గుర్రంకొండ తహశీల్దార్ రవి చంద్రన్ అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)కి పట్టుబడ్డాడు.

తహశీల్దార్ కార్యాలయం దిగ్బంధనం

మిగులు భూములను పేదలకు పంచాలని డిమాండ్

ప్రజాశక్తి - పామర్రు (కృష్ణా)

ఐనంపూడిలోని మిగులు భూములు స్వాధీనం చేసుకుని పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా పామర్రు తహశీల్దార్ కార్యాలయాన్ని సిపిఎం ఆధ్వర్యంలో పేదలు మంగళవారం దిగ్బంధించారు. వంటావార్పు కార్యక్రమం నిర్వహించి కార్యాలయం ఎదుట తహశీల్దార్ వచ్చే వరకు బైఠాయించారు. సాయంత్రానికి కార్యాలయానికి వచ్చిన తహశీల్దార్ పద్మకుమారి రెండు మూడు రోజుల్లో హద్దులు నిర్ణయించి భూములను స్వాధీన పర్చుకుంటామని, సర్వే చేసి పంపిణీ చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు. సిపిఎం తూర్పు కృష్ణా కమిటీ సభ్యులు చేబ్రోలు భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం తూర్పు కృష్ణా కార్యదర్శి మురాల రాజేష్ మాట్లాడుతూ ఐనంపూడిలో 11.19 సెంట్ల భూమిని న్యాయస్థానాలు మిగులు భూములని తేల్చినా వాటిని స్వాధీన పర్చుకోవటంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీ మేరకు భూములు పంపిణీ చేయకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


అంగన్‌వాడీ నాయకులపై నిర్బంధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీ సమస్యలపై సోమవారం నిర్వహించిన చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు యూనియన్ నాయకులు, కార్యకర్తలపై నిర్బంధం విధించారని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు అనుబంధ సంస్థ) తెలిపింది. దీనిపై చర్యలు తీసుకోవాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ సిఐటియు అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావుతో కలిసి డిజిపి ఎం మాలకొండయ్యకు మంగళవారం ఫిర్యాదు చేశారు. సోమవారం కార్యక్రమం చాలా ప్రశంతంగా జరిగిందని, ముందుగానే పోలీస్ శాఖ అనుమతి తీసుకున్నామని తెలిపారు. ఎటువంటి శాంతిభద్రతలకు విఘాతం కలిగించమని పోలీస్ అధికారుల కోరిక మేరకు రాష్ట్ర నాయకత్వం రాతపూర్వకంగా ఇచ్చిందని వివరించారు. ఐసిడిఎస్ ఉన్నతాధికారులు తమ వద్దకు వచ్చి సమస్యకు సమాధానం ఇచ్చారని తెలిపారు. చిత్తూరు జిల్లాలో 1,720 మందిని అరెస్టులు చేసి భయభ్రాంతులకు గురిచేశారని, ఉగాది పండుగ రోజు బంధువులు, గ్రామస్తుల సమక్షంలో పోలీసులు మహిళలను ఇటువంటి ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. విశాఖపట్నం నుంచి టికెట్స్ తీసుకొని ప్రయాణిస్తున్న 140 మంది మహిళలను రాజమండ్రి స్టేషన్‌లో రాత్రి ట్రైన్ నుంచి దించి పోలీస్ నిర్బంధంలో ఉంచారని తెలిపారు. విజయవాడలో బస్‌లో బయలు దేరిన 70 మంది మహిళలను దించేసి పోలీసులు టికెట్స్ తీసుకున్నారని పేర్కొన్నారు. రాత్రి ఉదయం కూడా పోలీసులు చాలా అసభ్యకరంగా ప్రవర్తించారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోనూ అంగన్‌వాడీ నాయకులు కార్యకర్తలను స్టేషన్లకు పిలిపించి విజయవాడకు వెళ్లవద్దని ఒత్తిడి చేసి అండర్ టేకిర్ తీసుకున్నారని తెలిపారు. విజయవాడ వెళ్లితే కేసులు పెడతామని బెదిరించారని చెప్పారు. వారి సమస్యలపై ప్రజాతంత్ర పద్ధతుల్లో ఆందోళనలు చేసే వారి పట్ల ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం పట్ల తమ అభ్యంతరాన్ని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రజాశక్తి సబ్‌ఎడిటర్ చక్రపాణి మృతి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి



ప్రజాశక్తిలో సబ్‌ఎడిటర్‌గా పనిచేస్తున్న పి.చక్రపాణి మృతి చెందారు. కొద్దికాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. చక్రపాణికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు ఆయన భౌతిక కాయానికి బుధవారం ఉదయం స్వగ్రామం గుంటూరు జిల్లాలోని నర్సరావు పేటలో అంత్యక్రియలు జరగనున్నాయి. చక్రపాణి మృతికి ప్రజాశక్తి ఎడిటర్ పాటూరు రామయ్య, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్. వెంకట్రావు, సిజిఎం ఎంవిఎస్ శర్మ తీవ్ర సంతాపాన్ని,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు.

ఎపిడబ్ల్యుజెఎఫ్ సంతాపం

ప్రజాశక్తి సబ్ ఎడిటర్ చక్రపాణి మృతికి పలువురు జర్నలిస్టు సంఘాల నేతలు సంతాపం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, నేషనల్ అలయన్స్ ఆఫ్ జర్నలిస్ట్ (ఎన్ఎజె) జాతీయ కార్యదర్శి ఒ.శాంతి, ఉపాధ్యక్షులు కోటి శ్రీనివాస్, ఎపిడబ్ల్యుజెఎఫ్ విజయవాడ నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు టి.శ్రీరామ్మూర్తి, షేక్ ఖాజావలి మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. చక్రపాణి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

డిసిఐ ప్రైవేటీకరణ దేశభద్రతకే ప్రమాదకరం

- డిసిఐ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పద్మనాభరాజు

ప్రజాశక్తి- వన్‌టౌన్, విశాఖ

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రైవేటీకరణ దేశ భద్రతకే పెనుముప్పు అని డిసిఐ నాన్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పద్మనాభరాజు హెచ్చరించారు. డిసిఐ ఆస్తుల పరిశీలనకు 'వ్యాల్యూయర్ బృందం' విశాఖ రాకను వ్యతిరేకిస్తూ సిఐటియు ఆధ్వర్యాన సంస్థ గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పద్మనాభరాజు మాట్లాడుతూ, బిజెపి ప్రభుత్వ పెద్దలు కమీషన్లకు కక్కుర్తిపడి బడా పెట్టుబడి దారులకు కారుచౌకగా పరిశ్రమలను అప్పగించేందుకు ప్రయత్నిస్తు న్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆర్థికంగా దెబ్బతీసేందుకు బిజెపి కుట్ర పన్నుతోందని విమర్శించారు. రాష్ట్ర మంత్రులు, ముఖ్య మంత్రి జోక్యం చేసుకొని డిసిఐ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకోవాలని కోరారు. రాష్ట్రంలో అంతర్వేది వద్ద రూ.800 కోట్ల పెట్టుబడులతో డ్రెడ్జింగ్ ఇన్‌స్టిట్యూట్, డ్రెడ్జింగ్ హార్బర్ ఏర్పాటు చేసేందుకు డిసిఐ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుందని, ప్రైవేటీకరణ జరిగితే అది అటకెక్కే ప్రమాదముందని తెలిపారు. దీనివల్ల కొత్తగా 10 వేల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడి డిసిఐను పరిరక్షించాలని కోరారు.



డిసిఐ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు, కార్మికులు

ప్రజ్ఞ జవాబులు

1. సంగీత బహదూర్ (1987 బ్యాచ్‌కు చెందిన ఐఎఫ్ఎస్ అధికారి)
2. 5 కోట్ల మంది, 3. 11 శాతానికి
4. షి యుకి (చైనా), టై జు యింగ్ (కొరియా), 5. కెవిన్ పీటర్సన్

రౌండ్‌టేబుల్

విభజన హామీలను అమలు చేయాలి : లక్ష్మణరావు



బైక్ ర్యాలీలో బుద్దా వెంకన్న, దేవినేని అవినాష్, బుచ్చిబాబు

ప్రజాశక్తి -గుడివాడ/మొగల్రాజపురం /భవానీపురం

విభజన చట్టంలో పొందుపరిచిన అంశాలను వెంటనే అమలు చేయాలని, రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా ఎంతో అవసరమని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలోని ఎన్‌జివోస్ హోమ్‌లో మంగళవారం కార్మిక, ఉద్యోగ, ఉపాధ్యాయ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక హోదా-విభజన హామీల అమలుపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మణరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ పున:వ్యవస్థీకరణ చట్టంలో పొందుపరిచిన అంశాలను బిజెపి ప్రభుత్వం కాలారాస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేకహోదాను మించిన ప్యాకేజీతో నిధులు కేటాయించామని స్థానిక బిజెపి నాయకులు పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. పోలవరం నిర్మాణానికి నిధులు ఇస్తామంటూనే పునరావాసానికి నిధులు ఇవ్వడానికి విముఖత వ్యక్తం చేయటం దారుణమన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వొద్దని 14వ ఆర్థిక సంఘం, నీతి ఆయోగ్‌లు పేర్కొన్నాయని అరుణ్ జైట్లీ పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. విభజన చట్టంలో 7 అంశాలను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

హోదా కోసం బైక్ ర్యాలీ

ప్రత్యేక హోదా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర తెలుగు యువత నాయకులు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయవాడ గుణదలలోని అవినాష్ స్వగృహం నుండి ఈ ర్యాలీ ఏలూరు రోడ్డు మీదుగా కంట్రోల్ రూమ్, మహాత్మాగాంధీ రోడ్డు మీదుగా పటమట ఎన్టీఆర్ సర్కిల్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న మాట్లాడుతూ ఆర్థిక వనరులు లేని రాష్ట్రాన్ని ఆదుకోవాల్సిన దేశ ప్రధాని మోడీ మొండి చెయ్యి చూపించి ఐదు కోట్ల ఆంధ్రులను మోసం చేశారని మండిపడ్డారు. దేవినేని అవినాష్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించే వరకు తమ ఉద్యమం ఆగదన్నారు.

టూరిజం కాంట్రాక్టు కార్మికుల నిరసన

ఎపి కాంట్రాక్ట్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం భవానీపురం పున్నమి వద్ద కార్మికులు నిరసన తెలిపారు.

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా ఇవ్వకుండా తెలుగు ప్రజలను, కార్మికులను మోసగించిందని ఎపి టూరిజం ఔట్ సోర్సింగ్ (సిఐటియు) రాష్ట్ర కార్యదర్శి ఎం.బాబూరావు విమర్శించారు.

హోదాపై వ్యాపార రంగాలతో ఉద్యమాలు

ప్రజాశక్తి-గుంటూరు అర్బన్

రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేక హోదా అవసరమని, వ్యాపార వాణిజ్య రంగాల వారందరితో ప్రత్యేకహోదా సాధన కోసం త్వరలో ఉద్యమాలు చేయనున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడుతూ అన్ని ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులతో, సభ్యులతో చర్చించి త్వరలో తొలుత జిల్లా వ్యాప్తంగా, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేయనున్నట్టు ఆయన పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా వ్యాపార వాణిజ్య సంస్థలు ఉద్యమాలు చేస్తాయని, ప్రత్యేక హోదా సాధనే ధ్యేయంగా దశలవారీగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామన్నారు.

జిఒ 279 రద్దు చేయాల్సిందే

ప్రజాశక్తి-బొబ్బిలి, విజయనగరం

మున్సిపల్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు జిఒ 151 ప్రకారం జీతాలు చెల్లించాలని, జిఒ 279ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన మంగళవారం విజయనగరం జిల్లాలోని విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం మున్సిపల్ కార్యాలయాలను కార్మికులు ముట్టడించారు. బొబ్బిలిలో మున్సిపల్ కార్యాలయానికి తాళాలు వేసి బైఠాయించారు. ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ సిఐ మోహనరావు, మున్సిపల్ డిఇ మహేష్ కార్మికులతో చర్చించారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ వచ్చి సమస్యను పరిష్కరించాలని కార్మికులు పట్టుబట్టారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పి.శంకరరావు, రెడ్డి వేణు మాట్లాడుతూ.. గతేడాది ఆగస్టులో పారిశుధ్య కార్మికులకు రూ.11 వేల నుంచి రూ.12 వేల వరకూ వేతనం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ ఇచ్చినప్పటికీ మున్సిపాలిటీలో అమలు చేయడం లేదన్నారు. ఆందోళన విరమించకపోవడంతో 29 మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విడిచిపెట్టారు. విజయనగరం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. దీంతో ఉద్యోగులంతా చాలాసేపు బయటే ఉండిపోయారు. కార్మికులనుద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడారు.

రజనీ పార్టీపై 'సందిగ్ధత'

చెన్నై : నూతన పార్టీ ఏర్పాటుపై తమిళ సూపర్‌స్టార్ రజనీ కాంత్ ఉత్కంఠతను కొనసాగి స్తున్నారు. తమిళ నూతన సంవత్సరం ఏప్రిల్ 14న పార్టీ పేరు, జెండా ఆవిష్కరణ చేస్తున్నట్లు వస్తున్న వార్తలను ఆయన తోసిపుచ్చారు. హిమాలయాల యాత్రను ముగించుకొని చెన్నైకు చేరుకున్న ఆయన అనంతరం మంగళవారం పోయస్ గార్డెన్‌లోని తన నివాసం వెలుపల మీడియాతో మాట్లాడారు. తన పార్టీకి జిల్లాల వారీగా కార్యకర్తలను నియమించే ప్రక్రియ జరుగుతోందని పేర్కొన్నారు. తనకు బిజెపితో దగ్గరి సంబంధాలు ఉన్నాయని అనుకుంటున్నారని, కానీ తన వెనుక ఉంది బిజెపి కాదని, దేవుడు, ప్రజలు ఉన్నారని తెలిపారు. విశ్వ హిందూ పరిషత్ నేతత్వంలోని రామ రాజ్య రథ యాత్రపై వ్యాఖ్యానిస్తూ, రాష్ట్రంలో మత సామరస్యానికి ఎటువంటి ముప్పు వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నమ్మకం ఉందని అన్నారు.

అవార్డు

న్యూఢిల్లీలో మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నుంచి పద్మవిభూషణ్ అవార్డు స్వీకరిస్తున్న ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా.



5 వేల స్వచ్ఛంద సంస్థలపై వేటు

ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్‌లను రద్దు చేసిన కేంద్రం

న్యూఢిల్లీ : విదేశాల నుండి విరాళాలను అందుకునేందుకు వీలు కల్పించే ఎఫ్‌సిఆర్‌ఎ లైసెన్స్‌లను గత ఏడాది ఏప్రిల్‌లో రద్దు చేసిన తరువాత దాదాపు 5000కు పైగా స్వచ్ఛంద సంస్థలపై ఈ మేరకు నిషేధం వర్తింప చేసినట్లు ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం లోక్‌సభలో ఒక సభ్యునికిచ్చిన లిఖితపూర్వక సమావేశంలో ఈ విషయం వెల్లడించారు. విదేశీ విరాళాల నియంత్రణా చట్టం (ఎఫ్‌సిఆర్‌ఎ) నిబంధనలను ఉల్లంఘించిన దాదాపు 5వేల సంస్థల రిజిస్ట్రేషన్లను రద్దు చేసినట్లు ఆయన వెల్లడించారు. స్వచ్ఛంద సంస్థలు 2010-11 నుండి పెండింగ్‌లో వున్న తమ వార్షిక ఆదాయ వ్యయ పత్రాలను సమర్పించేందుకు గత ఏడాది మే 14 నుండి జూన్ 15 వరకూ ఎటువంటి పెనాల్టీలు లేకుండా ఒకసారి అవకాశం (వన్‌టైమ్ ఆపర్‌చూనిటీ) ఇచ్చామని ఆయన తన జవాబులో పేర్కొన్నారు. గత ఐదు ఆర్థిక సంవత్సరాలలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫెమా చట్ట ఉల్లంఘన కింద దాదాపు 2,745 సంస్థలపై కేసులు నమోదు చేసిందని, ఇందులో 537 కేసులను మూసివేయగా మరో 183 కేసుల్లో షోకాజ్ నోటీసులు జారీ చేశామని వివరించారు. దీనితో పాటు మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద 289 సంస్థలపై కేసులు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

ఆతిథ్య విందును రద్దు చేసిన వెంకయ్య నాయుడు



న్యూఢిల్లీ : రాజ్యసభలో సమావేశాలు సజావుగా సాగనందు వల్ల బుధవారం జరిగే ఆతిథ్య విందును చైర్మన్ వెంకయ్య నాయుడు మంగళవారం రద్దు చేశారు. ఈ విందు కోసం గత వారమే సన్నాహాలు పూర్తయ్యాయి. ఈ విందు సమాచారాన్ని ప్రధాని మోడితో సహా పలు పార్టీ నాయకులు, ఫ్లోర్ లీడర్లకు తెలపడంతోపాటు ఆహ్వాన పత్రికలు కూడా సిద్ధమయ్యాయి. మంగళవారం నాడు రాజ్యసభ సాధారణ స్థితికి వస్తుందని భావించినప్పటికీ అలా జరగలేదు. దీనితో ఆవేదన చెందిన ఆయన విందు రద్దు చేయాలనే విషయాన్ని పలు పార్టీల ఫ్లోర్ లీడర్లకు తెలియజేశారు. రెండు వారాల పాటు సభ సరిగ్గా జరగకపోవడం వల్ల విందు చేసుకోవడం సరైనది కాదని వెంకయ్య నాయుడు భావించారు. విందు ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ నుండి ప్రత్యేకంగా వంట చేసే వారిని పిలిచారు. ఇప్పుడు వీరిని కూడా రావద్దని సమాచారం అందించారు. గతవారం కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో పార్లమెంట్ సభ్యుల కోసం జరిగే బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించేందుకు కూడా ఆయన నిరాకరించాం

ఎస్‌సి, ఎస్‌టి చట్టం ప్రయోగంపై 'సుప్రీం' ఆంక్షలు

న్యూఢిల్లీ : షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలపై అత్యాచార నిరోధక చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా నిరోధించేందుకు మంగళవారం సుప్రీం కోర్టు కఠినమైన షరతులను విధించింది. ఈ చట్టం కింద నమోదైన కేసుల్లో ప్రభుత్వాధికారులపై ఎటువంటి అత్యవసర అరెస్టులు చేయకుండా ఆంక్షలు విధించింది. ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద వీరిని అరెస్టు చేసే ముందు డిప్యూటీ సూపరిండెంటెండ్ ఆఫ్ పోలీస్(డిఎస్‌పి) స్థాయి అధికారి సంబంధిత ఆరోపణలపై ప్రాథమిక విచారణ చేయాలని ఆదర్శ్ గోయల్, యు.యు లలిత్‌తో కూడిన ధర్మాసనం పేర్కొంది.నిందితులకు ముందస్తు బెయిల్ ఇవ్వకుండా నిరోధించలేమని కోర్టు పేర్కొంది.

ఒడిస్సాలో కూలిన భారత శిక్షణా విమానం

భువనేశ్వర్ : భారత వైమానిక దళానికి(ఐఎఎఫ్) చెందిన హాక్ అడ్వాన్స్ ట్రైనర్ జెట్ ఒడిస్సాలోని మయూర్ భంజ్ జిల్లాలో జార్ఖండ్ సరిహద్దుకు సమీపాన మంగళవారం కూలిపోయింది. ఈ ఘటనలో శిక్షణలో ఉన్న పైలట్‌కు స్వల్పగాయాలయ్యాయి. పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో ఉన్న కలైకుంద వైమానిక దళ స్టేషన్ నుండి ఒక సాధారణ శిక్షణలో భాగంగా విమానం బయలు దేరింది. మయూర్ భంజ్ ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో అదుపుతప్పిందని సమాచారం. ఈ ప్రమాదంపై విచారణకు అధికారులను ఆదేశించారు. గత నెలలో అస్సోంలో భారత వైమానిక దళానికి చెందిన మైక్రోలైట్ వైరస్ ఎస్‌వి-80 హెలికాప్టర్ కూలిన ఘటనలో ఇద్దరు పైలెట్లు మృతి చెందిన సంగతి తెలిసిందే.

పెరియార్ మరో విగ్రహం ధ్వంసం

చెన్నై : త్రిపురలో లెనిన్ విగ్రహంతో మొదలైన విధ్వంస దుశ్చర్యలు దేశంలో ఇంకా తగ్గటం లేదు. తాజాగా ప్రముఖ ద్రవిడ నాయకుడు ఇ.వి రామస్వామి (పెరియార్) విగ్రహాన్ని తమిళనాడులో గుర్తు తెలియని కొందరు దుండగుల ధ్వంసం చేశారు. విగ్రహం నుంచి తలను వేరు చేశారు. ఈ ఘటన పుదుకొట్టాయ్ జిల్లాలోని అలంగుడిలో మంగళవారం చోటుచేసుకున్నది. విగ్రహ ధ్వంసానికి పాల్పడిన దుండగులపై కేసు నమోదు చేసిన పోలీసులు. విచారణను కొనసాగి స్తున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు మోహరించారు. వీహెచ్‌పీ చేపట్టిన రామరాజ్య రథయాత్ర రాష్ట్రంలోకి చేరిన రోజే పెరియార్ విగ్రహం ధ్వంసం కావడం గమనార్హం. పెరియార్ విగ్రహాన్ని లక్ష్యంగా చేసుకొని దుండగుల దాడికి పాల్పడటం ఇది నాలుగోసారి. బీజేపీకి చెందిన సీనియర్ నేత హెచ్ రాజా సామాజిక మాధ్యమంలో చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్యల అనంతరం ఈ నెల 6న వెల్లూరులోని మున్సిపల్ కార్యాలయంలో పెరియార్ విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేశారు.

భద్రతా బలగాల కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మృతి

న్యూఢిల్లీ : జమ్మూ కాశ్మీర్‌లోని కుప్వారా జిల్లా అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులు మరణించారని రక్షణ శాఖ ప్రతినిధి తెలిపారు. ఆ ప్రాంతంలో కాల్పులు ఇంకా కొనసాగుతున్నాయి. అడవిలో దాగున్న ఉగ్రవాదులు మధ్యాహ్నం 3.30గంటల ప్రాంతం లో రాష్ట్రీయ రైఫిల్స్, రాష్ట్ర పోలీసు స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్‌కి చెందిన భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు. దాంతో ఇరు పక్షాల మధ్య పోరాటం ప్రారంభమైందని ఆ ప్రతినిధి చెప్పారు. వెంటనే అదనపు బలగాలను అక్కడకు పంపించారు.

లైంగిక వేధింపుల ఆరోపణలపై జెఎన్‌యు ప్రొఫెసర్ అరెస్టు, బెయిల్

న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల ఆరోపణలపై ఢిల్లీ పోలీసులు అరెస్టు చేసిన జెఎన్‌యు ప్రొఫెసర్ అతుల్ జోహ్రికి పాటియాలా హౌస్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. విద్యార్థులు ప్రొఫెసర్‌పై ఆరోపణలు చేయడంతో ఢిల్లీ పోలీసులు మంగళవారం ఆయన్ని అరెస్టు చేసి డ్యూటీ మేజిస్ట్రేట్ రీతూ సింగ్ ముందు హాజరు పరిచారు. తనను జైలుకు పంపిస్తే తన కెరీర్ మొత్తంగా నాశనమవుతుందని, తనకు బెయిల్ ఇప్పించాలని ప్రొఫెసర్ మేజిస్ట్రేట్‌ను వేడుకోవడంతో బెయిల్ మంజూరు చేశారు. ఆయనపై నమోదైన ఎనిమిది ఎఫ్‌ఐఆర్‌లకు ఒక్కోదానికి రు.30వేలు చొప్పున బెయిల్ బాండ్లు అందచేశారు. కాగా జోహ్రిని తమకు 14 రోజుల పాటు అప్పగించాలని పోలీసులు కోరారు. అంతకుముందు జోహ్రిని ప్రశ్నించగా ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను, విద్యార్థుల ఫిర్యాదులను వీడియో రికార్డు చేసినట్లు సీనియర్ పోలీసు అధికారి తెలిపారు.

రామరాజ్య రథయాత్ర అడ్డుకోలేం పళనీస్వామి

నిరసన వ్యక్తం చేసిన ప్రతిపక్షాలు

చెన్నై : తమిళనాడుకు చేరుకున్న రామ రాజ్య రథయాత్రను నిషేధించాలని డిఎంకె, కాంగ్రెస్ పార్టీలు చేసిన డిమాండ్‌ను ముఖ్యమంత్రి ఎడ్డప్పాడి పళనీ స్వామి మంగళవారం తిరస్కరించారు. అన్ని మతాలకు సమాన హక్కులు ఉన్నాయని, ప్రజాస్వామ్య హక్కులను కాపాడటం ప్రభుత్వ భాద్యత అని తెలిపారు. ఒక ప్రత్యేక మతాన్ని ఎంపిక చేసుకొని దాని కార్యకలాపాలను ప్రభుత్వం నిషేధించదని పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత ఎం.కె.స్టాలిన్ ఈ యాత్రను నిషేధించాలని డిమాండ్ చేస్తూ ఇచ్చిన పిలుపుపై పళనీ స్వామి ఈ విధంగా స్పందించారు. దీనిని స్టాలిన్ రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలనుకొంటున్నారని ఆయన ఆరోపించారు. ఈ రథయాత్రను వ్యతిరేకిస్తూ 20నిమిషాల పాటు డిఎంకె నేతలు అసెంబ్లీలో నినాదాలు చేశారు. రామ్‌దాస్ మిషన్ నిర్వహిస్తున్న ఈ యాత్ర ఐదు రాష్ట్రాల్లో జరగనున్నది.

ఇరాక్‌లో బందీలైన భారతీయుల మృతి

పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి సుష్మా వెల్లడి

39 మృత దేహాలు తెచ్చేందుకు పది రోజులు : కేంద్ర మంత్రి వి.కె సింగ్

ఇప్పటి వరకు ఎందుకు ఆలస్యం చేశారు? : శశిథరూర్, కాంగ్రెస్




ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఇరాక్‌లో భారతీయుల కిడ్నాప్ ఘటన విషాదాంతమైంది. నాలుగేళ్ల క్రితం ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు బందీలుగా పట్టుకున్న 39 మంది భారతీయులు మృతి చెందినట్లు కేంద్ర విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ మంగళవారం పార్లమెంట్‌లో వెల్లడించారు. ఈ విషయాన్ని తొలుత రాజ్యసభలో వెల్లడించిన ఆమె, తరువాత లోక్‌సభలో కూడా వెల్లడించారు. "సుదీర్ఘ విచారణ తర్వాత ఆ 39 మంది భారతీయులు మతి చెందినట్లు వెల్లడైంది. డిఎన్‌ఎ పరీక్షల నిమిత్తం వారి భౌతిక కాయాలను బాగ్దాద్‌కు పంపించారు. వీరిలో 38 మంది డిఎన్‌ఎ వారి బంధువుల డిఎన్‌ఎతో సరిపోయింది. ఒకరిది మాత్రం 70శాతం కలిసినట్లు ఇరాక్ అధికారులు సోమవారం సమాచారం పంపారు. భౌతిక కాయాలను స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర మంత్రి వికె సింగ్ ఇరాక్ వెళ్తారు. మత దేహాలను తీసుకొచ్చే విమానం మొదట అమత్‌సర్, తర్వాత పాట్నా, కలకత్తా వెళ్తుంది" అని సుష్మాస్వరాజ్ రాజ్యసభలో తెలిపారు. ఉపాధి నిమిత్తం ఇరాక్‌లోని మోసుల్ నగరం వెళ్లి కూలీలుగా పనిచేస్తున్న ఓ భారతీయుల బందం 2014లో కిడ్నాప్‌కు గురైంది. మోసుల్ నుంచి తిరిగి వస్తుండగా ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు అడ్డగించి వీరిని బందీలుగా చేసుకున్నారు. అప్పటి నుంచి వీరి ఆచూకీ తెలియలేదు. వీరిని విడిపించేందుకు భారత ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని మంత్రి గతంలో పేర్కొన్నారు. కానీ ఏం ఫలితం లభించలేదు. కాగా వీరిలో ఒకరైన హర్జిత్ మాసీ అనే వ్యక్తి ఆ మధ్య ఇస్లామిక్ చెర నుంచి తప్పించుకుని ప్రాణాలతో బయటపడ్డాడు. ఆ సమయంలో ఆయన కొన్ని కీలక విషయాలు చెప్పారు. తనతో పాటు బందీలుగా ఉన్న మిగతా వారిని బాదుష్ సమీపంలోని ఎడారిలో చంపేసినట్లు తెలిపారు. అయితే హర్జిత్ వ్యాఖ్యలను ప్రభుత్వం తోసిపుచ్చింది. సరైన ధ్రువీకరణ లేకుండా వారంతా చనిపోయారని భావించడం సరికాదని పేర్కొంది. ఇదిలా ఉండగా, గతేడాది జులైలో మోసుల్ నగరంలో అక్కడి అధికారులు ఒకేచోట వందల సంఖ్యలో సామూహిక సమాధులు గుర్తించారు. దీంతో ఆ దిశగా విచారణ చేపట్టారు. ఈ క్రమంలో 39 మంది భారతీయులు చనిపోయినట్లు తేలింది. విచారణ నిమిత్తం మతదేహాలను సమాధుల నుంచి వెలికితీసి డిఎన్‌ఎ పరీక్షలు చేసినట్లు సుష్మా స్వరాజ్ వెల్లడించారు. డిఎన్‌ఎ పరీక్షతో వారు భారతీయులని నిర్ధారణకు వచ్చిన తర్వాతే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నట్లు తెలిపారు. ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులే వీరిని చంపేసినట్లు చెప్పారు. మతులు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్‌కు చెందిన వారని తెలిపారు. ఈ నేపథ్యంలో మతులకు సంతాపం తెలియజేస్తూ రాజ్యసభలో రెండు నిమిషాల పాటు మౌనం వహించారు. పార్లమెంట్‌లో మీడియాతో కేంద్ర మంత్రి వికె సింగ్ మాట్లాడుతూ మత దేహాలను మరో ఎనిమిది నుంచి పది రోజుల్లో భారత్ తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

ఇప్పటి వరకూ ఎందుకు ఆలస్యం చేశారు?

ఇరాక్‌లో బందీలుగా ఉన్న 39 మంది భారతీయులు చనిపోయిన విషయం చెప్పేందుకు ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేసిందని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ ప్రశ్నించారు. ఈ విషయంపై పార్లమెంట్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. "ప్రతీ ఒక్క భారతీయుడికి ఇది ఎంతో విచారకరమైన విషయం. ఈ విషయాన్ని ఇప్పటి వరకూ చెప్పకుండా ఎందుకు ఆలస్యం చేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నా. అసలు ఇది ఎలా జరిగిందో ప్రభుత్వం చెప్పాలి. వాళ్లు ఎప్పుడు చనిపోయారో వెల్లడించాలి. అలాగే వాళ్లు బతికే ఉన్నారని, వాళ్ల కోసం విస్తతంగా గాలింపు చర్యలు చేపట్టామని ప్రభుత్వం ఇన్ని రోజులు ఎందుకు చెప్పింది. ఆ 39 మంది భారతీయుల కుటుంబాలకు ఇప్పటి వరకూ ఎందుకు ఆశలు కల్పిస్తూ వచ్చారు" అని ఆయన ప్రశ్నించారు. 39 మంది భారతీయుల కుటుంబాలకు నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. శశిథరూర్ చేసిన వ్యాఖ్యలపై అకాలీదళ్ నేత హర్‌సిమ్రత్ కౌర్ బాదల్ అభ్యంతరం వ్యక్తం చేశారు. "ప్రతిపక్షంలోని కొందరు ఈ విషయాన్ని రాజకీయం చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇది బాధాకరం" అని ఆమె పేర్కొన్నారు.

పివిపై కాంగ్రెస్ ప్లీనరీ ప్రశంసలు



న్యూఢిల్లీ : సుదీర్ఘకాలంగా కాంగ్రెస్ నేతల స్మృతి పథం నుంచి కూడా చెరిగిపోయిన మాజీ ప్రధాన మంత్రి పి.వి. నరసింహారావును ఇటీవల జరిగిన ప్లీనరీ సమావేశాలు ఒక్కసారిగా తెరపైకి తెచ్చాయి. ఆర్థిక సంస్కరణల రూప కర్తగా పేరుగాంచిన పివి నరసింహారావు మృతి చెందిన తరువాత దాదాపు పధ్నాలుగేళ్ళపాటు రాజకీయ 'బహిష్క రణ'కు గురిచేసిన కాంగ్రెస్ పార్టీ ప్లీనరీ సమావేశాల సంద ర్భంగా అకస్మాత్తుగా గుర్తు తెచ్చుకుంది. అంతకు ముందె న్నడూ కూడా కాంగ్రెస్ పోస్టర్లపై కాని, ప్లీనరీ సమావేశాల సందర్భంగా గాని, సంవత్సరాల తరబడి చేసిన తీర్మానాల సమయంలో గాని ఒక్కసారి కూడా కనిపించని పి.వి. 'ఊసు' అకస్మాత్తుగా ఇందిరా గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ ప్లీనరీ సమావేశంలో స్మరణకు రావడం విస్మయాన్ని కలి గించక మానదు. ప్లీనరీ సమావేశాలలో భాగంగా శనివారం ప్రవేశపెట్టిన రాజకీయ తీర్మానం సందర్భంగా పి.వి. నర సింహారావు ప్రస్తావన వచ్చింది. 1991 లో ప్రారంభమైన ఆర్థిక సంస్కరణలు ఆయన ప్రతిభకు నిదర్శనంగా ప్లీనరీ పేర్కొంది. 1991 నాటి ఆర్థిక సంస్కరణలు నిజంగా చారిత్రాత్మక మైనవి. భారత ఆర్థిక వ్యవస్థ రూపురేఖలను మార్చి వేశాయి." అంటూ రాజకీయ తీర్మానం పేర్కొంది. అదేవిధంగా విదేశీ విధానానికి సంబంధించి ప్రవేశపెట్టి తీర్మానం కూడా పి.వి. సేవలను కొనియాడింది. సోనియా గాంధీ మాత్రం 2010లో ఒక ప్రసంగం సందర్భంగా పి.వి. గురించి ప్రస్తావించారు. ఆ తరువాత కాలక్రమంలో సంవత్సరాల తరబడి కనీసం ఆయన పుట్టిన రోజు నాడైనా పార్లమెంట్‌లో నివాళులు అర్పించే కార్యక్రమానికి తిలోదకాలు పలికింది.

రైల్వే ఉద్యోగాలను కల్పించాలని అప్రెంటీస్‌ల ఆందోళన



ముంబయి : రైల్వే ఉద్యోగాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ ముంబయి సెంట్రల్ రైల్వేలోని సబర్బన్ విభాగంలోని రైల్వే ట్రాక్‌లపై అప్రెంటీస్‌లు నిరసన వ్యక్తం చేశారు. అప్రెంటీస్ అభ్యర్థులు ఉదయం 7 గంటలకు మతుంగ, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ మధ్య నిరసనలు తెలిపారు. దీనితో రైళ్ల రాకపోకలు ఐదు గంటల పాటు నిలిచిపోయాయి. ఇతర రైళ్ళ సమయాల్లో మార్పులు చేశారు. రైల్వేలు నిర్వహించిన అప్రెంటీస్ పరీక్షలను రాసిన అభ్యర్థులు తమకు పర్మినెంట్ ఉద్యోగాలను ఇవ్వాలని రైల్వే ట్రాక్‌పై ఆందోళన చేశారు. ఆల్ ఇండియా యాక్ట్ అప్రెంటీస్ అసోసియేషన్(ఎఎఎఎ)తో కలిసి వారు నిరసన తెలిపారు. చివరకు ప్రత్యేక పరీక్షను నిర్వహిస్తామన్న హామీ మేరకు వారు ఆందోళనలు విరమించుకున్నారని అధికారులు తెలిపారు.

గుర్‌గావ్‌లో సెక్స్ రాకెట్ 9 మంది అరెస్టు

గుర్‌గావ్ : గుర్‌గావ్‌లోని ఒక మాల్‌లో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నారన్న ఆరోపణలపై సోమవారం 9 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గుర్‌గావ్‌లోని ఒమెక్స్ మాల్ వద్ద స్పా కేంద్రం ముసుగులో సెక్స్ రాకెట్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు వారిని అరెస్టు చేసినట్లు గుర్‌గావ్ పోలీసు పిఆర్‌ఓ రవీందర్ కుమార్ తెలిపారు. సెక్స్‌రాకెట్ నిర్వహిస్తున్న వారిని పట్టుకునేందుకు ఒకబృందాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బృందంలో ఒకరు వినియోగదారుడిగా నటిస్తూ ఆ కేంద్రానికి వెళ్ళాడని, ఆ తరువాత దానిపై దాడి చేసి ఆరుగురు మహిళలతో సహా 9 మందిని అరెస్టు చేశామని ఆయన చెప్పారు. స్పా సెంటర్ యజమానిని అరెస్టు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

నకిలీ హెల్మెట్ తయారీదారులపై చర్యలు తీసుకోండి : సచిన్

న్యూఢిల్లీ : నాణ్యత అంతగా లేని హెల్మెట్లను ఉత్పత్తి చేస్తున్న కంపెనీలపై తగిన చర్యలు తీసుకోవాలని రాజ్యసభ ఎంపి సచిన్ టెండూల్కర్ కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరికి విజ్ఞప్తి చేశారు. ద్విచక్ర వాహనాలను సురక్షితంగా నడపడంపై సచిన్ ప్రచారాన్ని కొనసాగిస్తు న్నారు. ద్విచక్ర వాహనదారులే అత్యధిక ప్రమాదాలకు గురవుతున్నారని, అత్యధిక నాణ్యతా ప్రమాణాలున్న భద్రతా పరికరాలను అందించడానికి ప్రాధాన్యత కల్పించాలని కోరుతూ నితిన్ గడ్కరీకి ఆయన లేఖ రాశారు. తక్కువ ప్రమాణాలతో నకిలీ ఐఎస్‌ఐ మార్కుతో ఉత్పత్తి చేసి అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. అత్యున్నత నాణ్యతతో కూడిన భద్రతా పరికరాల ప్రాధాన్యత ఏమిటో క్రీడాకారులుగా మాకు తెలుసునని టెండూల్కర్ తన లేఖలో పేర్కొన్నారు. హెల్మెట్‌ల తయారీ విషయంలో కూడా అదే నాణ్యతను పాటించాలన్నారు.

గోవా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి శాంతారామ్ రాజీనామా

ఆయన స్థానంలో లూయిజిన్హో ఫలైరో

పనాజి : గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు శాంతారామ్ నాయక్ మంగళవారం రాజీనామా చేశారు. యువతను నాయకులుగా తీర్చిదిద్దాలంటూ ప్లీనరీ సమావేశాలలో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం స్ఫూర్తితో తాను రాజీనామా చేసినట్లు చెప్పారు. పార్టీని ముందుండి నడిపించే అవకాశాన్ని యువతకు ఇవ్వాలనుకుంటున్నట్లు ప్లీనరి సమావేశాల ముగింపు సందర్భంగా రాహుల్ గాంధీ ప్రకటించారు. రాహుల్ ప్రకటనకు స్పందిస్తూ రాజీనామా చేసిన తొలి సీనియర్ కాంగ్రెస్ నేత నాయక్ (71). నాయక్ తన రాజీనామాను ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీకి మంగళవారం ఉదయం పంపారు. గోవా ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రెసిడెంట్‌గా జులై 8, 2017 నుంచి ఆయన కొనసాగుతున్నారు. నాయక్ తరువాత ఆ స్థానంలో పార్టీ సీనియర్ నేత లూయిజిన్హో ఫలైరో కొనసాగనున్నారు.

2జీ తీర్పుపై ఢిల్లీ హైకోర్టుకెక్కిన సిబిఐ

న్యూఢిల్లీ : 2జి స్పెక్ట్రమ్ కుంభకోణం కేసులో డిఎంకె రాజ్యసభ ఎంపి కణిమొళి, మాజీ మంత్రి ఎ రాజాలను విముక్తులను చేస్తూ ప్రత్యేక న్యాయస్థానం వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) ఢిల్లీ హైకోర్టులో మంగళవారం నాడు పిటిషన్ దాఖలు చేసింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి గీతా మిట్టల్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు అదనపు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిపై బుధవారం నాడు విచారణ చేపట్టనున్నట్లు న్యాయమూర్తి సి హరిశంకర్ సభ్యులుగా వున్న ధర్మాసనం ప్రకటించింది. పిఎంఎల్‌ఎ కేసులో వీరిని నిర్దోషులుగా ప్రకటించిన ప్రత్యేక న్యాయస్థానం తీర్పుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) సోమవారం నాడు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కణిమొళి, రాజాలతో పాటు మరో 17 మందిని ఈ కేసులో నిర్దోషులుగా ప్రకటిస్తూ సిబిఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు వెలువరించిన విషయం తెలిసిందే.

ఆ బాలిక బతకడం కష్టం

రాజ్‌కోట్ : గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో సామూహిక అత్యాచారానికి గురైన 11 ఏళ్ల బాలికకు జన్మించిన చిన్నారి బతకడం కష్టమని అసర్వా ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అత్యాచారానికి గురైన బాలిక ఈ నెల 17న రాజ్‌కోట్‌లోని ఆసుపత్రిలో ఒక చిన్నారికి జన్మనిచ్చిన సంగతి తెలిసిందే. ఈ చిన్నారికి వెన్నుపూస అభివృద్ధి చెందకపోవడం, రక్తహీనత.. వంటి లోపాలు తలెత్తడంతో అహ్మదాబాద్‌లోని అసర్వా ఆసుపత్రికి తరలించారు. 'నాలుగు రోజుల బాలికకు అన్ని రకాల టెస్టులు నిర్వహించాం. బాలికకు వెన్నుపూసలోనే కాదు, మెదడులో కూడా సమస్యలు ఉన్నాయి. శస్త్రచికిత్స చేస్తే బాలిక పరిస్థితి మరింత దిగజారుతుంది' అని చిన్నారుల, న్యూరాలజీ విభాగం వైద్యులు తెలిపారు. తొమ్మిది, ఎనిమిది నెలల క్రితం రాజ్‌కోట్ బాలికపై వివిధ సందర్భాలలో ఆరుగురు అత్యాచారానికి పాల్పడ్డారు.

ప్రత్యేకం

సమాచార చౌర్యంలో భారత రాజకీయ పార్టీ ప్రమేయం?

కేంబ్రిడ్జ్ అనలిటికా కేసులో బహిర్గతం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ తరపున ప్రచారం నిర్వహించిన కేంబ్రిడ్జ్ ఇటాలికా (సిఎ) సంస్థ నలుగురు ఎగ్జిక్యూటివ్స్ పాత్రపై బ్రిటన్‌కు చెందిన ఛానల్4 ప్రసారం చేసిన వీడియో కథనం ప్రపంచ దేశాలలో ప్రకంపనలు సృష్టిస్తోంది. భారత్‌తో సహా 200 దేశాలకు చెందిన ఎన్నికల్లో తాము సమాచారాన్ని సేకరించి ఆయా పార్టీలకు అనుకూలంగా వినియోగించామంటూ సిఎ సంస్థ ఎగ్జిక్యూటివ్‌లు వెల్లడించటం విశేషం. ఆయా నేతల ప్రత్యర్థులకు సంబంధించిన ఈ సమాచార సేకరణ కోసం తాము కొంత మందిని మహిళలతో ప్రలోభాలకు గురిచేశామని, మరి కొందరికి ముడుపులు చెల్లించామని చెబుతూ అందుకు సంబంధించిన వీడియో రికార్డింగ్‌లను ఇంటర్నెట్‌లో ప్రసారం చేయటం ద్వారా వారిని లొంగదీసుకునేందుకు ప్రయత్నించామని వారు చెబుతున్నారు.

భారత రాజకీయాల్లో ప్రకంపనలు

ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో సిఎ సంస్థ సిబ్బంది వెల్లడించిన విషయాల్లో భారత్ ప్రస్తావన వుండటం రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. బిజెపిని గద్దె నెక్కించిన 2014 నాటి లోక్‌సభ ఎన్నికల్లో డేటా విశ్లేషకులు పోషించిన పాత్ర కీలకంగా మారిందన్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ స్టింగ్ వీడియోలో భారత్ ప్రస్తావన వచ్చినప్పటికీ అందులో ఏ పార్టీ ప్రమేయం వుందన్న వివరాలను వారు వెల్లడించలేదు.

స్టింగ్ ఆపరేషన్ పూర్వాపరాలు

ఛానల్ 4కు చెందిన ఒక పాత్రికేయుడు ఒక ధనిక రాజకీయ వేత్త కుటుంబం తరపున వ్యవహరిస్తున్న శ్రీలంక దళారీలా సిఎ కంపెనీ సిఇఓ అలెగ్జాండర్ నిక్స్, సిఎ పొలిటికల్ గ్లోబల్ సంస్థ ఎండి మార్క్ టర్న్‌బుల్, కంపెనీ చీఫ్ డేటా ఆఫీసర్ డా.అలెక్స్ టేలర్‌తో పలుమార్లు భేటీ అయ్యాడు. లండన్‌లోని వివిధ హోటళ్లలో జరిగిన ఈ భేటీలను రహస్య కెమెరాలతో సవివరంగా చిత్రీకరించారు.

ఇదీ సిఎ చరిత్ర..

2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థుల తరపున వ్యక్తిగత ప్రచార ప్రకటనలను రూపొందించేందుకు ఫేస్‌బుక్ సంస్థకు చెందిన దాదాపు 5 కోట్ల మంది వినియోగదారుల వ్యక్తిగత వివరాలను తస్కరించిందన్న ఆరోపణలున్నాయి. ట్రంప్ తరపున ప్రచారం కోసం వీరు 59 లక్షల డాలర్ల ఫీజు వసూలు చేవారు. ప్రైమరీస్‌లోనే వైదొలగిన సెనేటర్ టెడ్ క్రుజ్ నుండి 58 లక్షల డాలర్ల ఫీజును ఈ సంస్థ వసూలు చేసింది. ఈ సంస్థ అధికారులు కాన్ఫరెన్స్ రూముల్లో మందు, పొందుతో జల్సా చేస్తూ తాము ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లో పనిచేసిందీ చెబుతున్న దృశ్యాలను ఈ వీడియో స్పష్టంగా చూపుతోంది. డబ్బుకు లొంగని వారికి యువతుల ఎర కూడా చూపామని అతడు చెప్పాడు. 'ఉక్రేనియన్ యువ తులు చాలా అందంగా వుంటారు. ఈ ఎర తమకు బాగా పనికి వచ్చింద'ని అతడు వివరించాడు. ఈ ముడుపులు, అమ్మాయిల వ్యవహారాలను రహస్యంగా చిత్రీకరించి వాటిని ఇంటర్నెట్‌లో పెడతామని ఆయా అభ్యర్థులను లొంగదీసుకునేందుకు ప్రయత్నించే వారమని అతడు వివరించాడు. సోమవారం ఛానల్ 4 ఈ వీడియోను ప్రసారం చేసిన తరువాత దానిని ఖండించే ప్రయత్నం చేసింది. ఈ వీడియో కల్పితమని, తమ సంభాషణలను తప్పుదోవ పట్టించే విధంగా వుందని, ఇటువంటి వీడియోల ద్వారా తమ పరువు తీస్తే తాము వ్యాపారం ఎలా నిర్వహించుకోవాలని వాపోయింది. .

సంక్షిప్తం

విదేశాల్లోని భారతీయుల భద్రతకు హామీ : మోడీ

న్యూఢిల్లీ : ఇరాక్‌లో హత్యకు గురైన 39మంది భారతీయుల కుటుంబాలకు సంఘీభావాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. ఈ విషాద సమయంలో యావత్ దేశ ప్రజలు వారి పక్షాన వున్నారని అన్నారు. విదేశాల్లో భారతీయుల భద్రతకు హామీ కల్పించడానికి ప్రభుత్వం కట్టుబడి వుందని చెప్పారు. మోసుల్ దుర్ఘటన పట్ల ప్రతి ఒక్క భారతీయుడు ఆవేదన చెందుతున్నాడని, వారి కుటుంబాలకు సంతాపం తెలియచేస్తున్నామని ప్రకటించారు.

ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాది రంజిత్ సింగ్ రాణా అరెస్టు

కపుర్తలా : ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాది రంజిత్ సింగ్ రాణను మంగళవారం కపుర్తలా పోలీసులు అరెస్టు చేశారు. రంజిత్ సింగ్ ఖలిస్తాన్ అనుకూల వర్గమైన భింద్రన్‌వాలే టైగర్స్ ఫోర్స్ సభ్యుడని వారు తెలిపారు. రంజిత్ సింగ్ గత 27 ఏళ్ళుగా పరారీలో ఉన్నారు. గత ఫిబ్రవరి 22న ఖలిస్తాన్ ఉగ్రవాది జస్పాల్ అత్వాల్ ముంబయిలో జరిగిన ఒక కార్యక్రమానికి హాజరవ్వడాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరసించింది.

రూ.1000 నోటు రద్దు శిశు హత్యతో సమానం : యశ్వంత్‌సిన్హా

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం రూ.1000 కరెన్సీ నోటును రద్దు చేయడం తన సంతానం హత్యచేయబడినంత బాధ కలిగించిందని మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా పేర్కొన్నారు. ప్రొఫెసర్ అరుణ్‌కుమార్ రచించిన "డిమానిటైజేషన్ అండ్ ద బ్లాక్ మనీ" అనే గ్రంథాన్ని మంగళవారం ఇక్కడ ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో యశ్వంత్ మాట్లాడుతూ భారతదేశంలో పెద్ద నోట్ల రద్దు ప్రభావంపై సమగ్రంగా వచ్చిన తొలి పుస్తకం ఇదేనన్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి నవంబరు 8, 2016న పెద్ద నోట్లను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయం నల్ల ధనాన్ని వెనక్కి తీసుకురావాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని ఏ మాత్రం నెరవేర్చలేక పోయిందని తీవ్రంగా విమర్శించారు. అవినీతి, ఉగ్రవాదాలను అంతం చేయలేక పోయిందన్నారు. మోడీ ప్రభుత్వం తీసుకున్న పెద్ద నోట్ల రద్దు నిర్ణయం విఫలమైందన్నారు.

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడిని ప్రశ్నిస్తున్న పోలీసులు

పారిస్ : ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికొలస్ సర్కోజీని పోలీసు కస్టడీలోకి తీసుకున్నట్లు న్యాయవర్గాలు తెలిపాయి. లిబియా మాజీ నియంత మహ్మద్ గడాఫీ ప్రభుత్వం నుండి సర్కోజీ లక్షలాది యూరోలను అక్రమంగా అందుకున్నారన్న ఆరోపణలపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగా ఆయనను అదుపులోకి తీసుకున్నారు. పారిస్‌కు పశ్చిమంగా గల నాన్‌టెరె పోలీసు స్టేషన్‌లో పోలీసులు ఆయన్ని ప్రశ్నించారని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ కేసుకు సంబంధించి 2013 నుండి దర్యాప్తు జరుగుతోంది. 2007 అధ్యక్ష ఎన్నికల్లో ప్రచారం నిమిత్తం ఈ నిధులను ఉపయోగించారు.



అందమైన నగరం

అత్యంత ఉల్లాసవంతమైన నగరాల్లో ప్రపంచవ్యాప్తంగా ఆస్ట్రియాకు చెందిన వియన్నా నగరం మొదటి స్థానంలో నిలిచింది. 18 లక్షల జనభా గల ఈ నగరం వరుసగా తొమ్మిదో సారి కూడా నెంబర్‌వన్ ర్యాంక్‌ను పొందింది.

ఆహ్లాద నగరం వియన్నా

అత్యంత వియన్నా : ప్రపంచంలోనే అత్యుత్తమ జీవన ప్రమాణాలు కలిగిన నగరంగా ఆస్ట్రియా రాజధాని వియన్నా మరోసారి తన స్థానాన్ని సుస్థిరపరుచుకుంది. ఇరాక్ రాజధాని బాగ్దాద్ అత్యంత అధ్వాన్నమైన నగరంగా నిలిచింది. 2003 నుండి కొనసాగుతున్న హింసాకాండతో నగరం అల్లకల్లోలంగా మారింది. యెమెన్ రాజధాని సానా, బాగ్దాద్ కన్నా రెండు స్థానాలు పైన వుండగా, సిరియా రాజధాని డమాస్కస్ ఆరు స్థానాలు పైన వుంది. 231 నగరాల్లో కన్సల్టింగ్ సంస్థ మెర్సెర్ నిర్వహించిన వార్షిక సర్వేలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. రాజకీయ సుస్థిరత, ఆరోగ్య సంరక్షణ, విద్య, నేరాలు, వినోదం, రవాణా వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని ఈ సర్వే నిర్వహించారు. ప్రపంచంలో అత్యంత ఆహ్లాదకరమైన నగరాలు యూరప్‌లో పది వున్నాయి. ఇందులో జర్మనీలో మూడు, స్విట్జర్లాండ్‌లో మూడు నగరాలు వున్నాయి. న్యూజిలాండ్, కెనడా, ఆస్ట్రేలియాలో ఒక్కో నగరం వుంది. 18లక్షల జనాభాతో వియన్నా నగరం ఈ సర్వేలో అత్యున్నత స్థాయిలో నిలిచింది. వరుసగా తొమ్మిదో సంవత్సరం కూడా ఈ నగరమే టాప్ వన్‌లో వుంది. అద్భుతమైన సాంస్కృతిక వారసత్వం, సమగ్ర ఆరోగ్య సంరక్షణ, ఒక మోస్తరు గృహ నిర్మాణ వ్యయం వంటి కారణాలతో ఇందుకు దోహదపడ్డాయి. వియన్నా తర్వాత స్విట్జర్లాండ్ నగరమైన జ్యూరిచ్ రెండో స్థానంలో వుండగా, న్యూజిలాండ్ నగరమైన ఆక్లాండ్, జర్మనీలోని మ్యూనిచ్ నగరం మూడో స్థానాన్ని ఆక్రమించాయి. వాంకోవర్ ఐదవ స్థానంలో వుండగా, సింగపూర్ (25), మాంటెవిడియో (77), డర్బన్ (89) స్థానాల్లో వున్నాయి. బ్రెగ్జిట్‌కు ఏడాది ముందుగా జరిగిన సర్వేలో లండన్ మహానగరం మంచి స్థానంలోనే వున్నప్పటికీ ప్రస్తుత సర్వేలో 41వ స్థానానికి పడిపోయింది.

ఆఫ్ఘన్ ఆహ్వానంపై యోచిస్తున్న పాక్

ఇస్లామాబాద్ : తమ దేశంలో పర్యటించేందుకు, చర్చలు జరిపేందుకు పాకిస్తానీ ప్రధానిని ఆఫ్ఘనిస్తాన్ ఆహ్వానించిన నేపథ్యంలో దానిపై పాక్ సందిగ్ధంలో వుంది. కాగా ఆఫ్ఘనిస్తాన్ ఈ మేరకు ఆహ్వానించడాన్ని మంచి సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు ఇరు వైపులా గల తీవ్రవాదులను ఓడించడాలంటే ఈ రెండు దేశాల మధ్య చర్చలు జరగడం తప్పనిసరని, పైగా కీలకమని వారు పేర్కొంటున్నారు. ఆఫ్ఘన్ అధ్యక్షుడు అష్రఫ్ ఘనీ ఆహ్వానాన్ని మన్నించడానికి ముందుగా దేశ రాజకీయ, సైనిక నాయకత్వంతో చర్చలు జరపాలని పాక్ భావిస్తోంది. గత వారం పాక్ జాతీయ భద్రతా సలహాదారు కాబూల్‌లో పర్యటించినపుడు ఈ ఆహ్వానం వెలువడింది. తాలిబన్‌తో బేషరతు చర్యలు జరపాలని ఆఫ్ఘన్ అధ్యక్షుడు ఘనీ గత నెల్లో ప్రతిపాదించారు. కాగా దీనిపై తాలిబన్ ఇంతవరకు స్పందించలేదు.

మెక్సికన్ హింస బాధితుల్లో అధికశాతం మంది యువతే..!

మెక్సికో : మెక్సికోలో నానాటికీ పెరిగిపోతున్న హింసాకాండలో బాధితులుగా మిగులుతున్న వారిలో అధికశాతం మంది యువతేనని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. గతదశాబ్ద కాలంలో 2.34 లక్షల హత్యలు, 33 వేల కిడ్నాపింగ్‌లు అధికారికంగా నమోదయ్యాయని మీడియా తన వార్తా కథనాలలో వివరించింది. బాధితుల్లో అధికశాతం మంది 12 నుండి 29 ఏళ్ల మధ్య వయస్కులేనని ఎల్‌సోల్ డి మెక్సికో అనే పత్రిక తన కథనంలో వివరించింది. 2013-16 మధ్య కాలంలో 31,375 మంది హత్యలకు గురయ్యారని, అందులో దాదాపు అందరూ యువకులేనని వెల్లడించింది.

వాణిజ్య యుద్ధం అనర్థదాయకం

అమెరికాకు చైనా హెచ్చరిక



బీజింగ్ : హేతుబద్ధంగా వ్యవహరించాల్సిందిగా అమెరికాకు చైనా ప్రధాని లీ కెకియాంగ్ విజ్ఞప్తి చేశారు. భావోద్వేగాలతో ఆలోచించకుండా, సహేతుకంగా ఆలోచించి, చర్యలు తీసుకోవాలని కోరారు. వాణిజ్య యుద్ధం తలెత్తాలని తాము భావించడం లేదన్నారు. ఉక్కు, అల్యూమినియం దిగుమతులు, సాంకేతికత, ఇతర వివాదాల కారణంగా వాణిజ్యానికి అంతరాయం కలిగించడం మానుకోవాలని సూచించారు. అమెరికా దిగుమతులు, పెట్టుబడులకు చైనాలో విస్తృత అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ వాణిజ్య యుద్ధంలో ఏ ఒక్కరూ విజేతలు కాలేరని ప్రధాని లీ కెకియాంగ్ ఇక్కడ ఒక పత్రికా సమావేశంలో వ్యాఖ్యానించారు. చైనాకు వ్యతిరేకంగా వచ్చిన వాణిజ్య ఫిర్యాదుల నేపథ్యంలో ట్రంప్ దిగుమతి అడ్డంకులను లేవనెత్తిన పక్షంలో చైనా ఎలా స్పందిస్తుందనే అంశాన్ని లీ ప్రస్తావించలేదు. అయితే, జిన్‌పింగ్ ప్రభుత్వం అవసరమైన రీతిలో స్పందించడానికి సిద్ధంగా వుందని ఇతర అధికారులు పేర్కొన్నారు. చైనా తయారీ వాషింగ్ మెషిన్లు, ఇతర ఉత్పత్తులపై ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే దిగుమతి సుంకాలను పెంచింది. సాంకేతికతను అందచేయాలంటూ విదేశీ కంపెనీలపై బీజింగ్ ఒత్తిడి చేస్తోందా లేదా అనే విషయమై దర్యాప్తు చేస్తోంది. ఈ పరిస్థితి వాణిజ్య పెనాల్టీలకు దారి తీయగలదని భావిస్తున్నారు. కాగా వీటిపై చైనా ప్రతీకార చర్యలు తీసుకోగలదని ఆందోళన వ్యక్తమవుతోంది. అమెరికా ప్రభుత్వ ఆర్థిక సంక్షోభాన్ని అవకాశంగా తీసుకుని అక్కడ పెట్టిన పెట్టుబడులను ఉపసంహరించే ఆలోచన చైనా చేసే అవకాశముందా అన్న ప్రశ్నకు, తమ పెట్టుబడులన్నీ మార్కెట్ సిద్ధాంతాలు, సూత్రాల ఆధారంగా పెట్టినవేనని. బాధ్యతాయుతమైన దీర్ఘకాల పెట్టుబడిదారుగా చైనా వుంటుందని కెకియాంగ్ స్పష్టం చేశారు.

సార్వభౌమాధికారం పరిరక్షించుకుంటాం
జిన్‌పింగ్ స్పష్టీకరణ

ఒక్క అంగుళం భూమిని కూడా వదులుకోవడానికి చైనా అంగీకరించబోదని, తమ సార్వభౌమాధికారాన్ని పరిరక్షించుకుంటామని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మంగళవారం స్పష్టం చేశారు. 18 రోజుల పాటు సాగిన పార్లమెంట్ సమావేశాలు ముగింపులో దాదాపు 30నిముషాల పాటు ఆయన ప్రసంగించారు. గతంలో వున్న సాంప్రదాయానికి భిన్నంగా జిన్‌పింగ్ ముగింపు సమావేశాల్లో ప్రసంగించారు. ఈ ప్రసంగం దేశవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారమైంది. దేశ సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతలను మనం పరిరక్షించుకోవాలి. పూర్తి స్థాయి మాతృభూమి పునరేకీకరణను సాధించాలి. చైనీయుల ఆకాంక్ష ఇదే. చైనా జాతి ప్రాథమిక సూత్రం కూడా ఇదే." అని ఆయన పేర్కొన్నారు. వేర్పాటువాదులకు ఈ సందర్భంగా ఆయన గట్టి హెచ్చరిక చేశారు. దేశం నుండి విడిపోవడానికి చేపట్టే ఏ చర్య అయినా విఫలమవక తప్పదని పునరుద్ఘాటించారు. ఈ వేర్పాటువాద చర్యలను ప్రజలు ఖండిస్తారని అన్నారు. వేర్పాటువాదుల కార్యకలాపాలపై ఘన విజయం సాధించే సామర్థ్యం, కృత నిశ్చయం, పూర్తి స్థాయి విశ్వాసం చైనా ప్రజలకు వుందని అన్నారు. చైనాను విభజించే చర్యలు, ఎత్తుగడలను ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తారని, శిక్ష కూడా ఎదుర్కొనాల్సి వుంటుందని జిన్‌పింగ్ హెచ్చరించారు. అన్నిస్థాయిల్లో అధికారాలు తన నియంత్రణలో వున్నందువల్ల తలెత్తే భయాందోళనలను తోసిపుచ్చుతూ, చివరివరకు ప్రజాసేవకుడిగా వుంటానని హామీ ఇచ్చారు. చైనా వేగంగా ఎదుగుతుండడంపై ప్రపంచ దేశాలు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను తోసిపుచ్చుతూ, చైనా అభివృద్ధి మరే ఇతర దేశానికి ముప్పుగా పరిణమించదని స్పష్టం చేశారు. గుత్తాధిపత్యాన్ని చైనా కోరుకోవడం లేదన్నారు. లేదా విస్తరణ కోసం ప్రయత్నించడం కూడా లేదన్నారు. ఇతరులను బెదిరించే అలవాటున్న వారు మాత్రమే ప్రతి ఒక్కరినీ ముప్పుగా పరిగణిస్తారని అమెరికాను పరోక్షంగా ప్రస్తావిస్తూ ఆయన వ్యాఖ్యానించారు. మానవాళి శాంతికి, అభివృద్ధికి దోహదపడాలన్న చైనీయుల నిజాయితీతో కూడిన ఆకాంక్షను, ఆచరణాత్మక చర్యలకు తప్పుగా భాష్యం చెప్పరాదని, వక్రీకరించరాదని కోరారు. పరస్పర ప్రయోజనకరమైన వ్యూహాన్ని అనుసరిస్తామని చెప్పారు. తన డిప్యూటీలు, అన్ని జాతులకు చెందిన ప్రజలు తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని హామీ ఇచ్చారు. అధికారులందరూ కూడా ప్రజల పర్యవేక్షణకు లోబడి వుండాల్సిందేనని అన్నారు. ఎవరు ఎంత పెద్ద స్థాయిలో వున్నా ప్రభుత్వ శాఖల, విభాగాల సిబ్బంది అందరూ కూడా మన రిపబ్లిక్ పీపుల్స్ రిపబ్లిక్ అన్న విషయాన్ని దృష్టిలో వుంచుకోవాలని అన్నారు.

వెనిజులాపై అమెరికా మరిన్ని ఆంక్షలు

వాషింగ్టన్ : వెనిజులా ఇటీవల ప్రవేశపెట్టిన డిజిటల్ కరెన్సీ లావాదేవీలపై తమ దేశంలో నిషేధం విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం నాడు ఆదేశాలు జారీ చేశారు. అమెరికా ఫైనాన్షియల్ మార్కెట్‌లోకి వెనిజులా ప్రవేశాన్ని అడ్డుకునేందుకే ట్రంప్ ఈ ఆదేశాలు జారీ చేశారని విశ్లేషకులు చెబుతున్నారు. గత జనవరి 9 నుండి వెనిజులా ప్రభుత్వం జారీ చేసిన డిజిటల్ కరెన్సీ, డిజిటల్ నాణాలు, డిజిటల్ టోకెన్ల వంటి వాటితో సహ అన్ని రకాల లావాదేవీలను అమెరికా నిలిపివేసిందని అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఒక ప్రకటనలో వివరించింది. అమెరికా ఆంక్షలను ధిక్కరించేందుకు మదురో సర్కారు ప్రయత్నించినందునే ఈ చర్య తీసుకున్నట్లు అమెరికా ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. గత నెల చివరిలో వెనిజులా తన సొంత క్రిప్టో కరెన్సీని (ఒక రకమైన డిజిటల్ కరెన్సీ లేదా వర్చువల్ కరెన్సీ) ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అమెరికా వ్యాపార సంస్థలు తమ ప్రభుత్వానికి లేదా ప్రభుత్వ ఆధ్వర్యంలోని చమురు-సహజవాయు సంస్థ పిడిబిఎస్‌ఎకు రుణాలివ్వటం, చెల్లింపుల వంటి వాటిపై అమెరికా తనపై విధించిన ఆంక్షలను దీటుగా ఎదుర్కొనేందుకు తమ వద్ద వున్న చమురు నిక్షేపాల అండతో వెనిజులా ఈ కరెన్సీని జారీ చేసింది. అమెరికా ఆంక్షలతో వెనిజులాకు రావల్సిన దాదాపు 300 కోట్ల డాలర్ల బకాయిలు నిలిచిపోయాయని వెనిజులా విదేశాంగ మంత్రి జార్జ్ అరెరిజా గత డిసెంబర్‌లో ప్రకటించిన విషయం తెలిసిందే. ఎన్నికల మోసాలు, అవినీతి, పేదరిక నిర్మూలనలో వైఫల్యం వంటి ఆరోపణలతో వెనిజులా ప్రభుత్వంపై అమెరికా, ఐరోపా యూనియన్‌లు ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే.

సిద్ధమవుతున్న వెనిజులా సైన్యం

కారకాస్ : దేశానికి ఎదురవుతున్న దురాక్రమణ ముప్పును తిప్పికొట్టేందుకు ప్రభుత్వం సైన్యాన్ని సిద్ధం చేస్తోందని వెనిజులా రక్షణ మంత్రి వ్లాదిమిర్ పాడ్రినో ప్రకటించారు. అమెరికా సదర్న్ కమాండ్ దాడుల ముప్పు వున్న ప్రతి ప్రాంతంలోనూ దాదాపు మూడు లక్షల మంది సైనికులను నేషనల్ బొలివేరియన్ మిలిషియా (ఎంఎన్‌బి) సభ్యులను ఏర్పాటు చేసినట్లు ఆయన ట్విట్టర్‌లో పేర్కొన్నారు. అమెరికన్ సదర్న్ కమాండ్ బొలివర్ స్వదేశం వెనిజులాపై దాడి చేసేందుకు సిద్ధమవుతున్నదంటూ వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో రక్షణ మంత్రి పాడ్రినో ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో శాంతి, భద్రత వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ఎంఎన్‌బి సిద్ధమవుతోందని ఆయన వరుస ట్వీట్లలో పేర్కొన్నారు. తమకు సైనికులు కానీ, ప్రత్యేక దళాలు కానీ లేవని, దేశాన్ని ప్రేమించే ప్రజలే తమ దేశాన్ని కాపాడుకునేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు. ఎంఎన్‌బి సభ్యులు సైనిక కవాతులు చేస్తున్న ఒక వీడియోను ఆయన సోషల్ మీడియాలో పెట్టారు. దేశ రక్షణ కోసం తన ఆదేశాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నేషనల్ బొలివేరియన్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్, గవర్నర్లు, మేయర్లను సమన్వయం చేసుకుంటూ ఎంఎన్‌బి ప్రత్యేక దళాన్ని బలోపేతం చేయాల్సిందిగా గత ఏడాది డిసెంబర్‌లో అధ్యక్షుడు నికొలస్ మదురో ఉపాధ్యక్షుడు టెరెక్ ఎల్ అయిసమికి సూచించారు.

మొదటిపేజీ తరువాయి

గోదా'వర్రి'

ఆచంట, పెనుగొండ వంటి పలు మండలాల్లో రైతులు బోర్లు వేసుకుని నీటిని తోడుకుంటున్నారు. దీంతో డీజిల్ ఖర్చు బాగా ఎక్కువవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదనపు నీటి కోసం ప్రతిపాదనలు పంపాం
- ఎన్.కృష్ణారావు, ఎస్‌ఇ, జలవనరులశాఖ, ధవళేశ్వరం

రబీలో నీటి కొరతను నివారించేందుకు బలిమెల, జోలాపుట్ నుంచి రావాల్సిన వాటా కన్నా అదనంగా నీరు రప్పించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. రబీకి నీటి ఎద్దడి రానివ్వం.

సవ్యంగా సాగునీరందడం లేదు
- కోమపల్లి మల్లేశ్వరరావు, కలిగొట్ల (పశ్చిమగోదావరి)



20 ఎకరాల్లో రబీలో వరి సాగు చేపట్టాను. ఆది నుంచీ నీటిఎద్దడితో నరకం చవి చూస్తున్నాం. ఇంజిన్లతో తోడటానికి నీరు లేకుండాపోయింది. రాత్రీపగలు సాగునీటి కోసం పొలాల వద్ద పడిగాపులుగాయాల్సి వస్తోంది. దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టాం. ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు.

ఖర్చులూ వచ్చేలా లేవు
- మాదాసు గోపి, పాందువ్వ (పశ్చిమ గోదావరి)



రబీ సాగు కత్తిమీద సాములా మారింది. నాలుగెకరాలు సాగుచేసి నరకయాతన అనుభవిస్తున్నాను. వంతులవారీ విధానంలోనూ నీరందించడం లేదు. తొలి నుంచీ ఇంజిన్లు వేసి తోడాల్సిన పరిస్థితి ఏర్పడింది. డీజిల్‌కు పెద్దఎత్తున ఖర్చు చేయాల్సి వస్తోంది. ఖర్చు అధికమవడంతో ఈసారి పెట్టుబడి ఖర్చులు రావడం కూడా గగనంగా మారింది.

అప్పుల్ని అర్థం చేసుకోండి

చేయాలంటే అప్పులు చేయక తప్పదన్నారు. జిఎస్టీతో పన్నులు నిర్ణయించే అధికారం రాష్ట్రాలకు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకొనే ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను రూపొందించామని తెలిపారు. గ్రాంట్స్ ఇన్ ఎయిడ్‌పై కేంద్ర ప్రభుత్వానికే విచక్షణా ధికారం ఉంటుందన్నారు. 14వ ఆర్థిక సంఘం వల్ల కేంద్రం నుంచి రాష్ట్రానికి అదనంగా వచ్చిన నిధులేమీ లేవన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో రాష్ట్రంపై అధిక భారం పడుతోందన్నారు. గతంలో 90 :10 నిష్పత్తిలో నిధులు కేటాయించే వారని, ప్రస్తుతం దీన్ని 60:40 నిష్పత్తిలో కేటాయిస్తున్నారని చెప్పారు. ఉత్తరాది రాష్ట్రాల కంటే దక్షిణాది రాష్ట్రాల నుంచే కేంద్రానికి ఎక్కువ ఆదాయం ఉంటున్నా, నిధుల కేటాయింపులు మాత్రం ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువ, దక్షిణాది రాష్ట్రాలకు తక్కువ చేయడం ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. రాజ్యాంగ సమాఖ్య స్ఫూర్తిని కేంద్రం దెబ్బతీస్తోందని, విభజన చట్టంలోని హామీలు, ప్రత్యేక హోదా వచ్చేంత వరకు కేంద్రంపై పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి నిధులు రాకుంటే రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఎలా నెరవేర్చగలదని ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో తలసరి ఆదాయం తక్కువగా ఉందన్నారు. ఇది పెరగాలంటే సంక్షేమ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందని తెలిపారు. అందుకే ఈసారి పూర్తి స్థాయి సంక్షేమ బడ్జెట్ ప్రతిపాదించామన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న పథకాలు కాకుండా, ఈ ఆర్థిక సంవత్సరంలో కొత్తగా మరో 36 సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామన్నారు. నిరుద్యోగులకు భృతి అంశం గురించి మాట్లాడుతూ అలవెన్స్ ఎలా ఇవ్వాలి, ఆర్థిక సహాయం ఏవిధంగా చేయాలనేది మంత్రులు, అధికారులతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో సేవారంగ ఆదాయం తక్కువగా ఉంటోందన్నారు. పట్టణీకరణ తక్కువగా ఉండటమే దీనికి కారణమన్నారు. వ్యవసాయం, నీటిపారుదల రంగాల్లో సుస్థిరాభివృద్ధి సాధించామన్నారు.

భారతీయుల ఉద్యోగాలకు చేటు చేసే అమెరికా చట్టం

వంటి దేశాలకు తరలిస్తున్నారని బిల్లు ప్రవేశపెట్టిన బ్రౌన్ విమర్శించారు. కాల్ సెంటర్ ఉద్యోగాలను విదేశాలకు తరలించటం వల్ల ఓహియోలో అనేక కంపెనీలు మూతపడ్డాయని, దేశవ్యాప్తంగా కాల్ సెంటర్లను కొనసాగిస్తున్న కంపెనీలు తమ కాల్ సెంటర్లను భారత్, మెక్సికో వంటి దేశాలకు తరలించాయని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ విధానం అమెరికన్ ఉద్యోగుల మెడపై కత్తిలా వేలాడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కమ్యూనికేషన్ వర్కర్స్ ఆఫ్ అమెరికా అనే కమ్యూనికేషన్, మీడియా కార్మిక సంఘం నిర్వహించిన అధ్యయనం ప్రకారం అమె రికన్ సంస్థలు తమ ఉద్యోగాలను ఎక్కువగా భారత్, ఫిలిప్పైన్స్‌లకు ఔట్‌సోర్సింగ్ చేస్తున్నాయని వెల్లడయినట్లు తెలిపింది. అమెరికన్ కంపెనీలు ఈజిప్ట్, సౌదీ అరేబియా, చైనా, మెక్సికో వంటి దేశాలలో కూడా కాల్ సెంటర్లు ప్రారంభించినట్లు ఈ అధ్యయ నంలో వెల్లడయింది.

మళ్లీ మ్యాచ్ ఫిక్సింగ్

మొదటిపేజీ తరువాయి

సుమిత్రా మహాజన్ తిరస్కరించారు. దీనిపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి. టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె, బిజెపి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ కుదిరిందని, అందుకే కేంద్ర మంత్రి మాట్లాడేటప్పుడు మౌనం దాల్చరని ధ్వజమెత్తారు. సిపిఎం లోక్‌సభ పక్ష ఉపనేత ఎం.డి సలీం, ఎంపి ఎం.బి రాజేష్, కాంగ్రెస్ ఉపనేత జ్యోతిరాధిత్య సింధియాలు ఈ వ్యవహారంపై స్పీకర్‌ను ప్రశ్నించారు.

అవిశ్వాసం చర్చకు వచ్చేలా చూడండి

అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిగేలా చూడాలని లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్‌కు వైసిపి ఎంపిలు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ప్రారంభం కావడానికి ముందు స్పీకర్‌ను ఆమె కార్యాలయంలో కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంపై తాము ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని అనుమతించాలని స్పీకర్‌ను కోరినట్లు ఎంపి వైవి సుబ్బారెడ్డి తెలిపారు.

మళ్లీ అవిశ్వాస నోటీసులు

టిఆర్‌ఎస్, అన్నాడిఎంకె ఎంపిల ఆందోళనతో వరుసగా మూడు రోజులు వైసిపి, టిడిపి ఇచ్చిన అవిశ్వాస తీర్మాన నోటీసులు తిరస్కరణకు గురవడంతో బుధవారం కూడా అవిశ్వాసంపై చర్చ కోసం నోటీసులు ఇచ్చారు. వైసిపి సభ్యుడు వైవి సుబ్బారెడ్డి, టిడిపి సభ్యుడు తోట నరసింహం ఈ మేరకు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్ స్నేహలతా శ్రీవాస్తవకు నోటీసులు ఇచ్చారు.

పార్లమెంట్‌లో కొనసాగిన ఏపి ఎంపిల ఆందోళన

ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై పార్లమెంట్ వేదికగా జరుగుతున్న ఏపి ఎంపిల ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. పార్లమెంట్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టిడిపి ఎంపిలు ప్లకార్డులు పట్టుకొని ఆందోళన చేశారు. ఏపికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున నినాదాల హోరెత్తించారు. మరోవైపు పార్లమెంట్ ప్రధాన ద్వారం(గేట్ నెంబర్ 1)వద్ద వైసిపి ఎంపిలు ఆందోళన చేపట్టారు. ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఇవ్వాలని వైసిపి ఎంపిలు నినాదాలు హోరెత్తించారు. ఈ సందర్భంగా సభా కార్యక్రమాలకు అడ్డుపడొద్దని, అవిశ్వాసానికి మద్దతివ్వాలని అన్నాడిఎంకె ఎంపిలను వైసిపి ఎంపిలు కోరారు. అవిశ్వాస తీర్మానానికి మద్దతు తెలపాలని మాజీ ప్రధాని, జెడిఎస్ అధ్యక్షుడు దేవెగౌడకు విజ్ఞప్తి చేశారు.

పది పార్టీలు పోరాడుతున్నా పట్టించుకోరా?
గులం నబీ ఆజాద్, కాంగ్రెస్

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా సాధించేందుకు జరుగుతున్న ఆందోళనలను మోడీ సర్కారు పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత గులాం నబీ ఆజాద్ విమర్శించారు. రాజ్యసభలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పది పార్టీలు ఒకే అంశంపై పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు..

ప్రధాన మంత్రి ఎక్కడా? ఎండి సలీం, సిపిఎం

పార్లమెంట్ సమావేశాలు అట్టుడుకుతుంటే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఎక్కడున్నారని సిపిఎం లోక్‌సభా పక్ష ఉపనేత ఎం.డి సలీం ప్రశ్నించారు. పార్లమెంట్ సమావేశాల్లో కీలక పాత్ర పోషించాల్సిన ప్రధాని, కనీసం సభలో కూడా కనిపించటం లేదని విమర్శించారు. పార్లమెంట్ సమావేశాలపై ప్రధాని కనీసం దృష్టి పెట్టడం లేదని దుయ్య బట్టారు. మంగళవారం నాడిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రిమోట్‌తో సభను నడుపుతోందని, తమ అవసరాలకు అనుగుణంగా స్విచ్ ఆఫ్..స్విచ్ ఆన్ చేస్తోందని ధ్వజమెత్తారు. సభ ఆర్డర్‌లో లేదని అవిశ్వాస తీర్మానాన్ని అడ్డుకొనేందుకు స్పీకర్ సాకు చూపుతున్నారని, మరి ఆర్థిక బిల్లు ఆమోదించుకున్నప్పుడు, కేంద్ర మంత్రులు మాట్లాడేటప్పుడు సభ ఆర్డర్‌లో ఉందా? అని ప్రశ్నించారు.

చర్చకు కేంద్రం భయపడుతోంది : తోట నరసింహం

అవిశ్వాస తీర్మానంపై చర్చ జరిపేందుకు కేంద్రం భయపడుతోందని టిడిపి ఎంపి తోట నరసింహం ఆరోపించారు. అవిశ్వాస తీర్మానం పెడితే ప్రభుత్వం పడిపోతుందన్న భయంతోనే బిజెపి అడ్డుకుంటోందని అన్నారు. పార్లమెంటు చరిత్రలోనే దీన్ని చీకటి కోణంగా పేర్కొనవచ్చుని, అవిశ్వాస తీర్మానాన్ని ఎదుర్కొనే ధైర్యం బిజెపికి లేదని అన్నారు. ఈ అంశంపై రాష్ట్రపతి కలుగజేసుకుని పార్లమెంటు ఉభయ సభలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అవిశ్వాస తీర్మానంలో భాగంగా రహస్య ఓటింగ్ పెడితే సొంత పార్టీలోనే చాలా మంది వ్యతిరేకంగా ఓటేస్తారేమోనన్న భయం బిజెపిలో నెలకొని ఉందని ఆయన అన్నారు. మోడీ ఒంటెద్దు పోకడలకు సొంత పార్టీ ఎంపిలే విసిగిపోయి ఉన్నారన్నారు.

హోదా ఎందుకివ్వరు..?

మొదటిపేజీ తరువాయి

చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తుందనుకున్న మిత్రపక్షమే అన్యాయం చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు. విభజన సరిగ్గా జరిగివుంటే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందేదన్నారు. హోదా విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలని అన్ని పార్టీలు పార్లమెంట్‌లో అడుగుతుంటే, ఆ అంశమే చర్చకు రాకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. 'హోదా ఇస్తామని ఎన్నికల్లో మీరూ మేమూ చెప్పాం కదా...మరెందుకు మనసు మార్చుకున్నారు' అంటూ నిలదీశారు. హోదా, పోలవరం, విభజన హామీల విషయంలో కావాలనే కొంతమంది తనపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో వారు చెప్పేవన్నీ అబద్ధాలేన్నారు. అయిదుకోట్ల ఆంధ్రుల ఆకాంక్షయిన పోలవరం విషయంలో చేతులు పెట్టినవారి చేతులే కాలతాయని హెచ్చరించారు. రాష్ట్ర హక్కుల కోసం చిత్తశుద్ధితో పోరాడుతుంటే, తనపై ఒక్కొక్కరిని ఎగదోసి దాడికి పంపిస్తారా? అని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టును తాము చేపడతామని కేంద్రాన్ని ఎప్పుడూ కోరలేదని, తాను అధికారంలోకి రాక ముందే కాంట్రాక్టులు ఇచ్చారని గుర్తు చేశారు. భూసేకరణకు సంబంధించిన దాదాపు రూ.33 వేల కోట్ల ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు.

తాను సీఎంగా ప్రమాణస్వీకారం చేయనని పట్టుబడితేనే పోలవరం ముంపు మండలాలను విలీనం చేస్తూ ఆర్డినెన్స్ తెచ్చారని వివరించారు. పదేళ్లు కుదరకపోతే కనీసం అయిదేళ్లయినా హోదా ఇస్తే నిలదొక్కుకుంటామన్నారు. గత నాలుగేళ్లుగా రాష్ట్రాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి విశాఖలో భాగస్వామ్య సదస్సులు, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ ఏర్పాటు తదితర అంశాలను వివరించారు. టెక్స్‌టైల్ పాలసీ తీసుకొస్తున్నామన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాపై విపక్షాలు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమన్నారు. ఆ జిల్లాను పారిశ్రామిక, ఆటోమొబైల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ఓర్వకల్లు వద్ద మెగా ఇండస్ట్రీస్ హబ్, తిరుపతి-శ్రీసిటీల కేంద్రంగా ఎలక్ట్రానిక్ హబ్ తయారవుతున్నాయని చెప్పారు. దేశంలో అయిదు పారిశ్రామిక కారిడార్లుంటే వాటిలో రెండు ఎపిలోనే చేపడుతున్నామన్నారు. వీటి విషయంలోనూ కేంద్రం ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తోందని దుయ్యబట్టారు. ముంబాయి. బెంగళూరు పారిశ్రామిక కారిడార్లకు కేంద్రమే నిధులు సమకూరుస్తూ, ఎపికి మాత్రం అప్పు రూపంలో నిధులిస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మొదటి ప్రాధాన్యం వ్యవసాయానికి ఇచ్చి 2014-15లో 3.5 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. దేశంలో వ్యవసాయ రంగ వృద్ధి రేటు 0.2 శాతం మాత్రమే నమోదైనట్లు చెప్పారు. సింగిల్ డెస్క్ విధానంతో అవినీతికి తావులేకుండా పరిశ్రమల ఏర్పాటుకు 21 రోజుల్లోనే అన్ని అనుమతులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందువల్లే ఈజ్ ఆఫ్ డూయింగ్‌లో ఏపీ మొదటి స్థానంలో నిలిచిందన్నారు. కాంగ్రెస్ అవినీతి పాలన వల్ల ఫోక్స్‌వ్యాగన్ వంటి పరిశ్రమ రాకుండా పోయిందన్నారు. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు 533 పరిశ్రమలు ఏర్పాటయ్యాయని, ఈ పరిశ్రమల్లో దాదాపు 2,64,792 మందికి ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. ఎంఎస్‌ఎంఇ రంగంలో భవిష్యత్తులో 14 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. మైనింగ్ రంగంపైనా దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. పెట్టుబడుల విషయంలో ఎపి అంటే బయపడే పరిస్థితి నుంచి నమ్మకం కలిగించే స్థితికి తీసుకొచ్చామన్నారు. ఇప్పుడిప్పుడే పెట్టుబడులు వస్తున్నాయని, ఈ సమయంలో కేంద్రం చేయూతనిస్తే నిలదొక్కుకోగలమని అన్నారు. ఇప్పటికైనా కేంద్రం విభజన హామీలు అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం సభను రేపటికి వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ కోడెల శివప్రసాద్ ప్రకటించారు. అంతకుముందు మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి కోసం ప్రభుత్వం చేడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు.

పవన్ పవన్.. జగన్ జగన్..

మొదటిపేజీ తరువాయి

తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. బిజెపి కుట్రను ప్రజలు గమనిస్తున్నారని, బిజెపితో కలిస్తే జగన్, పవన్‌లకు కూడా తగిన బుద్ధి చెబుతారని వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎ1, ఎ2లకు ప్రధాని ఎందుకు అపాయింట్‌మెంట్ ఇస్తున్నారని, బిజెపి, వైసిపి దోస్తీకి ఇది అద్దం పడుతోందన్న అనుమానాలూ వ్యక్తం చేస్తున్నారు. పవన్‌కు పోలవరంపై అవగాహన లేదని, ఆయనకు దమ్ముంటే పోలవరంలో అవినీతిని నిరూపించాలని సవాల్ కూడా విసిరారు. బిజెపి మీటింగ్‌లో వైసిపి రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కనిపించడాన్ని ప్రధాన పాయింట్‌గా తీసుకుని బిజెపికి, వైపిసికి సంబంధం ఉందని విమర్శలు గుప్పిస్తు న్నారు. పవన్, జగన్‌తో బిజెపి కలిసి చంద్ర బాబును ఇబ్బందుల్లో పెట్టే విధంగా ప్రత్యేక ఆపరేషన్ కూడా సాగుతోందన్న వార్తలు వినిపిస్తు న్నాయి.

ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

మంత్రి సిద్ధా రాఘవరావు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు పటిష్ట కార్యచరణ రూపొందించామని అటవీ శాఖ మంత్రి సిద్ధా రాఘవరావు అన్నారు. మంగళవారం సచివాలయంలో ఆయను విలేకర్లతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 193 ప్రాంతాల్లో బేస్ క్యాంప్స్, స్ట్రైక్ ఫోర్స్, 113 చెక్‌పోస్టులు, బోట్ పార్టీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇ - నిఘా ద్వారా ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్ల కాలంలో 3816 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం విక్రయం ద్వారా కేవలం రూ 69.7 కోట్లు ఆదాయమే వచ్చిందన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత అంతర్జాతీయ టెండర్లు పిలిచి పారదర్శకంగా విక్రయిస్తున్నామని తెలిపారు. ఈ మూడున్నరేళ్లలో 5252 మెట్రిక్ టన్నుల ఎర్రచందనం విక్రయం ద్వారా రూ 1231.4 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు. వచ్చే ఏడాది ఏప్రిల్‌లోగా 1412 మెట్రిక్ టన్నుల ఎర్రచందనాన్ని విక్రయించేందుకు కేంద్రం అనుమతులు మంజూరు చేసిందన్నారు. అటవీ చట్టాలను రాష్ట్రంలో పటిష్టంగా అమలు చేస్తున్నామని, వాటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. త్వరలోనే అటవీ సిబ్బందికి అధునాతన ఆయుధాలను అందజేస్తామన్నారు.



నయన తార

నయనతో మొదలు

చిరంజీవి చేస్తున్న సినిమా 'సైరా నరసింహారెడ్డి'. ఇందులో చిరుకు జోడీగా నయన తార నటిస్తుంది. ఈ సినిమా షూటింగ్ డిసెంబర్‌లో ప్రారంభమై జనవరిలో సంక్రాంతికి విరామం తీసుకుంది. ఫిబ్రవరిలో పున:ప్రారంభం కావాల్సిన చిత్రీకరణ ఆలస్యంగా ఈ వారంలో మొదలైంది. టెక్నికల్ సిబ్బంది వంటి కొన్ని సమస్యల వల్ల షూటింగ్‌ను వాయిదా వేస్తూ వచ్చారని తెలిసింది. ఈ రెండో షెడ్యూల్ నయన తార పాల్గొనే సన్నివేశాలతోనే చిత్రీకరించడం ప్రారంభించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతోంది. ఇక నుంచి ఏకధాటిగా చిత్రీకరణ పూర్తి చేయాలని ప్రణాళిక సిద్ధం చేసినట్టు సమాచారం. స్వతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతోన్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో కొణిదెల ప్రొడక్షన్‌పై రామ్ చరణ్ నిర్మిస్తున్నారు. సురేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు.



సంయుక్త హెగ్డే, బ్రహ్మాజీ, అనిల్ సుంకర, నిఖిల్, శరణ్ కొప్పిశెట్టి తదితరులు

ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేస్తున్నారు

- నిఖిల్

నిఖిల్, సిమ్రాన్ పరీన్జా, సంయుక్త హెగ్డే హీరో హీరోయిన్లుగా రూపొందిన సినిమా 'కిరాక్ పార్టీ'. ఏ టీవీ సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. శరణ్ కొప్పిశెట్టి దర్శకత్వం వహించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలైంది. విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా చిత్రబృందం మంగళవారం సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేసింది. నిఖిల్ కెరీర్‌లోనే అత్యధిక ఓపెనింగ్స్‌ను సాధించిందని నిర్మాత అనిల్ సుంకర్ పేర్కొన్నారు. విడుదలైన అన్ని చోట్లా సినిమాకు మంచి స్పందన లభిస్తుందని, థియేటర్లు మొత్తం 80శాతం విద్యార్థులతోనే నిండిపోతున్నాయని ఆయన చెప్పారు. ఓవర్సీస్‌లో అరమిలియన్ వసూళ్లను సాధించిందని చెప్పారు.

నిఖిల్ మాట్లాడుతూ " నా గత సినిమాలకు రాని ప్రశంసలు ఈ సినిమాకు లభిస్తున్నాయి. క్లయిమాక్స్‌కు ముందు సన్నివేశాల్లో నా నటన బాగుందని చెబుతున్నారు. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను చూసి ఎంజాయ్ చేస్తున్నారు. తుని లాంటి చిన్నచిన్న పట్టణాల్లో సినిమా మంచి వసూళ్లను సాధిస్తుంది. ప్రతి ఒక్కరూ సినిమాను ఓన్ చేసుకుంటున్నారు. రెండో వారంలో కూడా ప్రేక్షకుల స్పందన ఇలాగే ఉంటుందనుకుంటున్నాం' అని అన్నారు. తొలి అడుగులోనే మంచి విజయం దక్కడం ఆనందంగా ఉందని సంయుక్త హెగ్డే అన్నారు. సినిమాను పెద్ద హిట్ చేశారని, ప్రతి విద్యార్థీ తమ కథగానే భావిస్తున్నారని దర్శకుడు కొప్పిశెట్టి శరణ్ పేర్కొన్నారు.

ముంబాయిలో శ్రియ వివాహ రిసెప్షన్

కథానాయిక శ్రియ, రష్యాకు చెందిన తన బాయ్ ఫ్రెండ్ ఆండ్రీ కోశ్చీవ్‌ను ఈనెల 19వ తేదీన వివాహం చేసుకున్నారు. ఆండ్రీ రష్యాలో ప్రముఖ టెన్నిస్ క్రీడాకారుడు, వ్యాపారవేత్త. దాదాపు ఐదేళ్లుగా వీరిద్దరూ ప్రేమించుకుంటున్నారు. ఐదేళ్లుగా ముంబాయిలోనే వీళ్ల కలిసి ఉంటున్నారు. మొత్తానికి రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీళ్ల పెళ్లి చేసుకున్నారు. వివాహం నాటి ఫొటోలు, రిసెప్షన్ వీడియోలు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేశాయి. హిందూ సంప్రదాయం ప్రకారం జరిగిన ఈ వేడకకు స్నేహితులు, కుటుంబీకులు, సన్నిహితుల మాత్రమే హాజరయ్యారు. శ్రియ ఎరుపురంగు చీరలో, నగలతో మెరిసిపోయారు. ఆండ్రీ షేర్వాణీ ధరించారు. వివాహం అనంతరం ముంబయిలో ఏర్పాటు చేసిన రిసెప్షన్‌లో వధూవరులిద్దరూ డాన్స్‌లు చేశారు. ప్రస్తుతం శ్రియ 'వీరభోగ వసంతరాయులు', 'తడ్కా' చిత్రాల్లో నటిస్తుంది.



శ్రియ, ఆండ్రీ కోశ్చీవ్



నరేశ్, దుటురోస్

యుఎన్‌ఓ కౌన్సిల్ జనరల్‌గా నరేశ్

ఐక్యరాజ్యసమితి(యుఎన్ఓ) కౌన్సిల్ జనరల్ (కల్చరల్ ఎఫైర్స్)గా నటుడు సీనియర్ నరేశ్ నియమితులయ్యారు. దీనికి సంబంధించి ఈనెల 17న నరేశ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ఫిలిప్పిన్స్ రోడిగ్రో ఆర్.దుటురోస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సౌత్ ఈస్ట్ ఏషియా ఛాన్సలర్ జనరల్, ఇండియన్ అంబాసిడర్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 'కేవలం నటుడిగానే కాకుండా సామాజిక దృక్పథాన్ని గుర్తించి ఈ బాధ్యతాయుతమైన పదవిని ఇచ్చాం. ఐక్యరాజ సమితి కౌన్సిల్ జనరల్‌గా నియమితులైన మొట్టమొదటి నటుడు డాక్టర్ వి.కె.నరేశ్" అని అన్నారు. ఇదే సందర్భంలో నరేశ్ తన సెకండ్ డాక్టరేట్ (హెచ్‌ఈ హీజ్ ఎక్స్‌లెన్స్)ను కూడా అందుకోవడం విశేషం. యూనియటెడ్ నేషన్స్ గ్రూప్‌కి చెందిన యున్ఐసీడీఆర్‌హెచ్ఆర్‌పీ ఈ డాక్టరేట్‌ను అందించింది.

'గులేబకావళి' గీతావిష్కరణ



కల్యాణ్, జీవిత, మల్కాపురం శివకుమార్, రసమయి బాలకిషన్, ఎన్. శంకర్ తదితరులు

ప్రభుదేవా, హన్సిక హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ చిత్రం 'గులేబకావళి'. కల్యాణ్ దర్శకత్వం వహించారు. రేవతి ప్రధాన పాత్ర పోషించారు. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని అదే పేరుతో తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. వివేక్ మెర్విన్ సంగీతం అందించిన ఈ చిత్ర గీతాలు హైదరాబాద్‌లో విడుదల చేశారు. బిగ్‌సీడీని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖసారథి రసమయి బాలకిషన్ విడుదల చేశారు. ఆడియో సీడీలను తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ ఆవిష్కరించారు. తొలి ప్రతిని జీవితా రాజశేఖర్ అందుకున్నారు. ఈ సందర్భంగా ఎన్.శంకర్ మాట్లాడుతూ హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు మిస్టరీ, సస్పెన్స్, యాక్షన్ అంశాలు మిళితమైన అందమైన చిత్రమిది. నిధి అన్వేషణ నేపథ్య కథాంశాలతో దక్షిణాదిలో వచ్చిన సినిమాలన్నీ పెద్ద విజయాల్ని సాధించాయి. ఈ సినిమా ఆ జాబితాలో నిలవాలి' అని తెలిపారు. తెలుగు, తమిళ నేటివిటీకి సరిపోయే కథ ఇదని, అందరికీ నచ్చే విధంగా ఉంటుందని దర్శకుడు కల్యాణ్ చెప్పారు. మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'చెన్నైలో ఐదోవారంలో ఈ సినిమా చూశాను. తమిళ భాష రాకపోయినా సాధారణ ప్రేక్షకుడిగా సినిమాను చాలా ఎంజాయ్ చేశాను. తప్పకుండా తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందనే నమ్మకముంది. ఏప్రిల్ 6న ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని తెలిపారు.

కామెడీ థ్రిల్లర్ 'ఉగ్రం'



'ఉగ్రం'చిత్రంలో జేడీ చక్రవర్తి

నక్షత్ర మీడియా పతాకంపై ఖాసిం సమర్పణలో జె.డి. చక్రవర్తి హీరోగా, అమ్మరాజశేఖర్ దర్శకత్వంలో 'నక్షత్ర' రాజశేఖర్ నిర్మించిన యాక్షన్ కామెడీ థ్రిల్లర్ చిత్రం 'ఉగ్రం'. ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తిచేసి ఈ సమ్మర్ కానుకగా చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. చిత్ర నిర్మాత నక్షత్ర రాజశేఖర్ మాట్లాడుతూ 'జె.డి.చక్రవర్తి కెరీర్లో ఉగ్రం ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుందని ధీమాగా చెప్పగలం. యూత్‌ని విపరీతంగా ఆకట్టుకుంటుంది. యాక్షన్‌కు, నేపథ్య సంగీతానికి మంచి ఆస్కారముంది. ప్రస్తుతం షూటింగ్ పూర్తయింది' అని చెప్పారు.

ఒకటే లైఫ్



'ఒకటై లైఫ్' మోషన్ పోస్టర్ విడుదల చేస్తున్న జీవా, జితిన్ రమేష్, వెంకట్ తదితరులు

సూపర్ గుడ్ ఫిలింస్ అధినేత ఆర్.బి.చౌదరి తనయుడు జితన్ రమేష్ హీరోగా చేస్తున్న సినిమా 'ఒకటే లైఫ్'. లార్డ్ వెంకటేశ్వర ఫిలింస్ పతాకంపై నారాయణ్ రామ్ నిర్మిస్తున్నారు. ఎం.వెంకట్ దర్శకుడు. శృతి యుగల్ కథానాయిక. సుమన్ ప్రధాన పాత్రలో కన్పించనున్నారు. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్ర ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో జీవా విడుదల చేశారు. 'ఒకటే లైఫ్' మోషన్ పోస్టర్ చాలా ఆసక్తిగా ఉందని ఈ జీవా అన్నారు. సరికొత్త కథాకథనాలతో తెరకెక్కతోన్న ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుదని చెప్పారు. టెక్నాలజీ పేరుతో పరుగులెడుతోన్న నేటితరం మానవ సంబంధాలకు, భావోద్వేగాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న కాన్సెప్ట్‌తో తెరకెక్కుతోన్న చిత్రమిదని దర్శకుడు తెలిపారు.



ఐశ్వర్య ఉల్లాస్

'కృష్ణం' యథార్థ ఘటన

పి.ఎన్.బి. క్రియేషన్స్ పతాకంపై యదార్థ సంఘటనల ఆధారాంగా తెలుగు, మలయాళం, తమిళ్ భాషల్లో రూపొందుతున్న చిత్రం 'కృష్ణం'. అక్షయ్ కృష్ణన్, ఐశ్వర్య ఉల్లాస్ జంటగా నటిస్తున్న ఈ చిత్రాన్ని దినేష్ బాబు దర్శకత్వంలో నిర్మాత పి.ఎన్.బలరామ్ నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఏప్రిల్‌లో విడుదలకు సిద్ధమవుతోంది. నిర్మాత పి.ఎన్.బలరామ్ మాట్లాడుతూ ' తన జీవితంలో జరిగిన వాస్తవ ఘటన ఆధారంగా రూపొందిన సినిమాలో.. తానే కథానాయకుడిగా నటించడమనేది ప్రపంచ సినిమా చరిత్రలోనే ఇప్పటివరకు ఏ చిత్రం విషయంలోనూ జరగలేదు. మొట్టమొదటి సారిగా అలా ఓ చిత్రం తెరకెక్కింది. మలయాళం, తెలుగు, తమిళ్ భాషల్లో రూపొందిన ఈ చిత్రం అక్షయ్ కృష్ణన్ అనే ఓ యువకుడి జీవితంలో జరిగిన ఘటన ఆధారంగా తెరకెక్కింది. అని తెలిపారు.

కాజల్ పాత్రలో సారా అలీఖాన్



ఎన్టీఆర్, పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'టెంపర్' చిత్రం బాలీవుడ్‌లో రీమేక్ అవుతున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ పాత్రను రణవీర్‌సింగ్ చేస్తున్నాడు. కాజల్ పాత్రకు సైఫ్ అలీఖాన్ కుమార్తె సారా అలీఖాన్‌ను ఎంపిక చేశారు. ఈ విషయాన్ని రోహిత్ శెట్టి, నిర్మాత కరణ్ జోహార్ సోషల్ మీడియా ద్వారా తెలియజేస్తూ.. సారాతో కలిసి దిగిన ఫొటోను పోస్టు చేశారు. ఈ సినిమాకు రోహిత్ శెట్టి దర్శకత్వం వహిస్తున్నాడు. సారా తొలి సినిమా 'కేదార్‌నాథ్' విడుదలకు ముందే మరో సినిమాలో నటించే అవకాశం వచ్చింది.

రాహ్ కా తేరి ముసాఫిర్ హూన్



గెహనా, సల్మాన్ భట్

అందాల రాశి గెహనా వశిష్ఠ్ 'రాహ్ కా తేరి ముసాఫిర్ హూన్' అంటూ తన నృత్యాలతో అలరించబోతున్నారు. ఆమె నర్తించిన ఈ పాట త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. నిజమైన అందానికి అర్థం చెప్పే ఈ పాటను కాశ్మీర్, గుల్మార్గ్‌లో చిత్రీకరించారు. ఆసిఫ్ పంజ్వాని స్వరపరిచారు. అహ్మద్ షాద్ సఫ్వి ఆలాపించారు. ఈ పాటలో కాశ్మీర్ అందాలతో పాటు.. గెహనా వశిష్ఠ్ అందాన్ని కూడా తన కెమెరాలో చక్కగా బంధించారు నితీష్ చంద్ర. రెడ్ వుడ్ ప్రొడక్షన్ సంస్థ నిర్మించిన ఈ పాటను జీ మ్యూజిక్ ద్వారా విడుదల చేయనున్నారు. ఈ పాటలో గెహనాతో పాటు సల్మాన్ భట్ కూడా కనిపిస్తారు. దీనికి షదబ్ సిద్ధికి దర్శకత్వం వహించారు. ఈ నెల 26న ఈ పాటను జీ మ్యూజిక్ కంపెనీ ద్వారా యూట్యూబ్ ఛానల్‌లో విడుదల చేయనున్నారు.

నేటి యువతరం కోసం...

కె వరల్డ్ మూవీస్ బ్యానర్‌పై రుద్రారపు సంపత్ దర్శకత్వంలో బిష్ణు, హిమాంశి కురానా, అపర్ణ శర్మ హీరోహీరోయిన్లుగా తెరకెక్కుతోన్న సినిమా 'ఏక్'. హరికృష్ణ నిర్మాత. బీయింగ్ హ్యూమన్ అనేది ఉపశీర్షిక. ప్రస్తుతం ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత హరికృష్ణ మాట్లాడుతూ " నేటి జనరేషన్ యూత్ కోసం సరికొత్తగా రూపొందించాం. మానవీయ విలువలతో తెరకెక్కించారు. మంత్ర ఆనంద్ బాణీలు సమకూర్చారు. చిత్రాన్ని ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాం' అని తెలిపారు.



అపర్ణ శర్మ

మలేషియాలో 'నిన్నే చూస్తు'

వీరభద్ర క్రియేషన్స్ పతాకంపై నూతన నటీనటులు శ్రీకాంత్, నితిన్, హేమలత (బుజ్జి) హీరో హీరోయిన్లుగా రూపొందుతోన్న సినిమా 'నిన్నే చూస్తు'. సుహాసిని, సుమన్, భాను చందర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కె.గోవర్ధన్‌రావు దర్శకత్వం. హేమలతా రెడ్డి నిర్మాత. ప్రస్తుతం మూడో షెడ్యూల్ షూటింగ్ జరుపుకుంటుంది. మలేషియాలోని అందమైన లొకేషన్స్‌లో టైటిల్ పాటను చిత్రీకరించారు. ఈ గీతం చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం పేర్కొంది. నిర్మాత హేమలతా రెడ్డి మాట్లాడుతూ 'సంగీత దర్శకుడు రమణ్ రాథోడ్ అద్భుతమైన పాటలను అందించాడు. ఈ టైటిల్ సాంగ్ 'నిన్నే చూస్తు' చాలా శ్రావ్యంగా ఉంటుంది. దర్శకురాలు రేఖ అందించిన కొరియోగ్రఫీ మరో హైలైట్. ఇది మంచి కుటుంబకథ చిత్రం' అని తెలిపారు.



శ్రీకాంత్, హేమలత

సైటెక్ Science & Technology

scitechpage@gmail.com

LiFi దూసుకొస్తున్న లైఫై

వైఫై, మొబైల్ డేటా వాడుతున్నా బ్రౌసింగ్, డౌన్‌లోడ్ చాలా నెమ్మదిగా ఉందని చిరాకు పడుతున్నారా? చిన్న వీడియో చూడాలన్నా ఎక్కువ సమయం ప్రాసెసింగ్‌తో విసుగు పుడుతోందా..? ఇలాంటి వాటన్నింటికీ ప్రత్యామ్నాయం లభించింది. సెకనుకు 1.5 గిగాబైట్ల వేగంతో పనిచేసే ఆయుధం దూసుకొస్తోంది. అదే 'లైఫై' (లైట్ ఫెడిలిటీ). ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీదారు ఫిలిప్స్ ఈ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తాజాగా ఆవిష్కరించింది. ఇకపై మనం వైఫై కాదు, లైఫై (LiFi) పై దృష్టిపెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. వైఫై ఇక చరిత్రపుటల్లోకి జారుకోనుంది. దీని ద్వారా సురక్షితమైన, వేగవంతమైన బ్రాడ్‌బ్యాండ్ ఇంటర్నెట్ సేవలను పొందేందుకు వీలుంటుంది. వైఫై– వైర్‌లెస్ తరంగాల ఆధారంగా పనిచేసే టెక్నాలజీ అని అందరికీ తెలిసిందే. అయితే లైఫై మాత్రం కాంతి తరంగాల ఆధారంగా పనిచేస్తుంది. అంటే ప్రత్యేకంగా తయారు చేయబడిన ఎల్ఈడీ లైట్లలో మోడెమ్‌ను అమరుస్తారు. ఈ క్రమంలో లైట్లను ఆన్ చేసినప్పుడు ఆ మోడెమ్ నుంచి కాంతి తరంగాలు లైట్ల ద్వారా బయటకు వస్తాయి. ఇక స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్‌కు అమర్చబడిన ప్రత్యేకమైన యూఎస్‌బీ డాంగిల్ ఆ కాంతి తరంగాలను గుర్తించి వాటిని ఇంటర్నెట్ తరంగాలుగా మార్చి డివైస్‌లకు ఇంటర్నెట్‌ను అందిస్తుంది. వైర్‌లెస్ తరంగాలు వాడేందుకు వీలుకాని ప్రదేశాల్లో సైతం లైఫైని సులభంగా వాడొచ్చు. దీంతోపాటు ఈ తరహా సాంకేతిక పరిజ్ఞానం వినియోగదారులకు పూర్తి సెక్యూరిటీని అందిస్తుంది. గోడల ద్వారా వైఫై బయటకు కూడా ప్రసారం అవుతుంది. కానీ లైఫై కేవలం ఒకే చోట ఉంటుంది. ఇది వైఫై ప్రయాణించినట్లు గోడల ద్వారా ప్రయాణించదు. దీంతో లైఫై ద్వారా వచ్చే ఇంటర్నెట్‌కు సెక్యూరిటీ ఉంటుంది. ఇతరులు దాన్ని యాక్సెస్ చేయలేరు. కార్పొరేట్ కార్యాలయాల్లో, ఇతర సంస్థల్లో లైఫై ద్వారా ఇంటర్నెట్‌ను వాడితే అది సురక్షింగా ఉండడమే కాదు, సుస్థిరమైన, వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తుంది. ఫిలిప్స్ ఆవిష్కరించిన ఈ లైఫై టెక్నాలజీ ప్రస్తుతం ప్రయోగాత్మక దశలో ఉంది. వాణిజ్యపరమైన వినియోగానికి కూడా త్వరలోనే పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

స్మార్ట్‌ఫోన్ల ఆధునీకరణ పెరుగుతున్న కొద్దీ సాంకేతికత కూడా కొత్త పుంతలు తొక్కుతోంది. మొబైల్‌లో నెట్ వినియోగం కోసం వైఫై, డేటాను వాడటం సహజం. అయితే... ప్రస్తుతం ముందుకొచ్చిన అవసరాల రీత్యా వైఫై కంటే వేగవంతమైన కనెక్టివిటీ కోసం వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. వారి ఆకాంక్షలను తీర్చేందుకు ముందుకొచ్చిన సరికొత్త టెక్నాలజీ లైఫై. ఇది వైఫై కంటే వందరెట్లు వేగంగా పనిచేస్తుంది. ఈ టెక్నాలజీ వినియోగంలోకి వస్తే... నెట్ వినియోగంలో మరిన్ని మార్పులు చోటుచేసుకుంటాయనడంలో అతిశయోక్తిలేదు.

సాంకేతిక రంగంలో సరికొత్త విప్లవం ఈ లైఫై. స్కాట్‌ల్యాండ్ కేంద్రంగా నడుస్తోన్న ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయానికి చెందిన హెరాల్డ్‌హాస్ 2011లో ఈ విధానాన్ని కనుగొన్నారు. అప్పటినుంచే దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ విజిబుల్ లైట్ కమ్యూనికేషన్ టెక్నాలజీతో పరిశోధకులు పలుసార్లు రకరకాల రీక్షలు చేశారు. లైఫై ద్వారా 224 జీబీపీఎస్ సామర్థ్యంతో డేటాను పంపిణీ చేసే అవకాశం ఉంది. ఇది మన కంటితో చూడలేనంత వేగంగా పనిచేస్తుంది. కొన్ని పరిశోధనలు చేసిన తర్వాత ఎల్ఈడీ కాంతికిరణాల ద్వారా సెల్యులర్ టవర్ కన్నా ఎక్కువగా ఈ లైఫై నుంచి డేటా వస్తుందని హెరాల్డ్ హాస్ నిరూపించాడు. టెక్నాలజీతో పాటు, ఫైలెట్ ప్రాజెక్ట్‌లపై దీన్ని పరిశీలించిన శాస్త్రవేత్తలు ఈ స్మార్ట్ లైట్ సొల్యూషన్‌ను విజిబుల్ లైట్ కమ్యునికేషన్ ద్వారా డిజైన్ చేసినట్లు చెబుతున్నారు. ఈ కొత్త వైర్‌లెస్ వ్యవస్థలో 400 నుంచి 800 టెరాహెర్ట్జ్ స్పీడ్‌తో (సెకనుకు 1.5 గిగా బైట్ల వేగంతో) కాంతి.. బైనరీ కోడ్‌లో డేటాను బదిలీ చేస్తుంది. వైర్‌లెస్ ద్వారా జరిగే ఈ ప్రాసెస్ కొరకు హాస్ ఒక యాప్‌ను కూడా రూపొందించి, తమ హాస్పిటల్స్‌లో కూడా ఇన్‌స్టాల్ చేశారట. భవిష్యత్‌లో కాంతి ద్వారా నడిచే ఈ లైఫై వినియోగం ఎక్కువగా ఉంటుందని హాస్ ఘంటాపథంగా చెబుతున్నాడు.

అయితే లైఫైలో కొన్ని లోపాలు కూడా ఉన్నాయి. ఇది గోడలు దాటి వెళ్లలేదు. ఒకే పెద్ద రూంలో ఊహకు అందని వేగంతో ఇది డేటాను డేటాను ట్రాన్స్‌ఫర్ చేస్తుందే తప్ప మరో గదిలోకి వెళ్లలేదు. పెద్ద వాణిజ్య సంస్థల్లో చాలా ఫాస్ట్‌గా డేటా ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ఈ లైఫై బాగా ఉపయోగపడుతుందని దీనికి భవిష్యత్తులో మంచి ఆదరణ ఉంటుందని అంచనా వేస్తున్నారు. 'ఒలెడ్ కాం' అనే ఓ ఫ్రెంచ్ సంస్థ లైఫై వాడకంతో పాటు.. ఈ వ్యవస్థను స్థానిక ఆస్పత్రుల్లో కూడా ఇన్‌స్టాల్ చేసింది. లైఫై ఇప్పటికిప్పుడు వైఫై స్థానాన్ని భర్తీ చేయకపోయినా.. రానున్న రోజుల్లో వైఫైని మరిపించే విధంగా పని చేస్తుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.



లైఫైలో ముఖ్యాంశాలు :

✧ 224 గిగాబైట్స్ వేగంతో పలు పరీక్షల అనంతరం ప్రపంచానికి పరిచయం కాబోతోంది. కార్యాలయాలు, పారిశ్రామిక వాతావరణంలో శాస్త్రవేత్తలు లైఫై పై పరీక్షలు నిర్వహిస్తున్నారు.

✧ ఎల్ఈడీ లైట్ల కాంతి తరంగాలతో కూడిన ఈ కొత్త వ్యవస్థ.. కమ్యూనికేషన్‌కు ఎంతో ఉపయోగంగా ఉండటంతో పాటు.. సురక్షితంగా కూడ ఉంటుందని భావిస్తున్నారు.

✧ 'విజిబుల్ లైట్ కమ్యూనికేషన్'తో పనిచేసే కొత్త లైఫై... వైఫై కన్నా వంద రెట్లు వేగంగా పనిచేస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

✧ కాంతిని ఉపయోగించి సమాచారాన్ని డేటాగా ప్రసారం చేసే ఈ టెక్నాలజీని ట్వాలిన్, ఎస్టోనియాలోని కార్యాలయాలు, పారిశ్రామిక ప్రాంతాల్లో పరీక్షించారు.

– ఈ కొత్త వైర్‌లెస్ వ్యవస్థలో 400నుంచి 800 టెరాహెర్ట్జ్ స్పీడ్‌తో (సెకనుకు 1.5 గిగా బైట్ల వేగంతో) కాంతి.. బైనరీ కోడ్‌లో డేటాను బదిలీ చేస్తుంది. ఈ విజిబుల్ లైట్ గోడలనుంచి ప్రసారం కాదు. పైగా సురక్షితంగా ఉండటంతోపాటు ఎటుపడితే అటు ప్రసరించేందుకు వీలుగా ఉంటుంది.

✧ ఒకే ఎల్ఈడీ నుంచి ప్రసారమయ్యే మిణుకు మిణుకుమనే కాంతి ద్వారా సెల్యులార్ టవర్ కంటే ఎక్కువగా డేటా ప్రసారం అవుతుందని హాస్ ప్రదర్శించి చూపారు. మోర్స్ కోడ్ మాదిరిగానే ఈ వ్యవస్థ కాంతిని ఉపయోగించి ప్రసారం చేసినా.. కంటితో గుర్తించలేనంత వేగంతో కమ్యూనికేషన్ నడుస్తుందని చెప్తున్నారు.

✧ ఈ సురక్షిత వైర్‌లెస్ యాక్సిస్ కోసం హాస్ టీమ్ ఓ ప్లే ప్లగ్‌ను, అప్లికేషన్‌ను రూపొందించారు. 'ఒలెడ్ కాం' అనే ఓ ఫ్రెంచ్ సంస్థ లైఫై వాడకంతోపాటు.. ఈ వ్యవస్థను స్థానిక ఆసుపత్రుల్లో కూడ ఇన్‌స్టాల్ చేసింది. ★

'రైడ్ మోడ్' ఫీచర్‌తో హానర్ 9లైట్



హువాయి సబ్ బ్రాండ్ హానర్ తాజాగా ఒక స్మార్ట్‌ఫోన్‌లో ఆసక్తికరమైన అప్‌గ్రేడ్‌ను అవిష్కరించింది. హెూటా (హువాయ్ ఓవర్ ది ఎయిర్) ద్వారా "రైడ్ మోడ్" ఫీచర్‌తో హానర్ 9 లైట్ కస్టమర్ల కోసం ప్రత్యేకంగా భారత్‌లో విడుదల చేసింది. రైడ్ మోడ్ ఫీచర్‌వల్ల బైక్ నడిపేటపుడు సురక్షితమైన ఫోన్ వినియోగానికి అవకాశం ఉందని ఆ సంస్థ చెబుతోంది. ఈ రైడ్‌మోడ్ ఫీచర్‌ను మెనూలోంచి డ్రాప్ డౌన్ నోటిఫికేషన్ ఆప్షన్ ఎంచుకుకోవడం ద్వారా, లేదా ఫోన్ సెటింగ్స్‌లో రైడ్‌మోడ్ ఫీచర్‌ను ఎంచుకోవడం ద్వారాగానీ యాక్టివేట్ చేసుకోవచ్చు. అలా చేయడంవల్ల ఈ ఫోన్ వినియోగదారుడు బైక్ రైడింగ్‌లో ఉన్నప్పుడు ఏదైనా కాల్ వస్తే... ప్రస్తుతం డ్రైవింగ్‌లో ఉన్నారనీ, ప్రస్తుతం కాల్ ఆన్సర్ చేయలేరనే మెసేజ్ కాలర్స్‌కి అందుతుంది. అత్యవసర సమయాల్లో ఫోన్ తీయాల్సి వస్తే 1 నెంబర్ ప్రెస్ చేయగానే కాల్ ఆటోమేటిగ్గా కనెక్ట్ అవుతుంది. ఈ సదుపాయం మార్చి చివరినాటికి హానర్ వినియోగదార్లకు అందుబాటులోకి వస్తుంది. ఇతర ఫీచర్ల విషయానికొస్తే... 5.65 అంగుళాల డిస్‌ప్లే, ఆండ్రాయిడ్ 8.0 ఓరియో, కిరిన్ 659 ప్రాసెసర్, 3జీబీ ర్యామ్, 32 జీబీ ఇంటెర్నెల్ మెమొరీ, 256 జీబీ ఎక్స్‌టర్నల్ మెమొరీ, 3000 ఎంఏహెచ్ బ్యాటరీ, 13 ఎంపీ ం2ఎంపీ డ్యూయల్ రియర్ కెమెరా , 13 ఎంపీ ం2 ఎంపీ డ్యుయల్ ఫ్రంట్ కెమెరా వంటి ఫీచర్లు ఉన్నాయి. ఈ ఫోన్ ధర రూ.10,999గా ఉంది. నాలుగు కెమెరాలతో బడ్జెట్ ధరలో విడుదలైన ఈ ఫోన్లను ఫ్లిప్‌కార్ట్‌లో అమ్మకానికి పెట్టిన ఆరు నిమిషాల వ్యవధిలోనే మొత్తం అమ్ముడయ్యాయి.

27న హువాయి పీ20లైట్

చైనా స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ హువాయి మరో కొత్త స్మార్ట్‌ఫోన్‌ను త్వరలోనే ఆవిష్కరించనుంది. పీ20 సిరీస్‌లో పీ20 లైట్ పేరుతోమార్చి 27న విడుదల చేసేందుకు సన్నద్ధమవుతోంది. పారిస్‌లో నిర్వహించనున్న ఓ కార్యక్రమంలో పీ20, పీ20 ప్రో స్మార్ట్‌ఫోన్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. ఈ మొబైల్ ధర రూ.30వేలు ఉండొచ్చని ఇంటర్నెట్ ద్వారా తెలుస్తోన్న సమాచారం. ఇతర ఫీచర్ల విషయానికొస్తే... 5.84 అంగుళాల ఫుల్ హెచ్‌డీ డిస్ ప్లే, 1080 X 2280 పిక్సల్స్ రిజల్యూషన్, కిరిన్ 659 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 8.0 4జీబీ ర్యామ్, 64 జీబీ స్టోరేజ్, 16+2 ఎంపీ రియర్ డబుల్ కెమెరా, 3000 ఎంఏహెచ్ బ్యాటరీతో ఆకర్షణీయంగా ఉంది.



భారత్ మార్కెట్లో రెడ్‌మి 5

చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ షావోమి నుంచి మరో బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ విడుదలైంది. రెడ్‌మి 5 పేరుతో తయారుచేసిన ఈ స్మార్ట్‌ఫోన్ అమ్మకాలను మంగళవారం భారత్‌లో ప్రారంభించింది. నాలుగు లక్షలకుపైగా ఫోన్లను విక్రయించడానికి సన్నద్ధమైన షావోమీ... ఈ ఫోన్లను అమెజాన్, ఎమ్ఐ.కామ్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంచింది. గతేడాది డిసెంబర్‌లో చైనా మార్కెట్‌లో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. 7.7 మిల్లీమీటర్ల మందంతో రెడ్‌మి సిరీస్‌లో అత్యంత పలుచనైన స్మార్ట్‌ఫోన్‌గా చెప్పబడుతున్న రెడ్‌మి 5 మూడు వేరియంట్లలో లభించనుంది. ఒకటి– 2 జీబీ ర్యామ్, 16 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధర రూ.7,999 కాగా, రెండోది– 3 జీబీ ర్యామ్, 32 జీబీ స్టోరేజ్ వేరియంట్ రూ.8,999గా షావోమి ప్రకటించింది. మూడోది– 4 జీబీ ర్యామ్, 64 జీబీ స్టోరేజ్ వేరియంట్ ధరను రూ.10,999గా నిర్ణయించింది. బ్లాక్, గోల్డ్, లేక్ బ్లూ, రోజ్ గోల్డ్ రంగుల్లో ఈ ఫోన్లు లభించనున్నాయి. ఫీచర్ల విషయానికొస్తే... 5.7 అంగుళాల హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే,3,300 ఎంఏహెచ్ బ్యాటరీ, ఆక్టా–కోర్ క్వాల్‌కామ్ స్నాప్‌డ్రాగన్ 450 ఎస్‌ఓసీ, 2జీబీ, 3జీబీ, 4జీబీ ర్యామ్ వేరియంట్లు, 16జీబీ, 32జీబీ, 64జీబీ స్టోరేజ్ ఆప్షన్లతో పాటు మైక్రోఎస్డీ కార్డు ద్వారా కూడా విస్తరణకు అవకాశం కల్పిస్తోంది. అంతేగాకుండా 12 మెగాపిక్సెల్ రియర్ కెమెరా, 5 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా విత్ ఎల్ఈడీ సెల్ఫీ లైట్, ఫేస్ రికగ్నైజేషన్, స్మార్ట్ బ్యూటీ 3.0 యాప్ తో తన వినియోగదార్లను మరోసారి అలరించడానికి ముందుకొచ్చింది.



షావోమి 6 స్మార్ట్‌ఫోన్లు

చైనా స్మార్ట్‌ఫోన్ల సంస్థ షావోమి దేశీయ మార్కెట్లో అత్యంత ప్రభావాన్ని చూపిస్తోందనే విషయం తెలిసిందే. ఎప్పటికప్పుడు సరికొత్త ఉత్పత్తులతో తన సత్తా చాటుతోంది. తాజాగా ఈ సంవత్సరంలో 6 స్మార్ట్‌ఫోన్లను ఆవిష్కరించాలని షావోమి సంసిద్ధమౌతున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా... 100 ఎక్స్‌క్లూజివ్ స్టోర్లను కూడా షావోమి ప్రారంభించాలని ప్లాన్ చేస్తున్నట్లు ఆ సంస్థ చెబుతోంది. కొత్త ఉత్పత్తుల విభాగంలో విడుదలతో పాటు, సాఫ్ట్‌వేర్, ఇంటర్నెట్ స్టార్టప్‌లపై కూడా దృష్టిపెడుతున్నట్లు ఆ సంస్థ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది. దీనికి కారణం... షావోమికి చైనా తర్వాత అతిపెద్ద మార్కెట్ ఇండియానే. భారత్‌లో శాంసంగ్‌ను వెనక్కి నెట్టేసి టాప్ బ్రాండుగా మార్కెట్‌లోకి దూసుకొచ్చేసింది. ఆరేళ్లలో షావోమి టాప్ బ్రాండుగా నిలువడం ఇదే మొదటిసారి. రెండు స్వచ్ఛంద రీసెర్చ్ సంస్థలు విడుదల చేసిన డేటాలో ఈ విషయం వెల్లడైంది. రెడ్‌మి 4కు విజయవంతమైన వెర్షన్‌గా ఇది మార్కెట్‌లోకి వచ్చింది. స్మార్ట్‌ఫోన్‌ల విభాగంలోనే కాక స్మార్ట్‌టీవీ మార్కెట్‌లోనూ పాగా వేయాలని షావోమి చూస్తోంది. 55 అంగుళాల ఎంఐ టీవీ4 లాంచింగ్ అనంతరం, మరో రెండు అఫర్డబుల్ స్మార్ట్‌టీవీలను షావోమి లాంచ్ చేసింది. 32 అంగుళాలు, 43 అంగుళాలలో ఎంఐ టీవీ 4ఏ స్మార్ట్‌టీవీను మార్కెట్‌లోకి తీసుకొచ్చింది.



చిన్నారి



జోక్:

టీచర్ : రవీ! మధ్య యుగాన్ని చీకటి యుగం అని కూడా పిలుస్తారు. ఎందుకు?

రవి : అప్పుడు కరెంటు లేదు కదా టీచర్.. అందుకే!

నేనెవరిని?

బరువెంతో చూపుతాను
ముళ్ళ సూచికల నుంచి
కంప్యూటర్ల దాకా ఎదిగాను
న్యాయదేవత దగ్గరుంటాను?

జవాబు : త్రాసు

నీడ కనిపెట్టండి



పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని బొమ్మలు, వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

కోతుల తొలి శిక్షణా కేంద్రం

పిల్లలూ..! మీరు స్కూలుకు ఎలా వెళతారు? చక్కగా స్నానం చేసి స్కూలు డ్రెస్ వేసుకునేగా. క్లాస్‌లో టీచర్ లేకపోయినా బుద్ధిగా అల్లరి చేయకుండా కూర్చుంటారు కదా! అచ్చుమీలాగే ఎంతో క్రమశిక్షణతో కోతులూ క్లాసులో కూర్చుంటాయట. కోతులేంటి అల్లరి చేయకుండా ఉండటం ఏమిటి? అని ఆశ్చర్యపోతున్నారు కదా! నిజమే పిల్లలూ... థాయ్‌లాండ్‌లోని సూరతథానిలో కోతులకోసం ఒక స్కూలు ఉంది దానిపేరే 'ద ఫస్ట్ మంకీ స్కూల్'. మర్కటాలకు శిక్షణ ఇవ్వడానికి ఏర్పడిన తొలి శిక్షణ కేంద్రం ఇదే. పరిసరాలకు అలవాటు పడేదాకా కోతులను అక్కడ స్వేచ్ఛగా విడిచిపెడతారు. వాటిని మచ్చిక చేసుకుని ఆ తర్వాత శిక్షణ ఇస్తారు. మీకు క్లాస్‌లైతే ఎలా ఉన్నాయో... ఆ స్కూల్లోనూ ఎలిమెంటరీ, సెకండరీ, హైస్కూల్ అని శిక్షణ తరగతులున్నాయి. ఒక్కో క్లాస్‌కు ఒక్కో రకమైన ఫీజులు తీసుకుంటారు. మొదటి రెండు తరగతుల్లో బేసిక్స్ నేర్పిస్తారు. హైస్కూల్ స్టడీస్‌లో ఓనర్ ఎలాంటి శిక్షణ కావాలో చెబితే అందులో శిక్షణ ఇస్తారు. శిక్షణ కోసం టోక్యో(జపాన్)లోని పర్వత ప్రాంతాల్లో జీవించే మకాక్ అనే కోతులను ఎంచుకున్నారు. మిగతా కోతులతో పోలిస్తే ఇవి చాలా తెలివితేటలు కలిగి ఉంటాయి. 1957 నుంచి ఇక్కడ కోతులకు శిక్షణ ఇస్తున్నారు. వీటికి సైకిల్ నడపటం, తాడుపై నడవటం, బాల్‌పై ఒంటికాలుతో నిల్చోవడం వంటి కొన్ని రకాల విద్యల్లో శిక్షణనిచ్చి సర్కస్‌లకు పంపిస్తారు. సోమోపర్న్ అనే రైతు తొలిసారిగా దీన్ని మొదలుపెట్టాడు. ★







నేను గీసిన బొమ్మ





ఎ. పూజిత, 8వ తరగతి అరవింద మోడల్ స్కూల్, కుంచనపల్లి.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com





న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం నాడు భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతులమీదుగా పద్మశ్రీ అవార్డును అందుకుంటున్న కిదాంబి శ్రీకాంత్(బ్యాడ్మింటన్), సోమ్‌దేవ్ వర్మన్(టెన్నిస్), మురళీకాంత్ పెట్కర్ (పారాస్విమ్మర్)

రాణించిన యువకెరటం..

మ్యాన్ ఆఫ్ ది సిరీస్ విజేత వాషింగ్టన్ సుందర్

కుడిచేతివాటం ఆఫ్ స్పిన్నర్, ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ ఇటీవల శ్రీలంకలో ముగిసిన నిదహాస్ టీ20 ట్రై సిరీస్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. కేవలం 18 ఏళ్ళకే టీమిండియాలో చోటు లభించడమే కాకుండా శ్రీలంకలో ముగిసిన టీ20 సిరీస్‌లో అద్భుత బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఏమాత్రం అంచనాలు లేకుండా ఈ టోర్నీకి ఎంపికైన సుందర్‌కు ఈ అవార్డు లభించడం నిజంగా హర్షించదగ్గ విషయమే... అతని మాటల్లోనే ...

ప్ర: మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు రావడంపై మీ అభిప్రాయం?

జ : నేను ముందు ఈ టోర్నీ ఎంపికవ్వడమే ఆశ్చర్యాన్ని కలిగించింది. అలాంటిది నాకు ఈ టోర్నీలో ఉత్తమ బౌలింగ్ చేసినందుకు గాను మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించడం పట్ల నేను సంతోషంతో ఉబ్బి తబ్బిబ్బవుతున్నాను.

ప్ర: 50 ఓవర్ల మ్యాచ్‌లో మణికట్టు స్పిన్నర్లు రాణించిన సందర్భాలున్నాయి... టీ20 ఫార్మట్‌లో మీ ప్రదర్శన అద్భుతంగా ఉంది? దీనిపై మీ స్పందన ఏమిటి?

జ: చాహల్, కుల్దీప్ యాదవ్‌లు మణికట్టు స్పిన్నర్లు... నేను బంతిని వేలితో మాత్రమే తిప్పగలను తప్ప... మణికట్టు స్పిన్నర్‌ను మాత్రం కాదు. టీ20 మ్యాచ్‌లలో బ్యాట్స్‌మన్ ఆడకుండా ప్రతి బంతిని ఆచితూచి వేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో ఒక్క ఓవర్‌లోనే పరుగులు ధారాళంగా సమర్పించుకోవాల్సి ఉంటుంది. 50 ఓవర్ల మ్యాచ్‌లో ఆలోచించుకోవడానికి సమయముండ వచ్చు. కానీ టీ20ల్లో అలాకాదు... పూర్తిగా సన్నద్ధమై మైదానంలోకి దిగాల్సి ఉంటుంది.

ప్ర: మీరు వేసే బంతిని బ్యాట్స్‌మన్ ఎలా ఆడతాడో మీరు ఎలా అంచనా వేస్తారు?

జ: పవర్‌ప్లేలో స్పిన్నర్లులో బౌలింగ్ చేయించే సందర్భాలు చాలా అరుదుగా వస్తాయి. ఎందుకంటే ఆ సమయంలో ఎక్కువ పరుగులు రాబట్టడానికి బ్యాట్స్‌మన్ ఉత్సుకత చూపుతాడు. అందువల్ల నాకు ఎక్కువగా పవర్‌ప్లే అనంతరమే బౌలింగ్ చేసే అవకాశం వచ్చింది. కొన్నిసార్లు మాత్రమే పవర్‌ప్లేలో బౌలింగ్ చేశాను. ఆ సమయంలో పిచ్ కూడా సహకరించడంతో నేను ఈ టోర్నీలు ఆశించిన స్థాయిలో రాణించగలిగాను. మొత్తంమీద నా ప్రదర్శన బాగుందని అభిప్రాయ పడుతున్నాను.

ప్ర: టీమిండియా సారథి రోహిత్ శర్మ, కోచ్ రవిశాస్త్రిలు మీ ప్రదర్శనపై సంతృప్తి చెందారా?

జ: వారిద్దరి సహకారంతోపాటు టీమిండియా సభ్యులందరి సహకారం నాకు చాలా ఉపయోగపడింది. ఈ టోర్నీలో నేను బౌలింగ్ చేసిన సందర్భంలో బ్యాట్స్‌మన్ నేను వేసిన బాల్‌ను బౌండరీకి తరలించినప్పుడు సారథి బౌలింగ్‌లో మార్పులు చేయాల్సిందిగా చెప్పిన మెళకువలు నాకు చాలా ఉపయోగపడ్డాయి. దీంతో నా విశ్వాసం రెట్టింపై అద్భుతంగా బౌలింగ్ చేయడానికి ఉపయోగపడింది.

ప్ర: మీరు ఐపిఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడనున్నారు. ఆ జట్టుకు టీమిండియా సారథి విరాట్ కోహ్లీ సారథ్యం వహిస్తున్నాడు. కోచ్ డానియల్ వెటోరీ సలహాలు ఏవిధంగా మీకు ఉపయోగపడనున్నాయో తెలియజేయండి?

జ: ఐపిఎల్ కంటే ముందే నేను శ్రీలంక టోర్నీలో నాకు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. నా ప్రదర్శనపై ఐపిఎల్ జట్టు సారథి, కోచ్‌లకు నమ్మకముంటే రాయల్ ఛాలెంజ ర్స్ బెంగళూరు తుదిజట్టులోనూ ఎక్కువ మ్యాచ్‌లలో నాకు తప్పక చోటు లభించే అవకాశముందని అనుకుంటున్నాను.

ప్ర : టీమిండియా తరఫున ఇప్పటికే కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్నర్‌గా చాహల్ రాణిస్తున్నాడు. మీరు కూడా కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్నరే.. తిరిగి మరో టోర్నీకి ఎంపికయ్యే అవకాశముందా?

జ : భారతదేశం స్పిన్నర్లకు పుట్టినిల్లు వంటిది. ఇతర దేశాల్లోని పిచ్‌లు పేస్ బౌలింగ్‌కు అనుకూలంగా ఉంటాయి... మనదేశంలోని పిచ్‌లు స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటాయి. అందువల్ల విదేశీజట్లు మనదేశ పర్యటనకు వచ్చినప్పుడు స్పిన్నర్లను ఎదుర్కొనడానికి ఇబ్బందులుపడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ టోర్నీలో నా ప్రదర్శన బాగుందని నేను అనుకుంటున్నా...



కొత్త లుక్‌లో కోహ్లి!



న్యూఢిల్లీ: ఇప్పటికే భిన్న హేయిర్ స్టైల్, టాటూలతో రాక్‌స్టార్‌ను తలిపించే టీమిండియా సారథి విరాట్ కోహ్లి మరోసారి తన హెయిర్ స్టైల్‌ను మార్చాడు. 'స్టైల్ మాస్టర్ ఆలిమ్ మాలిక్ చేసిన గొప్ప కటింగ్' అనే క్యాప్షన్‌తో ఫొటోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశాడు. గతంలోనే కోహ్లి కటింగ్‌ను అనుసరించిన అభిమానులకు తాజా కటింగ్ మరింత ఆకట్టుకుంటోంది.

రబాడపై నిషేధం ఎత్తివేత



దుబాయ్: దక్షిణాఫ్రికా పేస్ బౌలర్ కగిసో రబాడపై రెండు టెస్ట్ మ్యాచ్‌ల నిషేధాన్ని ఐసీసీ మంగళవారం ఎత్తివేసింది. ఆస్ట్రేలియాతో రెండో టెస్టులో అనుచిత ప్రవర్తన కారణంగా మ్యాచ్ రిఫరీ ఆగ్రహానికి గురైన రబాడ 3 డీమెరిట్ పాయింట్లతోపాటు వ్యక్తిగతంగా మొత్తం 8 డీమెరిట్ పాయింట్లు సాధించడంతో రెండు టెస్ట్‌మ్యాచ్‌ల నిషేధం అతనిపై పడింది. ఆస్ట్రేలియా సారథి స్టీవ్ స్మిత్‌వైపు ఉగ్రరూపంలో చూసినందుకు గాను కేవలం ఒక డీమెరిట్ పాయింట్ ఇస్తూ అంతర్జాతీయ క్రికెట్ మండలి(ఐసీసీ) మంగళవారం నిర్ణయం తీసుకుంది. దీంతో రబడా ఆస్ట్రేలియాతో పోటీపడే సఫారీజట్టులో పాల్గొని మిగతా రెండు టెస్టుల్లో బరిలోకి దిగనున్నాడు.

షమీ దుబాయ్‌లో గడిపింది నిజమే : బీసీసీఐ

న్యూఢిల్లీ: టీమిండియా పేసర్ మహ్మద్ షమీ గత నెలలో రెండు రోజుల పాటు దుబాయ్‌లో గడిపిన విషయాన్ని భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు(బీసీసీఐ) ధృవీకరించింది. ఈ మేరకు కోల్‌కతా పోలీసులకు షమీ దక్షిణాఫ్రికా పర్యటన గురించి బీసీసీఐ వివరణ ఇస్తూ, అతను దుబాయ్‌లో గడిపిన విషయాన్ని స్పష్టం చేసింది. దక్షిణాఫ్రికా పర్యటన అనంతరం షమి దుబాయ్ వెళ్లాడని... మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడి అక్కడ పాకిస్థాన్‌కు చెందిన అలిష్బా అనే మహిళ నుంచి డబ్బులు తీసుకున్నాడని షమి భార్య హసీన్ జహాన్ ఇటీవలె ఆరోపించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన కోల్‌కతా పోలీసులు షమి పర్యటన గురించిన వివరాలు ఇవ్వాల్సిందిగా బీసీసీఐకి లేఖ రాశారు. ఈ నేపథ్యంలో కోల్‌కతా పోలీసులు అడిగిన అన్ని ప్రశ్నలకు బీసీసీఐ జవాబులిచ్చింది. 'ఫిబ్రవరి 17, 18తేదీల్లో మహమ్మద్ షమి దుబాయ్‌లో ఉన్నట్లు ఆ లేఖలో బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. దీని ఆధారంగా తదుపరి విచారణ ఉంటుంది' అని జాయింట్ సీపీ ప్రవీణ్ త్రిపాఠి తెలిపారు.

డ్రెస్సింగ్ రూమ్‌ను విధ్వంసం చేసింది షకీబ్-అల్-హసనే

కొలంబో : నిదహాస్ టోర్నీలో బంగ్లాదేశ్-శ్రీలంక చివరి మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌ను విధ్వంసం చేసింది బంగ్లా సారథి షకీబ్-అల్-హసనే అని తేలింది. డ్రెస్సింగ్ రూమ్ అద్దాలు పగిలిపోయిన ఘటనపై దర్యాప్తు చేపట్టిన మ్యాచ్ రిఫరీ క్రిస్ బ్రాడ్.. మైదాన సిబ్బందిని విచారణ చేపట్టారు. అందులో భాగంగా సీసీటీవీ పుటేజీలను పరిశీలించిన ఆయన ఎటువంటి దాడి జరగలేదని నిర్ధారించారు. అందులో షకీబ్ తలుపును బలవంతంగా నెట్టడంతో గదికి ఉన్న అద్దాలు పగిలిపోయినట్లు స్పష్టంగా ఉంది. ఇక శ్రీలంక మ్యాచ్‌లో గందరగోళంపై ఐసీసీ ఆగ్రహం వ్యక్తం చేస్తూ షకీబ్‌తో పాటు మరో ఆటగాడు నురుల్ మ్యాచ్ ఫీజులో కోత విధించిన సంగతి తెలిసిందే.



బిబిఎ చదువులకు విట్, యుఎండి వర్సిటీల మధ్య ఒప్పందం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతిలోని వెల్లూర్ ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్), యూనివర్సిటీ ఆఫ్ మిషిగాన్ డియర్‌బార్న్ (యుఎండి)తో లెటర్ ఆఫ్ ఇంటెంట్ ద్వారా ఒక అవగాహనకు వచ్చింది. దీంతో అమరావతి విట్‌లో బిబిఎ విద్యార్థులు అమెరికా వెళ్లి చదువుకునేందుకు అవకాశం ఏర్పడింది. తన సమక్షంలో సోమవారం రాత్రి జరిగిన ఈ ఒప్పదం గురించి సిఎం చంద్రబాబు మాట్లాడుతూ అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాలతో, పరిశోధన సంస్థల భాగస్వామ్యంతో అమరావతి విట్ విద్యార్థులకు విదేశీ చదువుకు అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. విట్ యాజమాన్యాన్ని సిఎం అభినందించారు. బిబిఎ కోర్సులో చేరే విద్యార్థులు అమరావతి విట్ క్యాంపస్‌లో రెండేళ్ళు, మిగిలిన రెండేళు యుఎండిలో చదవాల్సి ఉంటుంది. చదువు పూర్తయ్యాక ఆ యూనివర్సిటీ నుంచి బిబిఎ డిగ్రీ పొందవచ్చు. అలాగే ఇక్కడ విట్‌లో మూడేళ్ల డిగ్రీతోపాటు డిప్లొమా పూర్తి చేశాక యుఎండిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేయవచ్చు. విట్ వైస్ ప్రెసిడెంట్ శేఖర్ విశ్వనాథన్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి మూడేళ్ల బిబిఎ డిగ్రీ, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో ఏడాది డిప్లొమా కోర్సును ప్రవేశపెట్టామన్నారు. ఇంటర్ చదివిన విద్యార్థులు బిబిఎకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విట్ వైస్ ఛాన్సలర్ శుభాకర్, ఏపి అడ్వయిజర్ వి. రాజు, యుఎండి ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

24, 26 తేదీల్లో ఎమ్మెల్యేలకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ నెల 24, 26 తేదీల్లో శాసనసభ్యులకు క్రీడా పోటీలు నిర్వహించడంతో పాటు 27న కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం అసెంబ్లీలో స్పీకర్ కోడెల శివప్రసాదరావు అధ్యతన జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో సభ్యులు క్రీడల్లో పాల్గొంటారు. క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, టగ్ ఆఫ్ వార్, టెన్నికాయిట్, కబాడి, వాలీబాల్, మ్యూజికల్ చైర్, స్విమ్మింగ్, త్రోబాల్ వంటి 10 విభాగాల్లో ఎమ్మెల్యేలు తమకు నచ్చిన క్రీడలో పాల్గొనేందుకు అవకాశం ఉంది. 27న కల్చరల్ కార్యక్రమం ఉంటుంది. స్పీకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలి వైస్ ఛైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, మంత్రులు యనమల, కాల్వ శ్రీనివాసులు, అచ్చెన్నాయుడు, అయ్యనపాత్రుడు, కొల్లు రవీంద్ర, చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి, విప్ కూన రవికుమార్, అసెంబ్లీ సెక్రటరీ విజయరాజు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అద్దెబస్సు డ్రైవర్లకు పాస్ పరిధి పెంపు

హైర్ బస్ యూనియన్ హర్షం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అద్దె బస్సు డ్రైవర్లకు ఉచితంగా ప్రయాణించే ఉచిత బస్ పాస్ పరిధిని పెంచుతూ ఎపిఎస్ ఆర్టీసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) జి జయరావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అద్దె బస్సు డ్రైవర్లు ఆర్టీసి బస్సులో గతంలో ఎనిమిది కిలోమీటర్లు ఉచితంగా ప్రయాణించేవారు. ఆ పరిధిని 25 కిలోమీటర్లకు పెంచుతున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉచిత బస్ పాస్ పరిధిని పెంచడం పట్ల ఆర్టీసీ హైర్ బస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, అధ్యక్షులు సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ ఉత్తర్వుల్ని ఔట్ సోర్సింగ్ డ్రైవర్లకు కూడా వర్తింపజేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు

- పలు సమస్యలను విన్నవించిన రైతన్నలు
- ఆదుకుంటామని జగన్ భరోసా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

టిడిపి ప్రభుత్వ హయాంలో ఏ పంటకు గిట్టుబాటు ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ విమర్శించారు. ప్రజాసంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలంలోని గ్రామాల్లో వైఎస్ జగన్ పాదయాత్ర నిర్వహించారు. రాజుపాలెం క్రాస్ రోడ్డు, అన్నవరం క్రాస్ రోడ్డు మీదుగా ఉప్పలపాడు వరకూ సాగిన ఈ యాత్రలో పలు ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాలపర్రు వద్ద ఆ పార్టీ పతకాన్ని ఆవిష్కరించారు. పెదనందిపాడు మండలంలోని రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. నాలుగేళ్లుగా సరైన ధరల్లేక తాము తీవ్రంగా నష్టపోతున్నామని పొగాకుతో పాటు పత్తి, మిర్చి, వరి రైతులు జగన్‌కు వివరించారు. ప్రస్తుతం ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగిపోయిందని... కనీస మద్దతు ధరలు రావడం లేదని రైతులు విన్నవించారు. తమ పార్టీ అధికారంలోకి రాగానే ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులకు కనీస మద్దతు ధర కన్నా ఎక్కువ ధర లభించేలా చర్యలు తీసుకుంటామని జగన్ హామీ ఇచ్చారు. తమ పిల్లలు డిగ్రీలు చదువుకున్నా ఉద్యోగాలు రావడం లేదని పలువురు వ్యవసాయ కార్మికులు మొరపెట్టుకున్నారు.

సుగాలీలు తమ సమస్యలు వివరించారు. భవన నిర్మాణ కార్మికులు, దళితులూ వారి సమస్యలను తెలియజేశారు. 2016లో వరద వచ్చి తీవ్ర నష్టం వాటిల్లినా సాయం అందలేదని ముంపునకు గురైన పెదనందిపాడు మండల ప్రజలు జగన్‌కు ఫిర్యాదు చేశారు. గుంటూరు నుంచి పెదనందిపాడు వచ్చిన కార్యకర్తలు కొంత మంది అతిసార తీవ్రతను జగన్‌కు వివరించారు. ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల ఎక్కువ మంది మరణించారని, వేలాదిమంది మంచాన పడ్డారని తెలిపారు. మంగళవారం పాదయాత్ర ఉప్పలపాడు వరకూ కొనసాగగా బుధ వారం చిలకలూరిపేట వరకూ నిర్వహించనున్నారు.



గుంటూరు జిల్లా ఉప్పలపాడులో సుగాలీలతో కలసి పాదయాత్ర చేస్తున్న జగన్

రహదారుల దిగ్బంధాన్ని జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కోసం ఈ నెల 22వ తేదీ ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి పిలుపునిచ్చిన జాతీయ రహదారుల దిగ్బంధానికి వైసిపి పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు పాల్గొనాలని మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. హోదా సాధనలో భాగంగా జరిగే ఏ పోరాటానికైనా, ఏ ఆందోళనకైనా మద్దతు ఇస్తామని ఆయన ప్రకటించారు. పార్టీ విధానంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులను కోరారు.

'జలవాణి' ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

మంత్రి లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జలవాణి కాల్ సెంటర్‌కు వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభి. వృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. నీటి ఎద్దడి ఉన్న చోట ట్యాంకర్లతో క్రమం తప్పకుండా సరఫరా చేయాలన్నారు. సచివాల యంలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా శాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జలవాణి కాల్ సెంటర్‌కు జనవరి నుంచి ఇప్పటి వరకూ 2,545 ఫిర్యాదులు అందగా 1,177 ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు అధికారులు మంత్రికి వివరించారు. ఎన్టీఆర్ సులజ కార్యక్రమంలో భాగంగా ఉద్దానంలో ఏడు మదర్ ప్లాంట్‌లకు ఆరు పూర్తి చేశారని, మరోదానికి ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. కనిగిరిలో మూడు ప్లాంట్‌లకు రెండు పూర్తి చేసినట్లు చెప్పారు. శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలో రూ.402 కోట్లతో 7,787 నివాస ప్రాంతాల్లో 103 ఎన్టీఆర్ సులజ క్లస్టర్‌లు ఏర్పాటు ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రకాశం జిల్లాలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని అదనపు సిబ్బందిని నియమించామని చెప్పారు. వేసవి దృష్ట్యా సాధికార మిత్రలు జలవాణి కాల్ సెంటర్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి జవహర్‌రెడ్డి, కార్యదర్శి రామాంజనేయులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధి హామీ కూలీల సమస్యలపరిష్కారం కోసం నేడు ధర్నా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోసం ఆంధ్రప్రదేశ్ ఉభయ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం విజయవాడ అలంకార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి గ్రామంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని కల్పించాలని, రూ.500 కూలీ ఇవ్వాలని, వడదెబ్బకు, ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ప్రకటనలో పేర్కొన్నారు.

ఏపిలో 5.9 లక్షల ఇళ్లలో మరుగుదొడ్లు లేవు

రాజ్యసభలో కేంద్ర మంత్రి రమేష్ చందప్ప



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 5.9 లక్షల ఇళ్లలో మరుగుదొడ్లు లేవని కేంద్ర పారిశుద్ధ్యశాఖ మంత్రి రమేష్ చందప్ప వెల్లడించారు. 2015-16 నుంచి 2017-18 వరకు గడిచిన మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్వచ్ఛ భారత్ మిషన్ కింద వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1,767 కోట్లు ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. రాజ్యసభలో వైసిపి ఎంపి విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు. ఏపిలో 92 శాతం ఇళ్లలో మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశామని, కేవలం 8.37 శాతం ఇళ్లలోనే మరుగుదొడ్లు లేవని మంత్రి వివరించారు. ఏపి వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కోసం రూ.4,470.66 కోట్లు కావాలని అడగ్గా, తాము రూ.1767 కోట్లను మంజూరు చేశామని మంత్రి వివరించారు.

బిజెపి చేసిందేమిటో చెప్పేందుకే రాజీనామా

ఎపి ఎంఎస్‌డిసి ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిజెపి రాష్ట్రానికి ఏం చేసిందో చెప్పేందుకే రాజీనామా చేసినట్లు ఎపి మెడికల్ సర్వీసెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎంఎస్‌డిసి) ఛైర్మన్ లక్ష్మీపతి వెల్లడించారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌డిఎ నుంచి టిడిపి బయటకు రావడంతోనే రాజీనామా చేశానని, కేంద్రం రాష్ట్రానికి చేసిన వాటి గురించి వివరించాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. ఇచ్చిన డబ్బును ఏం చేస్తున్నారని మాత్రమే అడుగుతున్నారని, రాష్ట్రం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి ఉందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా కేంద్రం ఎపిని ఆదుకుంటుందన్నారు. బిజెపికి పవన్‌కు సంబంధం లేదన్నారు. బిజెపికి పదవులు ముఖ్యంకాదన్నారు. తన రాజీనామా పత్రాన్ని ముఖ్యమంత్రికి సమర్పించినట్లు తెలిపారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68